పొందుగలిగిదేవు అని గంధర్వుడాడెను. లెమ్ము యుద్ధమునకని అర్జునుడనగా వాడు ధనుర్ధారియై అల్లాత్రాటిని కట్టి కోపముతో వచ్చి సర్పములవంటి బాణములను వేసెను. అర్జునుడు ఆగ్నేయాస్త్రమును వేయగా అది అంగారపర్ణుని రథముమీదబడి భస్మము చేసెను. వాడు నేలపైనిలుచుచుండెను. ఓరీ నీపేరేమని అర్జునుడనగా అంగారపర్ణుడని గంధర్వుడు చెప్పెను. మరొకపేరేమని అర్జును డడుగగా చిత్రరథుడని గంధర్వుడు చెప్పెను. దగ్ధరథుడని చెప్పుకొనుమని అర్జునుడనెను వాడు అర్జునునిమీదికి రాగా యుద్ధమే జరగునని అర్జునుడు వాని శిఖలో చేయివేసెను. వాడు అప్సరసలతోడ నుండు సహవాసముగలుటచేత వానిజుట్టు పుష్పములతో గూర్చియుండెను. అర్జునుడు దానిలో చేయివేసి అడుగగా ఆగంధర్వునిభార్యయగు కుంభీనస యిక తప్పదని తలచి పరుగెత్తుకొనివచ్చి పతిభిక్షమీయుడని ధర్మపుత్రుని పాదములు పట్టుకొనెను. పతివ్రతాశిరోమణి. భర్తకు ఆపదవచ్చెను. ఇపుడు వారిని నమ్రతతో అడుగుకొనరాదని యుద్ధమైనయెడల భర్త పోవునని తలచి వచ్చెను. ధర్మరాజు అర్జునా విడువుమనెను. గంధర్వుడు పుర్భా లాడెను. పుంఖానుపుంఖముగ బాణములు వేసెను వాని కొట్టవచ్చునుకదా. విడిచెను. ఎవరి పాదములనైన పట్టుకొని భర్తను కాపాడవలయునని పతివ్రత తలపవలయును. ధర్మపుత్రుడు అర్జునా చంపుమురా అనవలసియుండగా శరణాగతరక్షకు డగుటచేత క్రోధములేనివాడై అర్జునా పతివ్రతరా విడువుమురా యని దుఃఖించుచు చెప్పెను. అన్నా నీవు యుద్ధముచేయుట తెలియుదు నోరుమూసికొనియుండుమని అర్జును డనెనా. అన్నా విడిచితినని విడిచెను. ఓరీ పోయి యేవురు వచ్చిరి. పాలితిని అని చెప్పుకొనవలెను. ధర్మపుత్రుడు విడువుమనెను బ్రతికితిని అని చెప్పుకొనుము. మహానుభావుడు ధర్మాత్మ విడిచినాడని చెప్పుకొనుమని అర్జునుడు గంధర్వుని పంపెను. వాడు పాండవులను సేవించి యిపుడు అధర్మాత్మ విడువమనకున్న పోయి యము దునే యునితల అర్జునునికి శిష్యుడై ఆగ్నేయాస్త్రమును ఉపదేశముపొంది మీరుపోవుచున్నారుకదా. ఎచటికి పోయినను ఒంటరిగ పోరాదు. బ్రాహ్మణుడు తోడనుండవలయును. ధౌమ్యాచార్యులను పురోహితునిగ పంపుడు. బ్రాహ్మణుడుండినయెడల సకల దురితములు పోవును అని ఆగంధర్వుడు అనేక కథలు చెప్పెను.

---

## (17) కురుమహారాజు జననము.

---

చిత్రరథుడను గంధర్వుడు గాంధర్వాస్త్రము ఉపదేశించెదననగా పెద్దలయొద్ద ఉపదేశము పొందినవాడ నగుటచేత వలదని అర్జునుడనెను. నాలుగువందల గుర్రముల నిచ్చెదనని వాడనగా మేమిపుడు బ్రాహ్మణవేషములతో నున్నాము. సమయము వచ్చినపుడు అడిగినం పెదనని అర్జునుడనెను. వారిరువుల స్నేహముచేసికొనిరి. పాండవులు

గంధర్వునిమాట విని మార్గమధ్యమున తపమాచరించుచుండిన ధౌమ్యాచార్యులను పురోహితునిగ చేసికొనుటకు కారణమేమనగా, గంధర్వునికిని అర్జునునికిని యుద్ధమై పిమ్మట స్నేహముకాగా వాస్తవముగ మీరెవరని గంధర్వుడడిగెను. స్నేహమువలన నుబట్టి పాండవులమని అర్జును డనెను. గంధర్వుడు.— అటులా కనుకనే నన్ను జయించితిరి. ఎచటికి పోయెదరు. అర్జునుడు.— వేదవ్యాసునిమాటనుబట్టి పెండ్లికి పోవుచున్నాము. గం— అటులైన సమర్థుడగు ఒక బ్రాహ్మణుని యేర్పరచుకొనుము. ఆ బ్రాహ్మణుడు తోడనుండిన యక్ష, రాక్షస, గంధర్వ పిశాచ ఉరగ పక్షుల దోషముండదు. మీరు క్షేమముగ నుండవలయునని ప్రార్థించుచు భగవద్ధ్యానము చేయుచు నిగ్రహానుగ్రహములు కలిగియుండు బ్రాహ్మణు డుండినయెడల బాధలు కలుగవు. మీరు వీరిసంగతుల యోచించుచుండవలయును. బ్రాహ్మణుని క్షేమమును విచారించుచుండవలయును. అ— మేము శూరులమే మాకును బ్రాహ్మణు డుండవలయునా. గం— కేవల వంశశుద్ధిచేతను, శౌర్యముచేతను క్షత్రియునికి క్షేమము కలుగదు. రాజ్యము లభించదు. తాపత్యా! చిత్రరథుడను దగ్ధరథుడ నైతినికదా. కావున యెంతటి శూరుడైనను బ్రాహ్మణుని వద్దనుంచుకొనవలయును. అ— ఎంతటి శూరులైనను క్షత్రియులకు ఒక బ్రాహ్మణు డుండవలయుననియు, వారి ఆశీర్వాదము ఉండవలయు ననియు చెప్పుచున్నావు. ఇదివరకేను 'తాపత్యా' యంటివే దానియర్థము తెలియలేదు. చెప్పుము.(అది ఆశీర్వచనమా తిట్టా స్తోత్రమా అని అర్జునుడు తెలియగోరెను) గం— ఇదివరకు తాపత్యశబ్దమును వినలేదా.ఎవరైనను పిలువలేదా.అ— ఇదివరలో నెవరు మాటలాడిరి.అల్లాడుచుండుటేకద.గం— అటులైన కథచెప్పెదను వినుము.జగత్ప్రకాశకుడైన సూర్యునికి ఒకకూతురు. దానిపేరు తపతి.ఆమె గుణములచేత సూర్యునికి తగుమైన కూతురు.సంవరణుడను రాజు సూర్యోపాసనము చేయుచుండెను. ఆరాజునకు సూర్యునిమీద పరమభక్తి. సూర్యుడు అల్లుని వెతకుచుండి మహాధార్మికుడు రూపవంతుడు బిడ్డకు తగుమైనవాడు అని తలచి సంవరణుని కీయదలచెను. తన్నుసహా ఉపాసించుచు తేజస్విగనుండగా యిచ్చుటకు నిశ్చయించి సూర్యుడు స్వస్థానమున నుండెను. రాజు వేటకు బయలుదేరెను. మహాపరాక్రమశాలియైనరాజు పర్వతప్రదేశములలో వేటాడెను. ఆరాజు వచ్చినపుడు ఆ సమయమున వనప్రదేశములలో సంచరించుచుండగా రాజు ఆమెను చూచెను. అసదృశి.ఈలోకమున దీనివలె నుండదు.బ్రహ్మ యెల్లవారిని సృజించినటుల దీని సృజించలేదు. దేవాసుర మనుష్య క్రిమికీటాదులను సృజించి అందరి సారము నెత్తి యీకన్యను సృజించెను అని రాజనుకొనెను. సూర్యుడు సంకల్పించగా భగవంతుడు తగునటుల చేయవలదా. దీని చూడగనే రాజుకు మోహము కలిగెను. దీని పెండ్లాడిన బాగుగనుండునని చూడగా మన్మథవికారము కలిగెను. తగుమైన యేర్పాటుచేసి పోవలయునని తోచినందున రాజు పలికెను. దివ్యరూప. సూర్యునివలె ప్రకాశించుచు తిరుగుచుండగా

రాజు సమీపమునకు పోయి కన్యా నీవెవతెవు. ఎవనికూతురవు. ఏకాకివై యీనిర్జన
ప్రదేశమున సంచరించుచున్నావు. కారణమేమి అని పాదాది కేశపర్యంతము వర్ణించి
అడిగెను. మన్మథుడు ప్రేరేపించి అడ్డగించుచున్నాడని ఆమె కొంచెము నవ్వుకొని
అదియేమి శృంగారవర్ణనచేయుచున్నావు. నేనెవతెనో కొంచెమైనను యోచించకయే
మాటలాడనగునా అనెను. చమత్కారి. సమీపమునకు రాగనే యేలయనుచున్నది అని
రాజు జాగ్రతపడి ఊరకనే వేడుకగా అడిగితి ననెను. పరిహాసము చేయతగిన బంధు
త్వము యేర్పడియున్నదా అని తపతి అడిగెను. లేదు. చిన్నదానివిగ నున్నావు. నేనువేటా
డుటకై వచ్చియున్నాను.మార్గములో కనుబడినవారిని విచారించవలయును.నిర్జనప్రదేశము
లో నున్నావని అడిగి తెలిసికొని చేయవలసినది ఉండెనేని చేయవలయునని అడిగితినని రా
జనెను. ధర్మబుద్ధితో అడుగుచున్నాడని తలచి, మేఘమున దాగిన మెరుపుతీగవలె ఆమె
అంతర్ధానమాయెను.రాజుకు యేమియును తోచలేదు.ప్రలాపనముచేయనారంభించి నిశ్చే
ష్టితుడై మూర్ఛనొంది మరలలేచి యువతీ! యెందుదాగితి వనుచుండెను.ఇటుల అల్లాడు
వాడెడు. అసహాయశూరుడు. శత్రులను సమూహ సమూహములుగ జయించువాడు.
మన్మథుని జయించుటకు కాలేదు. విషయము పెద్దది. గమనింపుడని చూపిరి. కులశీలా
దులు విచారించి పెండ్లాడ దలచియుండగా అంతర్ధాన మొందెను. అపుడు గొప్పవాని
కన్యగా నుండవలయునని రాజు అనుకొనెను. ఈయన యేమిచేయునో అని తపతి అదృ
శ్యయై సంచరించుచుండి మిగుల చింతించుచున్నాడని సమీపమునకు వచ్చి ఆహా సింహ
వ్యాఘ్రాదులను హింసించువాడు నాకై అల్లాడుచున్నాడే. నేను సింహాదులకంటెను
హెచ్చైనదాననని అనుకొనెను. స్త్రీలను అబలలు (అనగా బలములేనివారు) అని కవులు
అందురే వారు మూఢులు. స్త్రీలకా బలములేదు. ఈసంవరణరాజు పదివేల శత్రులను
జయించువాడు. రథ గజ తురగ పదాతులతోడ వచ్చెను. ఇది సైన్యములులేక బ్రహ్మ
దులను వశ్యుల చేసికొనును. అబల లనవచ్చునా అని యొక కవియనెను.. మిగుల అంద
కత్తె.అందునవే రాజు అటుల మోహించి అల్లాడెనని వైశంపాయనాచార్యులనిరి.రాజు
కన్ను తెరువగా తపతి యెదుట నుండెను. రాజు ఆమెపాదములమీద పడి నీకు స్వాధీ
నుడను. ఈయఖండ భూమండల చక్రాధిపత్యమును నీచరణారవిందములలో సమర్పిం
చెదను. మన్మథునియొక్క పంచబాణములు చల్లగ లోపలపోయి భేదించుచున్నవి.
గాంధర్వవివాహము చేసికొనుము. నేను నిరపరాధుడను. నీవు పెండ్లాడతగిన స్థితిలో
నున్నావు. లేకున్న అడుగుదునా యెంతసేపుగ ప్రార్థించుచున్నాను బదులాడరాదా
ఇందుముఖీ రక్షింపుము, కలకంఠకంఠ నీవాగమృతముచేత నామన్మథతాపము పోవును.
ఇటులడ్డగియీ మాటాడవేలనే అని ప్రార్థించెను. నేనును చిన్నదానను. మన్మథవికార
ముచేత ప్రార్థింపుచున్నాడు. లేకున్న యెపుడో ఊరుచేరునే. నేను మరల పోతినేని
ప్రాణము విడుచును అని తలచి తపతి రాజా నేను పెండ్లాడవచ్చును.తండ్రి యొకరికిచ్చిన

వాని పెండ్లాడవలయును.మీరడిగినటులైన ఆయన యిచ్చును. తండ్రియొక్క అనుమతి లేక పెండ్లాడను.నాపై వాస్తవముగ ప్రీతియుండిన వారిని అడుగుము. ఏమో పోనిమ్మనియుండిన పొమ్ము. మాతండ్రిని అడుగుము. అనెను. దానికి యిష్టమున్నదని రాజుకు తోచగా, తండ్రియొప్పిన నీకు యిష్టమేనాయని అడిగెను. ఇక యిచ్చటనుండిన చేయి పట్టి యీడ్చునని తోచి మాతండ్రియొద్దకువచ్చి అడుగుమని అంతర్ధానమొందెను. తపతి ఆకాశమార్గమున పోగా రాజు కొంతదూరమువరకు చూచుచుండెను. తెలియకపోగా మరల క్రిందపడి ప్రలపించుచు తపతీ తపతీ తపతీ ముందు మూర్ఛనొందగా కనికరముచేత వచ్చితివి. మాటలాడితివి. మరలరమ్ము. మాట్లాడుము. అనెను. మంత్రులును సైన్యములును వెనుకనుండిరి. రాజు యెచటి కేగెనోయని మంత్రి వెతకుచురాగా మూర్ఛనొందియుండెను. మంత్రి రాజును స్పృశించగా కన్నులు తెరచెను. సమాచారమేమని మంత్రి యడుగగా చక్రవర్తి ఒక యువతిని చూచితిననుటకు సిగ్గు. ఏమియును చెప్పుటకులేక మంత్రితో రహస్యముగ చెప్పదలచి మంత్రీ' వారినందరిని పంపుమనెను. అందరిని పంపివేసెను. మంత్రీ ఒకతెను చూచితిని. మనసు లయించెను. అడిగితిని. మీకు తెలియనిదా తండ్రినడుగుమని పోయెను. దాని పెండ్లాడకున్న ఊరికి రాను. సూర్యుని యొద్దకు నేనెట్లుల పోగలను. మనుష్యుడైన యెవడైనను అడుగుదును అని రాజు చెప్పగా, సూర్యుని నారాధింపుడని మంత్రి చెప్పెను. నేను సూర్యునారాధించి పెండ్లాడియే వచ్చెదనని మంత్రితో నెప్పిపంపి రాజు ఊర్ధ్వముఖుడై రెండుకన్నులతో సూర్యుని చూచుచు తపసుచేయ నారంభించెను. మనసు సూర్యునిలో లయించినకదా. సూర్యుని కూతురిలో లయించెను. జప తప ధ్యానములు పోయెను. సూర్యునిపై కన్నులుంచి మనసులో సూర్యపుత్రి నుంచెను. ఏనవలన యీధ్యానము కాదని తలచెను. అర్జునా అందుకేకద బ్రాహ్మణుడు కావలయు నంటిని. ఆరాజు కార్యము అగుటకై వసిష్ఠుని దలచెను. వసిష్ఠుడు పండ్రెండవనాడు వచ్చిరి. సూర్యపుత్రిని పెండ్లాడవలయును లేకున్న ఊరికి పోను అని రాజు చెప్పగా, యింతయేనా యేర్పాటు చేసెదనని వసిష్ఠుడనెను. ఎటులపోవునో అని రాజు చూచుచుండగా వసిష్ఠుడు కొంచెము కొంచెముగ నెగిరి సూర్యసన్నిధానమునకు పోయి నిలిచిరి. మహాతేజస్వీరాగా సూర్యునికి దేహము మండెను. వసిష్ఠులు మూడుశ్లోకములచేత సూర్యుని స్తుతించగా సహించక వసిష్ఠమహర్షీ యేమికావలయు ననెను. కన్యనీయవలయునని వసిష్ఠులనగా యిచ్చితినని సూర్యుడనెను. వసిష్ఠుడు దానిపిలుచుకొనిపోయెను. సూర్యుడు ఉదకధారాపూర్వకముగ కన్యనిచ్చెను. పాణిగ్రహణ మాయెను. ఊరికి పోవుదమాయని వసిష్ఠులనగా మిగుల ఆశజెంది మిమ్ము రప్పించి పెండ్లాడితిని. నిశ్చింతగా పండ్రెండేడులు యీవనప్రదేశములలో నుండి వచ్చెదను.మంత్రు లున్నారు. మీరు చూచుకొనుడు అని రాజు చెప్పెను.వసిష్ఠుడు పోయెను. ఇతడు రాజ్యమును మరచి శృంగారరసములను అనుభవించుచుండెను.

భగవద్గీత ౪ అధ్యా ౩౬ శ్లో వారివారి ధర్మములను వారువారు చేసినట్లైన జీవితారాధన మగును. అట్లుచేయకుండుట పొరపాటు అనిచెప్పబడెను. సంవరుణమహారాజు రాజ్యమున లేకుండగా పంౘ్రెండేడులు వర్షము కురియలేదు. భగవద్గీత ౩ అధ్యా 14, 15, 16, శ్లోకములలో చెప్పినట్టుల జగత్ చక్రము నడువవలదా. రాజా నీవు రావలయును లేకున్న లోకము చెడును అని వసిష్ఠులు రాజును ప్రార్థించి పిలిచెను. సంవరణుడు తపతితోడ రాజ్యమునకు వచ్చెను. ఆయన వచ్చి చేరగనే సకలసస్యములు బాగుగ వృద్ధియాయెను. జగత్తుకు క్షేమము కలిగెను. అర్జునా సూర్యపుత్రిని పెండ్లాడిన రాజుకు కురువు పుట్టెను.తపతికి పుట్టిన కురురాజు వంశమున పుట్టినవాడవగుటచేత నిన్ను తాపత్య యంటిని. అనిగంధర్వుడు చెప్పెను.

కౌరవుల, పాండవుల మూలపురుషుడగుటచేత కురుమహా రాజుయొక్క కథ చెప్పబడెను. వసిష్ఠమహర్షి మిగుల సమర్థుడని అర్జును డనగా అంగారపర్ణుడు వసిష్టుని వైభవమును విస్తారముగ చెప్పదొడగెను. విశ్వామిత్రుడు అనేక సైన్యములతోడ వేటకుపోయి, డస్సి, వసిష్ఠుని యాశ్రమము జొచ్చి, వసిష్ఠుని దర్శించి ఆతిథ్యమునుపొంది పోవలయునని వారుచెప్పగా అచ్చట నిలిచి, వారియొద్దనున్న కామధేనువు అతని అతనియొక్క సైన్యములను చతుర్విధాన్నములతో యేకొరతయును లేక ఉపచరించగా ఆధేనువు తనకు కావలయునని తలచి, దానినిచ్చిన అంతకంటె హెచ్చైన కోటి గోవులను లేక రాజ్యమును యిచ్చెదనని దీని తనకీయ లయునని వసిష్టుని నిర్బంధించెను. విశ్వామిత్రుడా ఈ కామధేనువే నాకు రత్నము. ఇదే నాకు ధనము. ఇదేనాకు సర్వస్వము ఇదేనాప్రాణము నేను చేయు క్రియల కెన్నిటికిని యిదియమూలాధారము. ఇందుకు సందేహము లేదు. ఉపయోగములేని అనేక మాటలచెత లాభమేమి కోరిన కోరికలను దీర్చు యీకామధేనువును నీయనని వసిష్ఠుడు చెప్పగా ఆధేనువును బలవంతముగ నీడ్చుకొని పోయెను. ఆకామధేనువు మిగుల దుఃఖించి రాజభటులను నానావిధములుగ త్రోసివైచి వాయువేగముతో మహాత్ముడగు వసిష్ఠుని సన్నిధికి పోయి కన్నీరు విడిచి ఏడ్చుచు పూజ్యుడా రాజభటులు నన్ను దీసికొని పోవుచుండగా ఎందుకు ఉపేక్షించితిరని అడిగెను. నేను ఉపేక్షించలేదు. అతడు బలాధికుడు నిన్ను లాగుకొని పోవుచున్నాడని వసిష్టుడు చెప్పగా కామధేనువు ఆయనయొక్క అభిప్రాయము నెరిగి బ్రహ్మజ్ఞాన సంపన్నుడా ఉత్తమమైన బ్రహ్మ బలము క్షత్రియుని బలముకంటె మిగుల నధికముగ నున్నది. గొప్పమహిమగలవాడా నీమంత్రబలముచే బాగుగ పొంపబడ్డియుండు తేజస్సుగల నాకు అనుజ్ఞయునీము. దురాత్ముడగు విశ్వామిత్రుని దర్పమును బలమును నాశము చేసెదననెను. పిమ్మట వసిష్టుని అజ్ఞానుసారముగ కామధేనువు నానాతెగల సేనలను సృజించెను. ఆసేనలచేత రథగజతురగ పదాతులతో గూడియుండు విశ్వామిత్రుని బలమంతయు తత్ క్షణము నాశముచేయబడెను. విశ్వామి

త్రునియొక్క నూర్గురు కొడుకులు నానావిధములగు ఆయుధములతో. వసిష్టుని సమీపమునకు పరుగెత్తి వచ్చిరి. వీరినందరిని హుంకారముచేతనే పూజ్యుడగు వసిష్టుడు దహించెను. విశ్వామిత్రుడు మిగుల దుఃఖించి, ఆతపోమహిమను దలచి రాజ్యమును విడిచి తపమునకుపోయి పరమశివునివలన దేవదానవులకు గొప్పబుషులకు గంధర్వ యక్ష రాక్షసులకు నేయేయస్త్రములు తెలియునో ఆయస్త్రముల నన్నిటిని బడసి మరల వసిష్టుని యాశ్రమమునకు వచ్చి అస్త్రములను ప్రయోగించి తపోవనమును భస్మముచేసెను. ఆయాశ్రమమున నుండిన సకలప్రాణులు భయపడిపోగా వసిష్టుడు మిగుల కుపితుడై పొగలేని యగ్నివలె మండుచుండునదియు, రెండవకాలదండమువలె నుండునదియు నగు బ్రహ్మదండమును త్వరగ పట్టుకొని నిలిచెను. విశ్వామిత్రుడు ప్రయోగించిన యస్త్రముల నన్నిటిని, బ్రహ్మాస్త్రమును, బ్రహ్మదండముద్వారా మ్రింగెను. విశ్వామిత్రు డపుడు క్షత్రియబలమునకు బ్రహ్మబలమునకును గల తారతమ్యమును, "ధిక్ బలం క్షత్రియబలమ్—బ్రహ్మతేజోబలం బలమ్" అని గ్రహించి గొప్ప తపముగావించి బ్రహ్మర్షియాయెను. కల్మాషపాదుడనురాజును వసిష్టుని పుత్రుడగు శక్తియును సంధించిరి. రాజునగుటచేత నేను వచ్చుచుండగా నీవు తొలగి పోవలయునని కల్మాషపాదు డనెను. నేను బ్రాహ్మణుడను. నేనువచ్చుచుండగా నీవు తొలగిపోవలయునని శక్తిమహర్షి యనెను. ఈవిషయమై వారికి వాదము జరిగెను. గర్విష్ఠబ్రాహ్మణుడవు నాయొద్ద దానము తీసికొనువాడవని రాజు క్రోధమూర్ఛితుడై వసిష్ఠపుత్రుని కొరడాతో కొట్టెను. నీవు రాక్షసకృత్యము చేసితివి. అందుచేత రాక్షసుడవు కమ్మని శక్తియనగా రాజు రాక్షసుడాయెను. తోడనే శక్తి సమీపమునకు వచ్చి, వ్యాఘ్రము పశువునువలె, అతని నోటవేసికొనెను. అంతమాత్రమే కాక సింహము అల్పమృగములను తినునటుల వసిష్టునియొక్క తొంబదితొమ్మిదిమంది పుత్రులనుచంపెను. వసిష్ఠుడు మిగుల దుఃఖించెను. భగవద్గీత 7 అధ్యా 14 శ్లోకమువలె నీమాయను దాటజాలకున్నానుకదా, యని దుఃఖించెను. ఆయన దుఃఖము నాపజాలక అగ్నిలో పడెను. సముద్రములో పడెను. పర్వతమునుండి క్రిందపడెను. దారములు కట్టుకొని నదిలోపడగా నదియే పాశములను విప్పి దరిచేర్చెను. వసిష్టుడిట్లు శరీరపరిత్యాగము చేయవలయునని అనేక ప్రయత్నములు చేసియును మరణము కలుగకపోగా ఆశ్రమమునకు వచ్చుచుండెను. అదృశ్యంతియును ఆయనకోడలు వెనుక వచ్చుచుండెను. అయ్యో బిడ్డలు లేరేయని వసిష్టుడు చింతించెను. అపుడు కోడలు సమీపమునకు రాగా వేదము వినబడెను. ఆమెకడుపులో నుండినబిడ్డ చెప్పుచుండెను. ఆనాదమును విని వసిష్టుడు తిరిగిచూచెను. ఎవరును లేకుండిరి. అమ్మా యెవరు చెప్పుచున్నారని వసిష్టుడు కోడలి నడుగగా శక్తిమహర్షియొక్క వీర్యము. గర్భస్థశిశువు పండ్రెండేడులుగా వేదమును చెప్పుచున్నదని ఆమె అనెను. నూర్గురుపుత్రులు పోయిరి. పోనిమ్ము. నాదుఃఖము పోద్రొ

నని వసిష్టుడనెను. ఆ గర్భస్థశిశువే విష్ణుపురాణము వ్రాసిన పరాశరులు. ఒకనాడు కల్మాషపాదుడు వసిష్టులను మ్రింగరాగా హుంకారముచేత వాని వారించిరి. కల్మాషపాదునిభార్య మదయంతి. పతివ్రతయగుటచేత నామెయును పండ్రెండేడులు రాక్షసత్వమును పొందియుండిన భర్తతోడ నుండెను. కల్మాషపాదుడు రాక్షసుడై సంచరించుచుండి భార్యతోగూడియుండిన యొక బ్రాహ్మణుని మ్రింగపోయెను. ఇపుడు వలదని అతనిభార్య యెన్నివిధముల చెప్పినను వినక రాక్షసభావముచేత నతని మ్రింగెను. అందుకా బ్రాహ్మణుని భార్య రాక్షసత్వము పోయినపిమ్మట రాజుకు స్త్రీసౌఖ్యమబ్బరాదని శపించెను. పండ్రెండేడులుకాగా రాజు శాపవిముక్తుడై రాజ్యమునకేగి అనేకదినములైనందున మిగుల ప్రియముతోడ భార్యంగలయగోరెను. కాని యామె శాపమును దెలిపెను. శరీరమున్నయెడల అనేక సుఖముల ననుభవించవచ్చునని తలచి రాజందుకు సమ్మతించెను. వీరికి సంతతి లేనందున వసిష్ఠుని యనుగ్రహమున మదయంతి గర్భవతియాయెను. వసిష్టుని మహావీర్యముగాన పండ్రెండేడులు ప్రసవము కాకుండెను. తుదకామె వేసరి రాతితో గర్భమును కొట్టినపిమ్మట ప్రసవించెను. అశ్మ అనగా రాయి. రాతితో గొట్టబడి పుట్టినందున ఆశిశువుకు అశ్మకుడని పేరుకలిగెను. అదృశ్యంతికి పరాశరుడు పుట్టెను. అయన వసిష్టుని తండ్రీయని పిలువగా తల్లి దుఃఖించి తాతాయని పిలువుమనెను. ఎందుచేతనని పరాశరుడడుగగా రాక్షసుడు మ్రింగెనని యామె చెప్పెను. పరాశరుడు రాక్షసులనందరిని చంపెదననగా జగత్తు నాశమగునని తలచి వసిష్టుడు మనుమని నివారించి యిటులచెప్పెను. పూర్వము క్షత్రియులు ధనముగూర్చి భార్గవులపై పగకొని వారినెల్ల సంహరించి గర్భములలోనుండు పిండములనుసహా సంహరించిరి. భార్గవపత్నులెల్లరును భీతిజెంది హిమవంతమునకు పారిపోయిరి. వారిలోనొకతె గర్భస్థానమును తొడలోనుంచి గర్భమును కాపాడెను క్షత్రియులాసంగతి తెలిసి హింసింప నారంభించగా బిడ్డ ఊరువును భేదించుకొని పుట్టెను. అందుచేత నాబిడ్డకు ఔర్వ్యుడని పేరు కలిగెను. ఆ బిడ్డయొక్క ప్రకాశముచేత క్షత్రియుల కన్నులు పోయెను. వారందరు ఆమెను ప్రార్థించగా నేనేమియు చేయలేదు. ఈతని వేడుడని ఆమె చెప్పెను. వారటులచేసి అతని యనుగ్రహమున దృష్టిగలవారై పోయిరి. పిమ్మట ఔర్వ్యుడు తన పితృ బంధుజనులందరు ఒకటిగ పరలోకగతులగుటకు దుఃఖించి క్షత్రియులనందరిని సంహరింపపోగా కోపము విడువుమని పితృదేవతలు చెప్పిరి. మండుచుండు యీకోపమును యేమిచేయుదునని ఔర్వ్యుడడుగగా సముద్రములో విడువు మనిరి. ఆయన అటులేచేసెను. ఆకోపాగ్ని అడుగుర్రము ముఖముతో నీళ్ళను త్రాగుచున్నది. దానికే బడబానలమనిపేరు. బడబ అనగా అడుగుర్రము. పరాశరా అటుల నీకోపమును నామాటవిని విడువుము అని వసిష్టుడు చెప్పెను. పరాశరులు రాక్షససత్రమును చేయనారంభించగా పులస్త్యుడు వచ్చి వలదని చెప్పిరి. అర్జునా అట్టిశక్తిగల వారగుట

చేతనే వసిష్ఠునికథ చెప్పితిని. అటుల ఒక బ్రాహ్మణుని ఆశ్రయింపుము అని అంగారపర్ణుడు చెప్పగా ఏ బ్రాహ్మణుని ఆశ్రయింపుదుమని అర్జును డడిగెను. ఉత్కోచమను తీర్థమునొద్ద తపమాచరించుచుండు ధౌమ్యాచార్యులను ఆశ్రయింపుమని గంధర్వుడు చెప్పి, వారటుల ఆశ్రయించుటకు అనుగ్రహించెను. మీకు భగవదనుగ్రహ మున్నది. మీకు తెలియని దే మున్నది అని గంధర్వుడు ఆశీర్వదించి పోయెను.

---

## (18) ద్రౌపదీ కల్యాణము 2-వ భాగము.

---

అంగారపర్ణుడను గంధర్వుడు ధౌమ్యాచార్యులను ఆశ్రయింపుడని చెప్పగా పాండవులు వారిని చూచి శరణు పొంది పురోహితునిగ వరించిరి. భగవంతునికి సమీప బంధువులు. వీరిని శిష్యులుగ అంగీకరించిన తనకు క్షేమమని ధౌమ్యుడు అనుకొనెను. పాండవులు ధౌమ్యుని అనుగ్రహముపొంది వారితోడ ద్రుపదమహారాజుయొక్క ఊరికి పోయిరి. బ్రాహ్మణులు గుంపులు గుంపులుగ పోవుచుండిరి. ఇట్టి బ్రాహ్మణులను చూడలేదు. మీరెవరు ఎవరితో చేరినవారు ఎంతవర్చస్వులు అని వారువారు అడుగగా వీరు తగునటుల బదులుచెప్పిరి. అందరును ఆశీర్వదించిరి. ధౌమ్యాచార్యునితోడ చేరగా విశేషముగ ప్రకాశించిరి. ధౌమ్యాచార్యులు ఉత్కోచమను తీర్థమువద్ద తపమాచరించు చుండిరి. వారు పురోహితు లగుటకు కారణము భగవత్సంకల్పమును, వాని ప్రేరణ, అని తలచి పాండవులు భగవంతుని ధ్యానించుచు పోయిరి. ఇటుల పోవునపుడు శ్రేయాంసి బహువిఘ్నాని అనగా మంచికార్యములకు అనేక విఘ్నములు అనికదా. ద్రౌపది అయోనిజ. అట్టిదాని మనము పెండ్లాడు టెటుల. రాజబృందములు వచ్చియున్నవి. మనము బ్రాహ్మణులముగ నున్నాము. వారిది క్షత్రియజాతి. మనము ప్రయత్నము చేయుటకు లేదని తలచిరి. వేదవ్యాసుదు చెప్పెను. బ్రాహ్మణులును ఆశీర్వదించిరి. అని చింతలేక పోరాదా. పెద్దకార్యము గాన మనసు చలించుచుండెను. నేను చెప్పియుంటిని. బ్రాహ్మణులు ఆశీర్వదించిరి. ధౌమ్యాచార్యులును పురోహితుడుగ నున్నాడు ఇంకను చింతలేక ధైర్యముగ పోవలయునని వేదవ్యాసుడు మరలవచ్చి పొండు. ఆకుమారికి ఏవురు భర్తలంటిని కదా, మిమ్ము వినా యెవరున్నారు. సందేహమేల భగవద్భాగవతానుగ్రహము సత్సహవాసము లేనివారుకదా భయపడవలయును. అటు లుండగా మీకు చింతవలదు అని చెప్పిపోయెను. ద్రుపదమహారాజుయొక్క ఊరు చేరిరి. వీరెచట దిగవలయును. వాస్తవముగ రాజులైయుండిన క్షత్రియుల స్థలమున దిగవలయును. బ్రాహ్మణులై యుండినయెడల బ్రాహ్మణులయింట దిగవలయును. పాండవులు క్షత్రియు లటుల నుండలేదు. బ్రాహ్మణులయింట దిగినయెడల బ్రాహ్మణుని గౌరవించిరని కుమ్మరవానియింట దిగిరి. యాగాది సత్కర్మములలో ఉపయో

గపడెడువారు కావున వారికి కొంతగౌరవము. పాండవులు భిక్షాటనచేసి భుజించుచుండిరి. ద్రౌపదీస్వయంవరము నేర్పరచితిమే. దీనిని యెవడైన దీసికొనిపోయిన నెటుల. నన్ను సంహరింపకయే అతిచమత్కారముతో కట్టి తీసికొనిపోయెను అసామర్థ్యుడైన అర్జునుని కిచ్చుటకుకదా యీకూతురిని బడసితిని. అయోనిజను సామాన్యుడు పెండ్లాడినయెటుల. పాండవులు లక్కయింట కాలిరనికదా మాట. వారు తప్పించుకొనియుందురా. అర్జునుని నెటుల కనుగొందును అని ద్రుపదమహారాజు పాండవులను కనుగొనుటకై ఒకయేర్పాటు చేసెను. ఈ ధనుసును వంచి యీయైదు బాణములతో మేమేర్పరచు మత్స్యయంత్రమును కొట్టి ఛేదించి యెవడు క్రిందత్రోయునో వానికి కన్యనిచ్చెదనని తెలియపరచెను. రాజు లందరును వచ్చి చేరిరి. దుర్యోధనుడు స్నేహితుడగు కర్ణునితోడ వచ్చెను. ఆవిధమును కవి తెలిపెను. అందరు రెండు కర్ణములతో (చెవులతో) వచ్చిరి. దుర్యోధనుడు మూడుకర్ణములతో వచ్చెను. అందరికి ప్రక్కలో రెండు కర్ణములు. దుర్యోధనునికి ప్రక్కలో రెండు కర్ణములును ముందు ఒక కర్ణము. (రాధేయుడు). రెండుకర్ణములు అంగములలో ప్రకాశించును. ఈకర్ణము రాజ్యములో ప్రకాశించును. సేనాదుందుభి నాదముచేత ఆకాశము నిండెను. దుర్యోధనునియొక్క తొంబదితొమ్మిదిమంది తమ్ములును కూడ వచ్చుచుండగా దుర్యోధనుని ప్రతిబింబములటుల తోచెను. దుర్యోధనుడు తనవలె రూప బల పరాక్రమములుగల తమ్ములతోను, కర్ణునితోను వచ్చి చేరెనని తాత్పర్యము. పెండ్లాడుటకు వచ్చియుండిన పాండవులను అనుగ్రహించుటకై స్వామి వచ్చెను. బలరామచక్రవర్తి వాసుదేవునితోడ వచ్చి చేరెను. సైన్యముల అడుగులవలన రేగినధూళి ఆకాశమున కెగురుచుండెను. పాండవులు అల్లుడుదురేమోయని బలరామచక్రవర్తి వేగముగ వచ్చెను అన్నయును గౌరవము చూపి మిగుల మర్యాదతో అన్నా అన్నా యనుచు వాసుదేవుడు వచ్చెను. భగవద్గీత 3 అధ్యా 21 శ్లోకమువలె పెద్దలయెడ మర్యాదతో నుండవలయునని చూపుటకు అటుల చేసెను. బలరాముని ఆయుధమునకు హలాయుధమని పేరు. అది శత్రులకు హాలాహలముగ (విషముగ) నుండును. ఆయాయుధమునకు హాలాహలమనియును పేరు. అది కార్యములో హాలాహలమువలెనే చేయును. ఈ యైదు బాణములతో యీయంత్రమును యెవరు ఛేదించి క్రిందత్రోయుదురో ఆశూరునికి మా ద్రౌపది పట్టరాణి యగును అని రాజనెను. స్వయంవర దినము నేర్పరచిరి. ఆదినమున అందరును మంటపము చేరిరి. వారివార యోగ్యతకు తగిన స్థానములలో యేర్పరచిన ఆసనములలో కూర్చుండిరి. బలరామాదులు దుర్యోధనుడు దుశ్శాసనాదులు తొంబదితొమ్మండ్రు రాధేయుడు సాక్షాత్ వాసుదేవుడు త్రైలోక్యము పారలివచ్చినటు లుండిరి. పాండవు లాదినము భిక్ష తెచ్చి భుజించి, మనము బ్రాహ్మణులమని దానముగైకొను బ్రాహ్మణులమధ్య కూర్చుండిరి. నిండినసభ. ఒకప్రక్క యాదవులు. ఒకప్రక్క స్వామి. ఒకప్రక్క బలరాముడు దుర్యోధనుడు రాజబృందము. విద్వ

ద్గోష్ఠి. సాధారణ బ్రాహ్మణులు స్త్రీలు ఉండిరి. పాండవులు కుంతిని తమస్థలమునందుంచి బీద బ్రాహ్మణులతోడ నుండిరి. స్వయంవరమంటప మెటులుండెననగా నాలుగుప్రక్కలలోను మల్లెపూలు బుట్టలు బుట్టలుగ పర్వతాకారముగ పోసిరి. నవరత్నఖచిత స్వర్ణ ఆసనములలో కూర్చుండినవారికి తగుఉపచారములు చేయవలసిన విధిగాన అంత వాసన కలుగునటుల పుష్పరాసులను పోసిరి. అగరుచెక్క ధూళిని ధూపము వేసిరి. వాద్యఘోష. అట్టి సలక్షణ ద్రౌపదీ స్వయంవర మండపమున అందరు కూర్చుండిరి. ద్రౌపది పూలమాలను చేతనుంచుకొని లక్ష్యమును కొట్టువాని మెడలో వేయుటకు రాబోవుచున్నదని యెల్లవారును వేచియుండిరి. ద్రౌపది నలుపు. ఆమెను ఇంత అతిశయముగ చెప్పితిమే నలుపుగ నున్నద అనిన కవి యిటులచెప్పిరి. అప్సరలు ఆమెకాలికి సములుకారు. బ్రహ్మసృష్టిలో ఆమెసములు లేరు. లక్ష్మిసమురాలు. ఎరుపుగ నుండ లేదే లక్ష్మిసమానురాలు యెటులగుననిరి. ద్రౌపదితండ్రియొక్క కీర్తియను-చంద్రుడు ప్రకాశించుచున్నాడు. ఆకాశములోనుండు చంద్రునికి రాత్రిప్రకాశము. ఈకీర్తియను చంద్రునికి రాత్రిపగలును ప్రకాశము. కీర్తిచంద్రుని ప్రకాశముండుటచేత లక్ష్మికి తావగు తామరపుష్పము ముకుళించెను. అందుచేత లక్ష్మిదేవి వికసించియుండు నీలోత్పలమున గూర్చుండెను. సదా అచ్చట నుండుటచేత లక్ష్మి నలుపాయెను. ద్రౌపది ఆలక్ష్మిరూపములో నున్నది. ఆమె దివ్యాభరణ భూషితయై పల్లకిలో గూర్చుండి అనేక సుమంగలులు శోభనములు పాడుచుండగ యేనుగుమీద వచ్చెను. ఆమూత్తయిదువలును చిన్నచిన్న యేనుగులమీద వచ్చిరి. ద్రౌపద కూర్చుండుటకు అనేక స్థలము లుండెను. రాజులందరి మనసులలో చోటు లుండెను. అనగా అందరు ఆమెను తలచుచుండిరి. ధృష్టద్యుమ్నుడు పల్లకి పట్టుకొని వచ్చెను. వాసుదేవుడు తన కృపాకటాక్షవీక్షణముచేత పాండవులను చూచుచుండెను. పల్లకి సభలోకిరాగా నిలిపి, ఓరాజులారా, కొంచెము గమనింపుడని ధృష్టద్యుమ్నుడు మేఘగంభీరమాటలతో మధురముగను, మృదువుగను, అర్థములోగూడి చెప్పెను. ఓరాజులారా అందరు గమనింపుడు. చూడుడు. ఈమాటలు వినుడు. మీద మత్స్యయంత్ర మున్నది. రంధ్రమున్నది. రంధ్రముద్వారా పోయి బాణము పనిచేయవలయును. ఎవరు యీకరుకైన మేమేర్పరచిన ఐదుబాణములను ధనుసును వంచి అల్లెత్రాడుగట్టి సంధించి వేసి యంత్రమును క్రిందత్రోయుదురో వారికి నాచెలియలిని యిచ్చెదను. ఇది పెద్దకార్యము. వారివారి యోగ్యతను చూచుకొని రెండు. ఎల్లవారికిని నాచెలియలిని పెండ్లాడవలయునని యిష్ట ముండును. చూచి యోచించి రెండు. ఈ గొప్పకార్యము నెవడు చేయునో వానికి నాచెలియలు భార్యయగును. సత్యము ఆక్షేపణలేదు అనిచెప్పెను. అందరు గడగడ లాడిరి. ధృష్టద్యుమ్నుడు అటుల రాజులతోచెప్పి చెలియలినిచూచి, అమ్మా వారివారి పరాక్రమాదులను చెప్పెదను. వినుమని నీని పేరిది పరాక్రమమునిటిది. ఈకార్యములు చేసెను నీని

మని చెప్పుచు పల్లకిని పట్టుకొని చూపుచు వచ్చెను. అర్జునుడు అరకంటితో ద్రౌపదిని అరకంటితో లక్ష్యమును బాణమును చూచుచుండెను. స్వామి పాండవుల క్షేమమును ప్రార్థించుచుండెను. పాండవులు స్వామిని జూచిరి. అపుడు పిలువరాదుగాన వాసుదేవా యని ఊరకుండిరి. పాండవులను యాదవులకు తెలియలేదు. బలరామచక్రవర్తికిని తెలియలేదు. అణువులో నణువై మహత్తుకు మహత్తై యుండువాడుగాన స్వామికి తెలియును. అపుడు అర్జునా యని పిలువరాదని కడగంట చూచుచు ఆశీర్వదించుచుండెను. రాజులు తన్ను చూచుచుండగా అన్న పొగడి చెప్పుచుండగా జగత్తే పారలి వచ్చినటులున్నదని పాంచాలి నవ్వుకొనెను. ఆమెకు యౌవనప్రాదుర్భావమై యుండెను. ధృష్టద్యుమ్నుడు ఒక్కొక రాజును చూపిచూపి చెప్పుచు వచ్చునపుడు, ద్రౌపదీ! దుర్యోధనుడని వినియుంటివే. అతడు. అదిగో, మద్రదేశాధిపతి శల్యుడు. చేదిదేశాధిపతి శిశుపాలుడు. అదిగో జరాసంధుడు అని చెప్పుచు చూపుచు వచ్చెను. ఏమి ద్రౌపది యదృష్టము. లేక ఆమెను పెండ్లాడబోవువాని యదృష్టము. ఇటుల అంగవంగదేశాధిపతులను చెప్పి చుట్టివచ్చి రంగమధ్యమున పల్లకి నిలిపిరి. అంతయును బాగుగనే యుండెను. కొందరు బాణములను ద్రౌపదిని తమ్ముచూచుకొని తాంబూలమునకై వచ్చితిమని చెప్పిరి. ద్రౌపది రంగమధ్యమున మాలను చేతనుంచుకొని నిలిచియుండెను. రాజులు తమస్థానములను విడిచి ధనుసుదగ్గర పోయిరి. ఎటులనగా అందరును స్నేహితులుగ నుండినను అసమయమున వీడేల వచ్చెను వీడేల వచ్చెను అని కోపముతో నుండిరి. పరమ సుహృత్తులైనను స్పర్ధతో నుండిరి. మన్మథుడు అటుల చేసెను. అయ్యా మీకందరికిని తాంబూలమేను. నాకు పెండ్లిఅని వారనుకొనిరి. మన్మథుడు సమయముచూచి తనసామర్థ్యము చూపెను. ధను సున్నది. ఐదుబాణము లున్నవి. ఈశ్వరా కార్యమెటు లగును. మానభంగము కారాదు అని రాజులు తలపరాదా. ద్రౌపదీ పాంచలీయని పోయిరి. ముప్పాతికదృష్టిని పాంచాలిమీదను పాతికదృష్టిని బాణము మీదను నుంచిరి. కృష్ణుని మరచి కృష్ణను (పాంచాలిని) దలచిరి. ధనుసుదగ్గర పోవుచు వచ్చుచు నుండిరి. పాంచాలి చూచుచుండెను. సుమంగలులు మంగళము పాడుచుండిరి. స్వామి యిదేసమయమని అర్జునుని చూచెను. పాండవులు బూడిదతో కప్పబడిన అగ్నివలె ప్రకాశించుచుండిరి. వారిని స్వామి కొంచెము తలంచెను. అందరు లేచిరి. అందరికి అసాధ్యము పాండవులను పురోవృద్ధికి తేవలయును అందుకేకద వచ్చితిని అని స్వామి తలచెను. ఇది బలరామునికిని తెలియదు. అన్నా పేదబ్రాహ్మణులమధ్య నెవరున్నారని స్వామి అనగా నెవ్వరురా యని బలరాము డడిగెను. యుధిష్ఠిర భీమార్జున నకులసహదేవులవలె నున్నారు. భగవద్గీత 9 అధ్యా 22 శ్లోకమటుల యోగక్షేమములు భగవంతునిదేను అని స్వామి చెప్పెను. పాండవులు పరమ భాగవతోత్తములు నన్ను నమ్మినవారు. వారిని కాపాడుటకై పెండ్లిచేయించుటకై స్వామి సకల బంధువులతోడ వచ్చెను. అన్నకు వారినిచూపి

రహస్యముగ నుండు మనెను. బలరామ వాసుదేవుల అనుగ్రహము కలిగెను.భగవద్గీత 5అధ్యా 8, 9, శ్లోకములలో నిద్రలేచినది మొదలు నిద్రించువరకు మనము చేయు కార్యములు అనగా చూచుట.వినుట మొదలగు కార్యములు భగవంతునివలన జరుపబడుచున్నవని చెప్పబడెను. విషయ మటులుండగా భగవద్గీత 7 అధ్యా 14 శ్లోకమటుల మాయామోహితులై భగవంతుని దలపరైరి. ధనుస్సును వంచుటకు పోగా వారి హారములు బాజుబందులు మొలత్రాడులు తెగిపోయెను.హోయని ఘోషపుట్టెను ఇది సరిపడలేదు. ఊరికిపోయి చేరిన బాగుగ నుండునని కొందరు తలచిరి. రాకుండినను బాగుగ నుండియుండునే. పేరు నిలిచియుండునే యని మరికొందరు తలచిరి. మరియును గొప్పగొప్ప రాజులు అందరితోడ లేవక నిదానించి యుండిరి. వారిలో నొకడు శిశుపాలుడు. శూరపులి. దమఘోషమహారాజు కొడుకు. వాడు లేచెను. ఇతరరాజులకు ధనుసును యెత్తుటకు, నిలుపుటకు వంచుటకు కాకుండెను. అట్లు యెత్తి ఒక జాన,మూర వంచినను ధనుసు తలయెత్తును. వేడుకచూడవచ్చినవారు చేతులు తట్టిరి. ఇటులుండగా శిశుపాలుడు లేచి ధనుస్సును యెత్తి వంచెను. మినపగింజ ప్రమాణము తగ్గెను. అల్లెత్రాడు కట్టుటకు కాలేదు. కట్టపోగా నోటికి తగిలెను. వానికి పైవాడు జరాసంధుడు. మహావీరుడు మహాబలవంతుడు వాడు లేచి వంచగా ఆవగింజప్రమాణము తగ్గి.గడ్డము తగిలెను. శల్యుడు పోగా పాతిక మినపగింజ ప్రమాణము తగ్గెను. దుర్యోధనుడు అనాయాసముగ యెత్తి వంచగా నువ్వగింజప్రమాణము తగ్గెను. కర్ణుడు వంచగా రోమప్రమాణము తగ్గెను. ధనుస్సు క్రిందపడెను అందరు హోయని నవ్విరి. అయ్యో ఒకనికిని చేతకాలేదే యని ధృష్టద్యుమ్నుడు చింతించి, ద్రుపదుని జూచి తండ్రీ! ఒకనిచేతను కాలేదు. ఇక మనబిడ్డకు భర్తయెటుల. ఇటుల యేర్పాటు చేసితిరే. ఒకప్రక్క స్త్రీలును ఒకప్రక్క పరదేశులును మిగిలియున్నారని చెప్పి దుఃఖించెను. ఎపుడు కర్ణునిచేత కాకపోయెనో అపుడే యింకేమని అందరును ఆశ వదలిరి.సభ అటులే నిలిచెను. ఇక యెటుల అని అందరును ఉండిరి. అర్జునుడు ఒక కంట ధనుసును ఒకకంట స్వామిని చూచెను. స్వామి కడగంటితో అనుగ్రహించెను. బ్రాహ్మణులును, మహర్షులును,బంధువులును ఇక యెవరున్నారు యెవరున్నారు అనుచుండిరి. పరదేశులు మాటలాడుచుండిరి. రాజులు తలయెత్తలేదు. కుంతిపుత్రుడగు అర్జునుడు కర్ణునికి కాని కార్యమును చేసెదనని లేచెనే కుంతిభాగ్యము అనిరి. 'కౌసల్యాసుప్రజారామ' కౌసల్యయొక్క సుపుత్రుడా శ్రీరామా యనినటుల,అర్జునుడు ధనుసునెత్తి వంచి బాణము వేయ తలచి కూర్చుండినటులే అంగవస్త్రమును నడుముకు కట్టెను. భూరికి ప్రొద్దగునని అల్పశంకకు పోబోవుచున్నా డనుకొనిరి. అర్జునుడు బ్రాహ్మణులమధ్యనుండి లేవగా, వారు నాయనా వలదురా దుర్యోధన రాధేయుల వలన కాలేదురా. బ్రాహ్మణుడవు భూరి తీసికొని పోవలయునురా అనిరి. బ్రాహ్మణుండైన తక్కువయగునా, పరశురాముడు బ్రాహ్మణుడు

కాడా. క్షత్రియులను నాశము సేయలేదా అని కొందరనిరి. ఇది మిగుల పెద్ద కార్యము. పరశురామునిది అపూర్వవిషయము. వీరు శాంతులు. వీరివలన అగునా అని మరి కొందరనిరి. అగస్త్యుడు శాంతుడు కాడా సముద్రమును పానముచేయడా. అంతధైర్యము లేకున్న లేచునా, శాస్త్రిగారూ దానినితప్ప మరియెచ్చట నైనను చూచెనా. ఈయే పురిలో వీడు అసాధ్యుడు. తప్పిపోయినయెడల చిన్నవాడందురు. జయముపొందిన తెలిసేయున్నది. అని ఇంక కొందరనిరి. అర్జునుడు బ్రాహ్మణులకు నమస్కరించి భయపడకుడు కార్యము ముగించి వచ్చెదను. మీరు యిచటనుండి ఆశీర్వాదములు చేయుడు అని వారితో చెప్పి పరమశివుని, అధనుసును తలచి నమస్కరించి యెదురుగనుండు వాసుదేవునికి మనసుతో నమస్కరించి పోయెను. వీనికి జయము కలుగవలయును. మనకు గౌరవము కలుగవలయును. బాగుగ ఆశీర్వదింపుడు అని బ్రాహ్మణులనిరి. రాజులు చూచుచుండిరి. క్షత్రియులము మనకే కాలేదు. బ్రాహ్మణునికి అగునా. చిన్నతనము. మూఢతనము. చురుకువాడు లేచెను. అనిరి. అర్జునుడు వాసుదేవుని ఒక కంటితో బ్రాహ్మణులను ఒకకంటితో చూచుచు శివుని బ్రాహ్మణులఆశీర్వాదమును మనసుతో దలచి ధనుసునెత్తి వంచి అల్లెత్రాడు గట్టెను. పురుషుడు లోపలనున్నాడనిరి. ఐదుబాణములను చేతనెత్తి ఒకబాణము వేసెను. స్వామియొక్క శక్తి. అది రంధ్రముద్వారాపోయి మత్స్యయంత్రమును భేదించెను. ఆ యంత్రము తిరుగుచు పడెను. ఈజనులలో శూరుడు వీడొకడే ఒకడే అని అది క్రిందపడెను. అంతలోపల పార్థుని శిరమున పుష్పవృష్టి గురిసెను. అప్సరసలు నృత్యము చేసిరి. దుందుభులు మ్రోగెను. లక్ష్యము క్రిందపడగనే, అష్టాదశ వాద్యములు మ్రోగెను. ఎవ్వరిచేతను కాలేదనగా పాంచాలికి చింతగనుండెను. పుష్పవృష్టి కాగా తోడనే మాలవేసెను. శూరుడు. యంత్రము క్రిందపడెను. విధిప్రకారము మాలవేసితిని అందముగనున్నాడో లేదో అని పాంచాలి చూడగా పార్థుడు మన్మథాకృతియై యుండెను. నవ్వుకొనెను. గొప్పగొప్ప క్షత్రియులము ఉన్నాము. మే ముండగా మాలను వానికి వేసెదవా యని యెవరైన అందురని భయమా. నిర్భయముగ వేసెను. నేను యేమంటిని అగస్త్యుడు అనలేదా. నేను పరశురాముడనలేదాఅని బ్రాహ్మణులు గంతులువేసిరి. సంతోషించిరి. ఆలింగనము చేసికొనిరి. ఆశీర్వదించిరి. పాంచాలి కిరీటి మెడలో మాలనువేసి ప్రక్కలో నిలువగా దేవేంద్రునిప్రక్క ఇంద్రాణి, అగ్నిదేవునిప్రక్క స్వాహాదేవి, నిలిచి ఉపచరించునటుల తోచెను. అమృత మథనకాలమున దేవతల సమూహములో స్వామికంఠమున మాలవేసి నిలిచిన లక్ష్మివలె నుండెను. సూర్యునిప్రక్క ఛాయాదేవి, మన్మథునిప్రక్క రతీదేవి, పరమేశ్వరునిప్రక్క పార్వతి నిలిచినటులుండెను. మాలవేయగనే పైన క్రింద వాద్యములు ఘోషించెను. వాసుదేవుని స్తుతించిరి. భగవద్గీత 10 అధ్యా 37 శ్లోకమున వృష్ణీనాంవాసుదేవోస్మి యని యాదవులలో వాసుదేవుడు (వసుదే

పునికుమారుడు) నేననినటుల యీస్వామి కదా యిటుల చేసెను. కిరీటిచే చేయించెను అని స్తుతించిరి. పాంచాలి మాలవేయగనే కిరీటి రమ్మని పిలిచెను. ఎవ్వరైనను వలదందు రని యోచనయా. బ్రాహ్మణుడు. ఊరు పేరు తెలియదు. పరాక్రమము తెలియదు. ఎచ్చటికి బోవుచున్నాడో యెక్కడనో అని పాంచాలి తలచెనా పతివ్రతాధర్మము ననుసరించి అతనివెంట పోయెను. అందరికిని సంకటము కలిగెను. అయ్యో, క్షత్రియులలో నెవనికైనను భార్యకారాదా అని రాజులును దుర్యోధనాదులును లేచి, ఓరీ క్షత్రియులు చేయుకార్యమును నీవెటుల చేసెదవురా అనిరి. ఆయుధము చేతనుంచుకొని వీరం దరును వత్తురని తలచి అర్జునా ధైర్యముగ పొమ్ము. అందరును ఆయుధపాణులు. నీవు పోయి చేరుము. నేను చూచుకొనెదను అని భీముడనెను. నిరాయుధుడవే యని అర్జునుడనగా ధనుసు రథ గజ తురగ పదాతు లెందుకు చూడుము అని భీముడొక పెద్ద వృక్షమును తీసికొనెను. మహాబలుడు. ఆకాశ భూములకు శాఖలతో పెరిగియుండిన వృక్షమును గుంజుకొనెను. ఆకులతోడనే పోదినయెడల గాలివచ్చునని వృక్షమును యొడముచేతితో పట్టుకొని ఆడ్డించగా అవి సెకూరవలె ఆకులు రాలెను. బాగుగ కొట్టుటకై అడవియేనుగులు మహావృక్షమును లాగునటుల భీముడు పెద్దవృక్షమును లాగెను. అర్జును డీయందమును జూచి కానిమ్ము వేయుము అనెను. అర్జునుడు మహాశూరుడు. భీముని వ్యాపారమును జూచి ఆశ్చర్యపడెను. నాది నాగరిక వ్యాపారము. దీనికి అనేక అస్త్రములు కావలయును. అని ఆశ్చర్యపడి అన్నా నేనున్నాను పాంచాలిని అటుల నిలిపితిని అనెను. నిలువుమని భీముడనగా అర్జునుడు ఆశ్చర్యముచేత నిలిచెను. భీముడు శరీరబలము ననుసరించి నిలిచెను. ఒకడును దగ్గరరాలేదు. ఏమి అధికప్రసంగ మనుకొనిరి. మీ యందరిచేతను కాకపోగా అతడు వెనుక నేకద లేచెనని ద్రుపదు డనెను. ఏమి ద్రుపదా! బ్రాహ్మణుడు చేయకూడ దనరాదా అనిరి. వారు బాణవర్షమును కురిపించగా భీముడు వృక్షముతో ఒకేపెట్టున కొట్టెను. దుర్యోధనాదులను అందరిని ధ్వంసము చేసెను. ధిక్ క్షత్రియబలం బ్రహ్మతేజోబలం బలమ్ అనిరి. సరి క్షేమముగ నుండని మ్మని పోయిరి. రాధేయా ఒకడు వాయువువలెను, ఒకడు ఇంద్రునివలెను నున్నారు. ఏయూరి బ్రాహ్మణులో. ఏమి తేజస్సో. పోనిమ్ము. మనజాతిలో యెవడైనను చేసి యుండిన మనకు అగౌరవము గలిగిన దనుకొనవచ్చును. హెచ్చుజాతి. నమస్కారము అని దుర్యోధను డనెను. ఇటులచెప్పి దుర్యోధనాదులు పోయిరి. బ్రాహ్మణులని తలచి వచ్చినవారందరును పోగా ధర్మపుత్రుడు నకుల సహదేవులను పిలుచుకొని పోయెను. భీముడు అర్జునుడు పాంచాలి నిలిచిరి. బ్రాహ్మణు లందరును వారిచుట్టు నిలిచి ఆశీర్వదించి మిగుల సంతోషించిరి. వారివారిగ్రామములకు పోవనారంభించిరి. అయ్యా యీపెండ్లిలో బ్రాహ్మణులకు జయము కలిగెను. ఇందరు వచ్చియును బ్రాహ్మణులకు ఆయెను. అన్యథాచింతితంకార్యం దైవమన్యత్ర చింతయేత్ అనినటుల కార్యము జరిగెను.

అనుకొనుచు వారువారు పోయి చేరిరి. అర్జునుడును భీముడును పాంచాలియును యిల్లు చేరిరి. తలుపు కొట్టిరి. కుంతి లోపలినుండి ఏమిరా యనెను. భగవంతుడిచ్చిన భిక్ష యనగా, అందరును సమానముగ పంచుకొనుడనెను. పిమ్మట వచ్చి తలుపు తెరచి చూచి ఏమిరా? భిక్షయంటిరనెను. ఔనని వారనగా మీరు ఏవురును రొట్టెలు పంచుకొందురని ఆమె అనెను. మాతృభక్తి గలవారు, ధార్మికులు అగుటచేత అమ్మా మాకు వేదశాస్త్రము ఎలగు. నీ నోట వచ్చెను. మేమేవురమును అనుభవించెదమని వారనిరి. అయ్యో యిటులేల చెప్పవలయును కన్యకునరాదా యని కుంతి యనగా అమ్మా భిక్షయే కదా బాధకము కాదు అనిరి. భగవత్సంకల్పముచేత ఆమె అటులనెను.

---

## (19) ద్రౌపదీ కల్యాణము 3-వ భాగము.

---

ద్రుపదమహారాజు యేర్పరచిన మత్స్యయంత్రమును భేదించుటకు యాదవులెవరును లేచకుండిరి. కారణమేమి వాసుదేవుడు లేవరాదా. వారికి యీ కార్యము అసాధ్యమా. సంకల్పమాత్రమున అనాయాసముగ చేయలేడా. భగవంతుడో బలరాముడో యీపని చేసియుండవచ్చును. అటుగా వారు శక్తిగలవారేను. ఐనను స్వామి సర్వజ్ఞుడుగాన ద్రుపదుని అభిప్రాయము నెరంగి పాంచాలి అర్జునుని సొత్తు. అచ్చట మనసుంచరాదు. పాంచాలి మనయింటి పిల్ల. అని ఆజ్ఞాపించి యుండినందున యాదవులలో నొకరును లేచకుండిరి. సభ కలిసెను. వచ్చినవారందరును పోయిరి. పాండవులును పోయిరి. వాసుదేవుడు సభలో పాండవులతో మాటలాడరాదని యుండి వారు పోయినపిమ్మట అన్నా అత్తను జూచి కోడలువచ్చెనాయని అడిగి పాండవులనుజూచి యిక ద్రుపదుని అల్లుండ్రను నాజ్ఞాపకమేల యని వేడుకగమాట్లాడి వత్తుమాయని బలరామునితో చెప్ప కుమ్మరవాని యింటికి పోయిరి. ఆచటికి పోవచ్చునా యనిన పోవుట మనుష్యులకొరకే గాని యింటిని జూచి కాదు. వాసుదేవుడు బలరామునితోడ పురుషశ్రేష్ఠులైన పాండవులుండినచోటికి పోయి అత్తకు నమస్కరించి, అత్తా యిదివరకు కష్టదశగా నుండెను. పెండ్లి అయ్యెను. ఇక కొదువలేదు. ఇపుడు నేను ఉండి చేసిన బాగుగ నుండదు. వారిప్రతాపము వలననే అయినటులుండనిమ్ము. సంబంధులు వత్తురు. నేనుఉండి మాటలాడుచుండిన బాగుగ నుండదు అనిచెప్పి పోయిరి.

పాండవులు పోవుచుండగా వీరెచటికి పోయెదరోయని ధృష్టద్యుమ్నుడును వారికి తెలియక వారి వెనుక నేపోయి కుమ్మరవానియింటి తలుపుచాటున నిలిచి వినుచుండెను. వారెవరని అడుగు కొటులసి అటులుండెను. పాండవులు రాత్రిభిక్షకు బైలుదేరిరి. మరియు నొక మనిషికి కావలసియుండుటచేత అధికముగ భిక్ష తెచ్చిరి. భిక్షాన్నమును రాసిగ పోసిరి. మరికొందరు భోజనములేక వీరియింటికి వచ్చిరి. పాంచాలీ! అతిథి అభ్యాగతులకు సంభ్ర

సమముగ పెట్టుమని కుంతిచెప్పగా ఆమె అటులే చేసెను.మిగత యింతయున్నదని పాంచాలి
చెప్పగా దాని రెండుభాగములుగ చేయుము. ఒకభాగము భీమసేనుని కిమ్ము. ఒకభాగ
మును నలుగురికిని నాకును నీకును పెట్టుమని కుంతిచెప్పెను. భీమసేనుడు యింతభుజిం
చునా యని పాంచాలి అనగా, అమ్మా' భుజించును.సామాన్యయేనుగు కాక యేనుగు
లలో గొప్పదగు యేనుగువలెనుండు దేహము గలవాడని కుంతిచెప్పెను.భోజనములు కాగా
కుంతి పరుండెను. పాండవులును పరుండిరి. పాంచాలి కొంగు పరచుకొని పాండవుల
పాదముల ప్రక్క పరుండెను. నేడు జరాసంధుడు వచ్చెను. కొట్టితిని. ఇంకను మర్దించవల
యునని యుంటిని అని భీము డనెను.అన్నా ఆగ్నేయాస్త్రము వేయవలయునని యుంటిని
అని అర్జును డనెను. వారిటుల వాయవ్యాస్త్రము వారుణాస్త్రము అని మాటలాడు
కొనుచుండగా వీరు క్షత్రియవీరులని ధృష్టద్యుమ్నుడు తలచి తాను తెలిసికొనిన సంగ
తులను తండ్రితో పోయి చెప్పెను. ఆకృతి భాషణాదులచేత క్షత్రియు లనుచున్నా
డు. మీరు పోయి తెలిసికొని రండి అని ద్రుపదమహారాజు పురోహితుని బంపెను.
క్షత్రియులేనా అనుట మొదట, గొప్పవారా అనుట పిదప తెలిసికొనుడు అనిచెప్పి
పంపెను. పురోహితుడు పాండవుల విడిదికి పోయి మామహారాజు పంపెననెను. ఏల
యని వారడుగగా యంత్రమును ఛేదించి పెండ్లాడెనే వానిబంధువులేకద మీరు అని
పురోహితు డడిగెను. ఔనని వారనిరి. బ్రాహ్మణులకు కాని కార్యమును చేసితిరే.
మీజాతి యేది. మీరు మహాభాగులు. రాజుయొక్క యిష్టానుసారముగ నడచినయెడల
వలసినది యిచ్చును అనెను. అయ్యా ఒకటి చెప్పెదను కోపము చేసికొనరాదు. మీరా
జును కోపించరాదు. లక్ష్యమును కొట్టవలయుననియేకద మాట. జాతిమాట లేదుకద.
ఈజాతి యీకులము సాధారణుడు అసాధారణుడు అని లేదుకదా. కులము శీలము
గోత్రము అని లేదుకదా. మేమేర్పరచిన ధనుసునెత్తి వంచి అల్లెత్రాడుగట్టి బాణము
లనువేసి యంత్రమును ఛేదించి పెండ్లాడవలయుననియేకద యేర్పాటు. అటుల ఛేదించి
కన్యను దెచ్చెను. ఎవరైనను ఆక్షేపించిరా అని ధర్మరా జనెను. ఒకవేళ క్షత్రియుడై
యుండిన సంతోషమని అడుగుచున్నామని పురోహితు డనెను. అటులా. తెలియవల
యునా. రాజులకు కానికార్యమును చేయుటకు సాధారణబ్రాహ్మణునకు అగునా.
దుర్యోధన దుశ్శాసనాదులకు కానికార్యము చేసెనే. లోకోత్తరక్షత్రియునికితప్పయిం
కొకనికగునా ఇంతమాత్రము తెలియులేదా. మందబుద్ధియాయని ధర్మరా జనెను.ఇటుల
చెప్పుచుండగా మహారాజు పిలుచుకొని రమ్మనిరని మరియొకడు వచ్చెను.ఎందులకై పిలి
చిరి. బ్రాహ్మణులా క్షత్రియులా యని తెలిసికొనుటకా యని వా రడిగిరి.ఆమాటయే
లేదు. అల్లుడును, సంబంధులును వచ్చి భుజింపవలయునని పిలిపించిరి దయచేయుడు
అని అతడు చెప్పెను. ఇక రా మనవచ్చునా. పాండవులు బయలుదేరిరి. ద్రుపదమహా
రాజు ఒక చమత్కారము చేసెను. నాలుగు జాతులవారికి తగుసామానులు ఉండు

రథములను బంపెను. పాండవులు క్షత్రియుల రథములో గూర్చుండిరి. కుంతి కోడలిని ప్రక్కన గూర్చుండబెట్టుకొని రథములో పోయెను. అందరును సంభ్రమముగ భుజించిరి. పిమ్మట తాంబూలములు వేసికొనుటకై యెచటకూర్చుందురోయని నాలుగుకూటములలో నాలుగుజాతులవారి సామానులను ఉంచిరి. పాండవులు మహాక్షత్రాగ్రేసరులగుటచేత మూడు కూటములను కన్నులలో చూడక యుద్ధోపయుక్తసామానులు ఉంచిన కూటములో కూర్చుండిరి. ద్రుపదమహారాజు పుత్రుని పురోహితుని బంపియు, ప్రత్యక్షముగా పరీక్షించియు సంగతి తెలిసికొనిరి. ఎవరికొడుకులో తెలియదు. కాన ఆసనములో కూర్చుండి ధర్మపుత్రుని జూచి మీరేజాతివారని అడుగుటకు న్యాయము లేదు. దయచేసి తెలిపిన సంతోషము. సందేహముగ నున్నది. తెలిసిన బాగుగనుండునని యాశ. చెప్పిన వినెదము అనెను. న్యాయము ననుసరించి మాటలాడితిని. మీ రడిగిన చెప్పకుందునా. మేము క్షత్రియులమని ధర్మరాజనెను. ద్రుపదునికి వర్షముకురిసినట్టుల మనసు చల్లపడెను. మీరలెవరోయని ద్రుపదుడనగా పాండుపుత్రులము. పాండవులమని ధర్మరాజు చెప్పెను. ఈమాట వినగనే అమృతవర్షము గురిసినటు లుండెను. ద్రుపదుడు అమృతసముద్రమున మునింగి ఈశ్వరా నామనోరథము యీడేరెను. అని సంతోషించి అటులైన యేర్పాటు ప్రకారము లక్ష్యమును భేదించెనే వానికి పెండిలి యేర్పాటుచేయుడు అనెను. అటులకాదు ఆకన్య మాయేవురకిని చేరినదని ధర్మరాజు చెప్పెను. ద్రుపదునికి గుండెలు పగిలి ఒకతెను యేవురు పెండ్లాడుట వాడుకలేదే యనెను. ఏది లభించినను యేవురికని మాయేర్పాటని ధర్మరాజనెను. సరి. దానిలో భేదముండలేదా. ఈయేర్పాటును తొలగింపుడని ద్రుపదుడనగా యేదైనను సరియేను. ఆయేర్పాటును విడువము. ధనమైనను భోజనమైనను కన్యయైనను అందరికి చేరును అని ధర్మరాజు చెప్పెను. క్షత్రియులము పాండవుల మనగా ద్రుపదునికి సంతోషమాయెను. ఏవురికనగా శిరము వంచెను. అటులకాదు. ఒకస్త్రీకి యిద్దరు పురుషు లేర్పడరాదు. ఒకపురుషుడు అనేకస్త్రీలను పెండ్లాడ నగును అనికదా వేదవాక్యము. అటులుండగా మీయేవురి కెటులగును. శ్రుతిలోను లోకములోను 'అటులున్నది. పాండుపుత్రులు పరమధర్మాత్ములు. మహాకులమున పుట్టినవారు. మీకేల యిటుల తోచెను. కన్యలు దొరకరా మీశక్తికి నూర్గురు పడుచులు దొరకుదురే. లోకవిరుద్ధమైన వేదవిరుద్ధమైన పని కూడదు. రెండును చేరనే అని ద్రుపదు డడిగెను ఔను. తెలియును. మాయేర్పాటు అటులే అని ధర్మరాజనెను. అతడే పెండ్లాడవలయునని లేదు. మీరు పాండుపుత్రులు. మీలో నెవరైనను పెండ్లాడుడని ద్రుపదుడు వేడుకొనెను. ప్రొద్దుపోయెను. పెండ్లికావలయును. వారు పోవలయును. భగవంతుడుకదా సంకటమును దీర్పవలయును. సర్వజ్ఞశిరోమణియైన వేదవ్యాసభగవానుడు యీసంగతి తెలిసి వచ్చెను. అందరును లేచి నమస్కరించి కూర్చుండబెట్టిరి. ద్రుపదునికి యేమియును తోచ

లేదు. అర్జునుని కీయవలయుననికదా పుత్రకామేష్టి చేసితిని. ఇటుల యేర్పడెను. వివా
యకుని చేయపోగా కొత్తగ నేర్పడెనే యని వేదవ్యాసునియొద్దకు పోయి,స్వామియను
గ్రహముచేత నీబిడ్డను బడసితిని. అర్జునుడు లక్ష్యమును కొట్టెను. వేదమున లోకమున
లేనిసంగతిని చెప్పుచున్నారు. ఎవరితో చెప్పుకొందును. మీరు తీర్చవలయును అనెను.
ఏధర్మశాస్త్రమునకై ద్రుపదుడు భయపడుచున్నాడో ఆధర్మశాస్త్రమును నేర్పచినవారే
వ్యాసులు. వారితో చెప్పుకొనగనే నేను చెప్పునటుల వినెదవాయని వ్యాసు డడిగెను.
అటులేచేసెదనని ద్రుపదుడు చెప్పెను. పెండిలి చేయుమని వ్యాసుడనగా చేయనందు
నా రేవురి కనుచున్నారే యని ద్రుపదు డనెను. నాకు మిగుల సంతోషము. ధర్మపు
త్రుడు చెప్పినటుల చేయుము అని వ్యాసుడు చెప్పెను. ఏమిరా పెద్దలు అటుల చెప్పు
చున్నారే యని పుత్రునితో ద్రుపదుడనగా,తండ్రీ ముసలివానికిని వారికిని గల సంబంధము
తెలియదా నాకు యిష్టములేదు. ఏలననగా, లోకమునకును వేదమునకును విరుద్ధమైన
సంగతి అని ధృష్టద్యుమ్ను డనెను. పెద్దలు మీమాట వినవలయునని నాకు యిష్టముం
డినను యీకాలపువారు వినరు అని ద్రుపదుడు వ్యాసులతో చెప్పెను. ధర్మపుత్రా
మీలోనొకరు పెండ్లాడరాదా యని వేదవ్యాసు లనగా అటులచేయవచ్చును. గురు
అజ్ఞను నడుపవలయునని ఉన్నదికదా. తల్లికంటెను గురు వెవరు. స్త్రీని చంపరాదని
శాస్త్రము ఉండినను గురువాక్యమును మీఱరాదని శ్రీరాముడు తాటకిని సంహరించెను.
సకల గురువులకంటెను తల్లిపెద్దగురువు. మాకు మీమాట వలదు. మాతల్లిమాటయే
ప్రమాణము అని పాండవులనిరి. యా ఐనలేగు పెండ్లిలి చేయుమనిన ద్రుపదుడు సమ్మ
తింపడు. ఏవురు పెండ్లాడకాలదనిన పాండవులు తల్లిమాట యందురు అని వేదవ్యాసు
డు అందరిముందర వలదని లేచి ద్రుపదమహారాజుయొక్క హస్తముబట్టుకొని పిలుచు
కొని ఒక గదిలోకిపోయెను. పాండవులను పిలిచెను. కుంతియు ధృష్టద్యుమ్నుడును
ఉండిరి. ఏవురు ఒకతెను పెండ్లాడుట వాడుకలోను శాస్త్రములోను లేదు. పుత్రుడు
కూడదనుచున్నాడు మీరు ఆజ్ఞాపించితిరి. సంగతి యేమని ద్రుపదు డడిగెను. ఈ
పాంచాలి యేవురికని విధింపబడెను. నళాయిని యనునామె మౌద్గల్యఋషియొక్క
భార్య. ఆమె భర్తనారాధించుచుండెను. ఆఋషి కుష్టురోగి. ఈమెపతివ్రత. ఒకనాడు
భుజించుచుండగా భర్తయొక్క వ్రేలు తెగి అన్నమున పడియుండెను. ఆమెవ్రేలిని అవ
లనుంచి శేషించినపదార్థములను భుజించెను.మౌద్గల్యుడు సంతోషించి నీకేమికావలయు
ననెను.మనసు ఐదురూపములతో ననుభవించవలయు ననెను.ఆఋషి సమ్మతించెను. ఆ
యనపర్వతముకాగా ఆమె నదియాయెను. ఆయన వృక్షముకాగా ఆమె తీగయాయెను.
ఈవిధములుగ సుఖము లనుభవించి యిక చాలును. తపమాచరింపుదమని ఋషియనగా
మీకు తృప్తియాయెను. నాకు కాలేదు అని ఆమె యనగా ఆయనకు కోపమువచ్చి
నీవు వచ్చెడిజన్మమున రాజపుత్రివగుదువు. నిన్ను యేవురు అనుభవింతురనెను. ఒకసం

గతి. ఋషియట్టుల శపించి తపమునకు పోగా ఆమెయును తపమునకు పోయెను. మరుజన్మమున నొక మహర్షికూతురుగ బుట్టెను. తగుభర్త లభించనందున పరమశివుని గూర్చి తపమాచరించెను. శివుడు రాగా నైదుమారులు భర్తకావలయునని అడిగెను. భర్తనిచ్చితినని పరమశివుడు ఐదుమారులు చెప్పెను. అది యేమి ఐదుమారులు భర్తనిచ్చితినంటిరని ఆమె యడుగగా, నీవేల ఐదుసారులు అడిగితివని శివుడనెను. ఏవురు భర్తల నెందు తెత్తునని ఆమె అడుగగా నీవు ఆకాశగంగయొద్ద నిలువుము. అచటి కొకడు వచ్చును. వాని పిలుచుకొని రమ్ము. ఏవురిని యేర్పరచెదనని శివుడనెను. వాడెవడనగా దేవేంద్రుడనెను. ద్రుపదా నేను కారణములేక చెప్పుదునా దాని తల్లవాత. దేవరహస్యము. నీపుత్రుడు ధర్మశాస్త్రమును మాత్రము చెప్పుచున్నాడు. నేను త్రికాలజ్ఞానిని. చెప్పుచున్నాను. అటు లున్నదని వ్యాసుడనగా, పుత్రా యిది అపూర్వవిషయముగా నున్నది. దాని తల్లవాత. ఋషియొక్క శివునియొక్క మాట తప్పునా అని ద్రుపదుడనెను. సరి ఆకథను చెప్పుడు. వాడు వచ్చునా యని వారడిగిరి. ఈమె ఆకాశగంగయొద్దనుండగా యెవడును రాలేదు. పరమశివుడు మోసముచేసెనని యేడ్చెను కంటినుండి ఒకబొట్టు నీటిలో పడగా ఒక బంగారు తామర ఆయెను. అటుల చేయుచుండగా దేవేంద్రుడు వచ్చెను. దేవతలు నైమిశారణ్యమున సత్రయాగము చేసిరి. సంవరమునకు ఒకస్థలముండును. ఆకార్యముచేయుటకు శామిత్రమని పేరు. ఆకార్యములో యముడు ఉండి మరణకార్యమును చూడకుండెను. జనులు వృద్ధియైరి. దేవతలు బ్రహ్మదేవునితో నీయన్యాయమును చెప్పిరి. యముడు మరల వచ్చునని బ్రహ్మ చెప్పెను. వారందరును వచ్చుచుండి బంగారుతామరను చూచి యిదేమనిరి. దేవేంద్రుడు విచారించుటకు వచ్చెను. అమ్మా నీవెవరవు ఏల యేడ్చుచున్నావు మనసున నుండునది చెప్పుము అనెను నావెంట రమ్ము చెప్పెదనని కైలాసపర్వతమునకు పిలుచుకొనిపోయి శివుని జూపి వీనివలన యేవురు భర్తలైరనెను. దేవేంద్రుడు గర్వముచేత అదియేమి అటులే యేవురిని చెప్పవచ్చునా నాపాలనలో అటుల జరుగరాదు అనెను. ఓరీ యిటుల అధికవ్యాపారము చేయకుము. ఒకసారి ఓర్చితినని శివుడనెను. నన్నా అటుల యనెదవని దేవేంద్రుడనగా నేను కూర్చుండియుండు పర్వతమును యెత్తుము చూతమని శివుడనెను. కూరుడుగాన యెత్తెను. పల్లములో చూడుము దిగుమని శివుడనగా చీకటియేయని ఇంద్రుడనెను. నీవలె నలుగురు ఇంద్రులుగనుండి నాయెడ అపచారపడిరి. మనుష్యజన్మము రావలయునని పడవేసితిని నీవును పొమ్మని శివుడనెను. వీరివలె నేనును పోవలయునా యని ఇంద్రుడడుగగా ఔనని శివుడనెను. మాయూరద్ది అమరావతియని ఇంద్రుడనగా వీరును అచ్చట నుండినవారే, గర్వముచేత మనుష్యజన్మము రావలయునంటిని. స్వర్గలోకస్త్రీయే యిది. మీకు భార్యయగును పొండని శివుడనెను. ఆమెయే ఈ పాంచాలి, కైలాసపర్వతముక్రింద కూర్చుండియుండినవారే పాండవులు. లక్ష్య

ముసు భేదించినవాడే ప్రకృతపు ఇంద్రుడు. ఇది వారి రాజ్యలక్ష్మి. ఇది అపూర్వవిషయము. దానికి యేవురు భర్తలేర్పడవలయును. వారికి రాజ్యలక్ష్మి భార్య కావలయును. పరమశివుని మాద్గల్యుని వాక్యము. ప్రకృతమున మాతృవాక్యము అని వ్యాసుడు చెప్పెను. ఇంతచెప్పినను ద్రుపదునికి నమ్మిక పుట్టలేదు మనకు నమ్మిక కలుగును, లోకులు సమ్మతింతురా యని అడిగెను, వేదవ్యాసునికి తెలిసెను. ద్రుపదా నమ్మికపుట్టలేదా, చూడుము అనికండ్లను తుడువగా పాండవులను యింద్రులుగను పాంచాలిని స్వర్గలోకరాజ్యలక్ష్మిగను చూచెను. అంతట అతడు గడగడ వడకెను. ఆహా యేమివేదవ్యాసుడు, అధర్మశాస్త్రము మనుష్యులను బాధించును దేవతలనుకూడ బాధించునా, వ్యాసా యేమిచెప్పితివి, ఏమి దివ్యదృష్టి, అని వారి పాదములు పట్టుకొనెను. పుత్రా యింకను సందేహమా మహర్షీ నాసందేహము పోయెను, సూర్యోదయమైనయెడల చీకటి ఉండుచోటు తెలియక పోవునటుల తమరిచ్చిన జ్ఞానసూర్యోదయముచేత సంశయము పోయెను అని ద్రుపదుడనెను. వారు గదినుండి వెలుపలికి వచ్చిరి, అందరు ఏమియేర్పాటనగా, ఏవురికి నియే పరమశివుని యేర్పాటట, ధర్మమో అధర్మమో నాకు యిష్టమే, పెండిలికానీయవలయును, నేను చూచితిని, అని ద్రుపదు డనెను. ఇక నేమందురు సరియనిరి. ధౌమ్యాచార్యులు పురోహితు లగుటచేత ముహూర్తముపెట్టి కూర్చుండబెట్టిరి. కన్యాదాన మగుటచేత అర్ఘ్యపాద్యాదులిచ్చి సంతోషముతో సర్వాభరణ భూషితయైన ద్రౌపదిని పూజాగృహమునుండి పిలుచుకొనివచ్చి అగ్నికిముందు పాండవులకుయిచ్చుటకు నిలిపెను. ద్రుపదుడు కనలేదు. నాలోనుండికగా కలిగినది నాబిడ్డయని అగ్నిదేవు డనునని అగ్నిముందు నిలిపెనో అనునటులుండెను. పురోహితులు విధివత్తుగ తదంగము జరిపిరి. అపుడు పాణిగ్రహణము సేసిరి. జ్యేష్ఠుడు ధర్మరాజు ముందుగ పాణిగ్రహణము చేసెను పిదప క్రమముగ భీమ అర్జున నకుల సహదేవులు పాణిగ్రహణముచేసిరి. ఇటుల శుభముహూర్తమున ద్రుపదరాజు కూతురిని అయోనిజను విధివత్తుగ ఉదకధారాపూర్వకముగ కన్యాదానము చేసెను. దేవతలు పుష్పవృష్టి గురిపించిరి. అప్సరసలు ఆడిరి. దేవతలు రాజులు శక్తికి తగినటుల సన్మానించిరి. పాండవులకు ద్రౌపదికి బహుమతులు యిచ్చిరి. కృష్ణమూర్తి చదివింపులు పంపెను. వాసనతోడ దివ్యమైన గాలివీచెను. వాద్యములు మ్రోగెను. చరాచరప్రపంచములో పాండవులును, వారిలో అర్జునుడు, హెచ్చు, అని, లోకమునకు విశదమాయెను.

## (20) ఇంద్రప్రస్థగమనము.

పాండవులు ద్రుపదమహారాజు అల్లుండ్రగుటచేత మరల కుమ్మరవానియింటికి పోవుటకు న్యాయము లేదు. జయించిననేకదా హస్తినాపురమునకు పోవచ్చును. అచ్చటికి పోవుటకును న్యాయములేదు. కనుక ఆ యూరిలోనే యుండిరి. మామ యథేచ్ఛముగ ధనాదులు యిచ్చెను. కృష్ణమూర్తియును యథేచ్ఛముగ బహుమతులు పంపెను. బంధువులు మిత్రులు చదివింపులు పంపిరి. పాండవులకు స్త్రీమాత్రమే కాక శ్రీసహా లభించెను. అనగా భాగ్యమాత్రముకాక ఐశ్వర్యముసహా లభించెను. ఆయూరిలోనే ద్రౌపదితోడ కొంతకాలము సుఖముగ వాసముచేయుచుండిరి. దుర్యోధనాదులు యిదివరలో నేమని తలచియుండిరి. బ్రాహ్మణు డెవడో యంత్రమును కొట్టెను. బ్రాహ్మణతేజస్సు గొప్పది అనితలచి నమస్కరించి వచ్చితిమని తలచియుండిరి. ఇపుడు సంగతి వినిరి. క్షత్రియులట. పాండవులట అని సమాచారము అందెను. రహస్యము. నీకు మాత్రము తెలిసియుండనిమ్ము అని ఊరంతయును తెలిసెను. అపూర్వరహస్యమైనను మరునాడు సూర్యోదయములోపల తెలిసిపోవును. మిగుల గొప్పవిద్వాంసుడు తాను విద్వాంసుడని తెలియరాదని బీదవాడుగ నుండినను మాటలలోనే తెలిసిపోవును. కస్తూరియున్నదని తెలియరాదని మూసికొని యుండినను వాసనవచ్చును. తటాకమున నూనెబొట్టును వేసిన యెడల తటాకమంతయును నిండును. అటుల వీరు బ్రాహ్మణవేషధారులై యుండిరి. స్వామియును తెలుపలేదు. ఎటులో తెలియవచ్చెను. చారులమూలముగను దూతలమూలముగను అంతయు తెలిసెను అందరికి ఒక బ్రాహ్మణుడు పాంచాలిని గ్రహించెనాయని కోపము వచ్చెను. భీముని కార్యమును దలచి భీతినొందిరి. అటుల దుర్యోధనాదు లందురా. పాండవులటనే ఒకడు అర్జునుడు ఒకడా భీముడటనే. లక్కయింట కాలిపోయిరని ఉత్తరక్రియలు చేసితిమే. అందుకై ధనము కర్చుచేసితిమే. ఇపుడు పాండవులు పెండ్లాడిరని యొకేమాటగ నున్నది. అని ఆశ్చర్యపడి విచారించిరి. నిజమని తెలిసెను. బ్రాహ్మణుడను, బ్రహ్మతేజస్సని తలచి నమస్కరించి వచ్చితిమి అనుకొనిరి. వై౩ పాయములు యిటు లనిరి. దుర్యోధనాదులు దుష్టులుకారు. దుష్టసహవాసము దుర్బుద్ధిపుట్టించును. దుశ్శాసన కర్ణులు చేరిరి. కర్ణుని శౌర్యబలములను శకునిని చూచి, సరి రథగజ తురగ పదాతులతోడ బయలు దేరుదు. పోదము. అటులే పట్టణమును చుట్టి ముట్టడింతము అనుకొనిరి. కానిమ్మనీ కేమయినను భోజనమున కిచ్చెదనని పంపక పిల్లనిచ్చెను అటులచేయనగునా యని ద్రుపదునిమీద కోపము వచ్చెను. ద్రౌపదినే స్మరించుచుండిరి. భగవద్గీత 2 అధ్యా 62, 63, శ్లో. చెప్పినటుల సంగముకలిగి అది కామమాయెను. అటుపైన కోపము వచ్చెను. బయలువెడలి యుద్ధారంభభేరిని కొట్టిరి. లక్ష్యమును భేదించుటే కన్యాశుల్కమని ద్రుపదుడు అనెను.

ఇపుడు పోయి పాండవులను గొట్టి పిల్లను గ్రహించుకొని రావలయును అని తలచిరి. పరమదుష్టుడైన కర్ణుడు అటులచెప్పెను. వారు చేయుదురు. కవియనెను. దుర్యోధనాదులు యుద్ధమునకు పోయి పాండవులతో పోరి వారిచే దెబ్బలు తినుట అనువిద్యను ఆరంభించిరి. ద్వితీయవిఘ్నము లేకుండుటకై బయలుదేరిరి. రథ గజ తురగ పదాతుల తోడ ద్రుపదమహారాజు ఊరికి పోయి శంఖపూరణముచేసి సింహధ్వని చేసిరి. అనేక వాద్యములను ప్రయోగించి ధనుష్టంకారము చేసిరి. ఇటుల యుద్ధారంభము చేయగా ఆకాశమున సిద్ధులు సాధ్యులు మొదలగువారు దేవతలు కూడిరి. ఈసంగతి తెలిసికొని పాండవులు వారికి సహాయముగ ద్రుపదుడు ధృష్టద్యుమ్నుడు శిఖండి సైన్యములు బయలుదేరిరి. నక్షత్రములు చంద్రుని చుట్టుకొనియుండునటుల ద్రుపదుని చుట్టియుండిరి ద్రుపదునిపుత్రులు పాండవులను కాపాడపనిలేదు వారు స్వతఃశూరులు. గీతాచార్యుని అనుకూల్యమున్నది. భగవద్గీత 18 అధ్యా 82 శ్లోకమున ఎచట యోగేశ్వరుడగు కృష్ణుడు ధనుర్ధరుడగు అర్జునుడు ఉందురో అచట జయము ఉండునని చెప్పబడెను. కాన వారు తండ్రిని పిలుచుకొని పోయిరి. దుర్యోధనాదులకు ముందు తెలియలేదు. ఇపుడు వీరు వీరని తెలిసెను. ఆహాహా మనమొకటి దలచిన దైవమొకటి తలచెను. అంతయును స్వామి అనుకూల్యమేను. పెండ్లిచేయుటకే వచ్చెనుగాని తానేమైన చేసెనా అని దుర్యోధనుడనెను. యుద్ధరంగము కొరకనే పెద్దగంటస్థులుగల గృహముల మిద్దెలమీద స్త్రీలు రణరంగములోని వేడుక చూచుటకై యెక్కిరి. ఆకాశములోను స్త్రీలుండిరి. మిద్దెలు ఆకాశమునకు అంగుచుండెను. ఈస్త్రీలకును వారికిని భేదము తెలియకుండెను. వారిచేత పూలమాల లుండెను. రణరంగములో మృతినొందె వీరస్వర్గమునకు వచ్చు శూరులను వరించుటకై వారు హారములు ఉంచుకొని యుండిరి.అదియే యీస్త్రీలకును ఆస్త్రీలకును భేదమైయుండెను. ఇటుల యుద్ధము జరుగుచుండెను. సాక్షాత్ జగదీశుని అనుకూలము లేకుండిన నాడేమైయుండును. గీతాచార్యుని అనుగ్రహమున వివాహమాయెను. కష్టములన్నియును వీరివలననేకదా యని పాండవులకు కోపము. ఆహా వీరికి పిల్లదొరకనే యని దుర్యోధనాదులకు కోపము. పరస్పరము కోపముతో బాణములు వేసిరి. ఆబాణములును యీబాణములును వచ్చి తగిలి క్రిందపడుచుండెను. వారికి వ్రణములు కాలేదు. ఎందుచేత ననగా రణము (యుద్ధము) నవము (క్రొత్త.) అనగా అపుడే ఆరంభమాయెను. కొంతకాలమైనకదా వ్రణమగును.రక్తము వచ్చును. లేక రణము (రణము అనుపదము) నవం (వకార రహితముగ నున్నది.) వ చేరిననేకదా వ్రణమగును. అనగా రణమను పదమునకు వకారము చేరనందున వ్రణముకాలేదని యర్థము. ఉభయపక్షము రథికులకు ద్వంద్వయుద్ధము కాగా ఆశ్చర్యభరితులై నారదాదులును పాండవ పక్షపాతులగు ద్రుపద, ధృష్టద్యుమ్నాదులు చూచుచుండిరి. దేవదైత్యులును వచ్చియుండిరి. అర్జునుడు బాణములువేసి కర్ణునికొట్టగా అతడు పడినరొండల

దేవతలు బలేయందురు. రాధేయుడు కొట్టినయెడల బలేయని దైత్యులందురు. దీనినంతయు నారదాదులు చూచుచుండిరి. దుర్యోధనాదులు మునుపటివలె పరుగెత్తి పోయిరి. ఉభయపక్షములవారి రథగజతురగపదాతులు బయలుదేరగనే ధూళిరేగిరి ఆకాశమునకు భూమికిని నిండెను. పరస్పరము ముఖము తెలియలేదు. భీముడు గదతో కొట్టెను. అర్జునుడు కొట్టెను. పరస్పరము కొట్టుకొనిన సెటులని వారు చేయిపట్టుకొని కంకణమును చూచి కొట్టుకొనకుండిరి. అర్జునుడు ధనుస్సునెత్తి వంచి అల్లెత్రాడు గట్టి బాణము వేయగా అదిలోపలపోయి అంగములను రంధ్రముచేయును. బాణములు వారి కాళ్ళమీద పడెను. వారికి రథము బాణము లేనందున పాదములే వాహనమాయెను. అందుకై బాణములతో పాదములకు అభిషేకము చేయగా పరుగెత్తిరి. తిరిగి చూడలేదు. ఎందుచేత ననగా వారు యిన్నిదినములుగ అర్జునుని మరచియుండిరి.ఇపుడు యుద్ధములో యశస్సు కలిగెను. ఈయుద్ధమును ఆకాశప్రకాశమున బయలుదేరిన అర్జునుడను చతుర్థిచంద్రుని చూడరాదను తలపుతో వచ్చినదారి పట్టుకొని దుర్యోధన దుశ్శాసనాదులందరు పారిపోయిరి. స్వయంవరకాలమున పాండవులను బ్రాహ్మణులని తలచి పోయిరి. ఇపుడు పాండవులేవురిని మామను బావను తలచి అధిక దుఃఖముతో పారిపోయిరి. పాండవులు జయలక్ష్మితో ప్రకాశించుచున్నారని స్వామికి సంతోషమాయెను. దుర్యోధనాదులు పాండవులని తెలిసికొని మరల ఎత్తురు. ఎచ్చి దెబ్బలుతిని పోగనే పాండవులను చూచిపోవలయునని స్వామి తలచియుండెను. వారు పోగనే స్వామి బలరామునితోడను సకలబంధువులతోడను పెండ్లాయెనని విచారించుటకు-వచ్చెను. భగవంతుడు పాండవులను కటాక్షించి ద్రౌపదిని పిలిచి రత్నాభరణములు విశేషముగ నిచ్చిరి. క్షత్రియ సంప్రదాయానుసారముగ ఆయా ఆభరణములు యిచ్చిరి. భగవంతుని చూడగనే పాండవులకు పరమానందమాయెను. ద్రుపదునియింట అందరు చేరిరి. దుర్యోధనాదులు యింకను ఊరుచేరలేదు. విదురునికిని పాండవులమీద పక్షము. వీరికి భగవదనుగ్రహ మున్నది. వివాహకాలమున స్వామి లేచెనా. అర్జునునికి పెండిలి కావలయుననికదా యుండెను. అని విదురు డనుకొనెను. ధృతరాష్ట్రునికి మాతృదోషముచేత పైకన్నులు పోయెను. పుత్రునిదోషముచేత లోపలికన్నులు జ్ఞానమునకై యుండునవి పోయెను అని విదురునికి కోపము. అందుచేత ధృతరాష్ట్రునియొద్దకు పోయి అన్నా కౌరవులకు జయము భగవదనుగ్రహమున అటుల వింటిని అనెను. విదురా నిజముగనా యని ధృతరాష్ట్రుడడుగగా భగవదనుగ్రహము ముమ్మాటికి నిజమని విదురుడనెను. ధృతరాష్ట్రుడు పుత్రవాత్సల్యముచేత ద్రౌపది మనపెద్దవాని అంగీకరించెనని తలచెను. వస్త్రాభరణములకు యేర్పాటు చేసెను. అందరును నవ్విరి. భయాశ్చర్య సంతోషములు కలిగినపుడు దుఃఖప్రీతులచేత సంభ్రమము కలిగి త్వరకలుగును. ధృతరాష్ట్రుడు వస్త్రాభరణముల కాజ్ఞాపించగా,విదురుడు మరల అన్నా అనెను.కౌరవ

శబ్దమునకు మీపుత్రులని అనుకొంటిరా అనెను. ఏమిరా యని ధృతరాష్ట్రు డనగా పాండుపుత్రులకు జయమాయెనని విదురుడు చెప్పెను. ఆభరణములు లోపల పెట్టుడని ధృతరాష్ట్రు డనెను. అన్నా! బాగుగ తెలిసికొని సుఖమో దుఃఖమో పడవలయును. త్వరపడ్డిన యెటు లగును కౌరవశబ్దము యిరువురికిని కాదా అన్వయించును. వారికిని వీరికిని అని తలపరాదా. అన్నా రాజ్యము లేకున్నను వంశముపేరు పోవునా అని మహానుభావుడైన పాండునెడ అంత ప్రీతియున్నదని విదురుడు తెలిపెను. దుర్యోధనాదులు ధృతరాష్ట్రునొద్దకువచ్చి, కొట్టి తరిమిరి వచ్చితి మని చెప్పగా, విదురుడు కౌరవులన ప్రథమిసితినని ధృతరాష్ట్రుడు చెప్పెను. కౌరవు లన వారేను. మేము వంశమును చెరుపుటకు పుట్టితివి. ఆహా! ఏమి యుద్ధము చేసిరి. ఇక కౌరవులనగా పాండవు లనియే అర్థము చేసికొనుము అని దుర్యోధను డనెను. మరల యుద్ధమునకు పోదమని వారివారితో యోచించిరి. వారికి భగవదనుగ్రహ మున్నది. వలను. పోరాదని పెద్దలనిరి. భీష్మ, ద్రోణ, కృపాచార్య, అశ్వత్థామలును వల దనిరి. వారితో యుద్ధము సేయకుడు. అర్ధరాజ్యము నీయుడు. వారికి సహాయు లున్నారు. స్వయముగ నే శక్తియున్నది. ఇపుడైన అర్ధరాజ్యముతో పోవును. అపుడైన రాజ్యము అంతయు పోయినను పోవును. సమాధానముగ పొండు అనిరి. కలహములేక పోయిన అందరికిని క్షేమము అని భీష్మాచార్యులు భూరిశ్రవస్సు మొదలగు బంధువులు నీతి చెప్పిరి. మీరు పెద్దలు వారి హితము కోరవలయును. రెండుపర్యాయములు యుద్ధమునకు పోయిరే జయము కలిగెనా. కొంతరాజ్య మీయవలయును అని భీష్మాదులు చెప్పగా ధృతరాష్ట్రునికి సరియనితోచి విదురుని పిలిచి నీవు పోయి పాండవులను కుంతిని ద్రౌపదిని పిలుచుకొని రమ్మనెను. విదురుడు ధృతరాష్ట్రునిచేత పంపబడ్డి రథమెక్కి అచ్చటచట దిగుచు పోయి ద్రుపదుని యిల్లు చేరెను. పాండవులకై పోగా పాండవబంధువు కృష్ణుడు కూర్చుండి యుండెను. పాండవులను పిలుచుకొని పోవలయునని రాగా యిచట స్వామి యున్నాడు. ద్రుపదుని యిష్టముకాదు. వీరి ఉత్తరువు కావలదా యని విదురుడు స్వామిని సేవించెను. స్వామియొద్దకు తిన్నగ బంపెనని అక్రూరుడు కంసునికి నమస్కరించినటుల, ధృతరాష్ట్రుడునను, పంపినందున నేకదా నీదర్శన మాయెనని విదురుడు ఆనందించి పాండవులను సంబంధిని చూచి చిన్నదియెచ్చట అని అడుగగా ఆమెను చూపిరి. కృష్ణా నీయనుగ్రహమున కిరీటి లక్ష్యమును భేదించెను. నీకటాక్షమునకదా అటుల జరిగెనని విదురుడు స్వామిని స్తుతించెను. వారుస్వయముగ బుద్ధిమంతులని స్వామి యనెను. విదురునికి విందు మొదలగు మర్యాద లాయెను. పాండవులను కుంతిని పిలుచుకొని రమ్మనిరని విదురుడు చెప్పగా ఘను పుఅటులచేసిరి. పాండవులని తెలిసియు రెండుపర్యాయము వచ్చిరి. మాకు కలిగినది భుజింపుమందురు అని ద్రుపదు డనెను. ద్రుపదా యిపుడు యథేష్టముగ యిచ్చితివి. ఇంకను మీరు యీయగలగు. అది యంత రసమైన సంగతి కాదు. తనపరాక్రమముచేత

సంపాదించినది ఉత్తమము పిత్రార్జితము మధ్యమము. భ్రాతృధనము అధమము. స్త్రీధనము అధమాధమము అనికదా శాస్త్రము. వారికి రాజ్యము లేదా. శక్తిలేదా. సొత్తులేదా అని స్వామి చెప్పగా ద్రుపదుడు ఉత్తరు విచ్చెను. వారితోడ కృష్ణుడును బయలుదేరెను. పాండవులు స్వామి కుంతి ద్రౌపది విదురుడు బయలుదేరిరి. వారు ఊరు శృంగారించి యుంచిరి. దుర్యోధన దుశ్శాసనాదులు యెదురుగ వచ్చిరి. ద్రౌపది మహారాజుకూతురు పట్టమహిషి యని, దుర్యోధనునిభార్యయు కాశిరాజుకూతురును అగు భానుమతియు తొంబదితొమ్మండ్రుగురు భార్యలును యెదురుగ వచ్చిరి. భగవదనుగ్రహముండుటచేత వారు ప్రీతితో వచ్చిన నేమి రాకున్న నేమి. భగవదనుగ్రహముండిన శత్రులుకూడ ఉపచరింతురు. భానుమతి ద్రౌపదిని చేయిపట్టుకొని అమ్మా రమ్మురమ్మ అనెను. లక్ష్మియందురే యిటులే యుండును యేమియందము అని భానుమతి అనుకొనెను. ద్రౌపదికి స్నానముచేయించునపుడు దాసీజనులు ఆమెను చూచి యీమెను విస్త్రగ చూచుచున్నాము. స్పర్శించుచున్నాము. స్త్రీలుగనుండి చూచుచున్నామే పురుషులుగనుండిన చూడ నోచక పోతిమే యని తలచిరి. కుంతి గాంధారికి నమస్కరించి ద్రౌపదీ అత్తకు నమస్కరింపుమనెను. ధృతరాష్ట్రునిమనసు చెడెనేగాని గాంధారిమనసు చెడలేదు. ద్రౌపది నమస్కరించెను. అక్కా నమస్కరించుచున్నానని కుంతియనగా గాంధారి కంఠస్వరమును తెలిసికొని కోడ లెక్కడ అనెను. ఇదిగో నమస్కరించుచున్నదని కుంతిచెప్పెను. ద్రౌపది సేవింపగా గాంధారి ఆలింగనము చేసికొని ఆమె దేహమార్దవమును తెలిసికొని యిదిమిగుల లావణ్యవతి తనపుత్రులకు మృత్యువని తలచెను. అడుగడుగుకును దీనికై కలహము యేర్పడుననియు ఆమె ఊహించెను. పాండవులు నమస్కరించిరి. కృష్ణుడు నేను నమస్కరించుచున్నా ననెను. వీరిని చూచుటకై వీరితోడ వచ్చితి ననెను. పాండవులను గృహములో ప్రవేశపెట్టినది మొదలు దురాలోచనలు ఆరంభమాయెను. వీరికి యేదైన హానిచేయవలయుననిన అసాధ్యముగ నుండెను. ఇపుడు మనయింటికి వచ్చిరి. ఇటుల చేయవచ్చును అటులచేయవచ్చును అని తలచిరి. కృష్ణుడు వచ్చియున్నాడు. ఇచటికి అచటికి వచ్చుచున్నాడు. వీరిని స్థాపించుటకే వచ్చెనుకాబోలును అని తలచి ధృతరాష్ట్రుడు యేకాంతమున ధర్మపుత్రుని బిలిచి ఏదో భగవదనుగ్రహమున బ్రతికి పెండ్లిచేసికొని సుఖముగ నున్నారు. వీరు ఊరకుండరు. కలహమునకు యీడ్చుచుందురు. అహంకారులు అయోగ్యులు. ఒకటికి రెండాయెను. ఇంద్రప్రస్థమని యొకన్నది. అచటికి పోయి సుఖముగ నుండవచ్చును అనెను. ధర్మపుత్రుడు కృష్ణునితో చెప్పెను. భోజనమునకు మార్గము నడిగితివా అడుగుమని స్వామి చెప్పెను. ధర్మపుత్రుడు అడుగగా అర్ధరాజ్యము నిచ్చెద పొమ్మని ధృతరాష్ట్రుడు చెప్పెను. ధర్మపుత్రుడు స్వామికిసంగతి చెప్పెను. సరిసమ్మతింపుము పత్రమువలదా యని అడుగుమని స్వామి చెప్పగా ధర్మరాజు అడిగెను. అర్ధరాజ్యపట్టాభిషేకము

చేసెదనని ధృతరాష్ట్రుడనెను. పెద్ద లందరును ఉండి చేయవలయునని అడుగుమని స్వామిచెప్పగా ధర్మపుత్రు డడిగెను. అటులేచేసెదను అర్ధరాజ్యమిచ్చెదను. కృష్ణుడున్నాడు. వారికి శక్తియుండిన మీది తీసికొందురు. మీకు శక్తియుండిన వాలిది తీసికొనుడు. అని ధృతరాష్ట్రుడనెను. కృపాచార్యులు ద్రోణాచార్యులు ధౌమ్యాచార్యులు వ్యాసుడు కృష్ణుడు బాహ్లీకుడు సోమదత్తు అనువారు నాలుగు వేదములు తెలిసివారు. వీరందరుండగా పట్టాభిషేకము చేసిరి. అష్టవసువులు ఇంద్రునికివలె, వసిష్ఠాదులు రామునికివలె యెనమండ్రుగురు మంత్రతంత్రలోపములేక అర్ధరాజ్యము నిచ్చి పట్టాభిషేకము చేసిరి. ధృతరాష్ట్రుడు తనపేరులో అర్ధభాగము నిచ్చెను. ధృతరాష్ట్రింలో రాష్ట్రము నిచ్చెను. తండ్రీ పొమ్ము అర్ధరాజ్యము నిచ్చితిని. ఇచటనుండిన కలహము లగును. కుంతి ద్రౌపదితోడ పొండు అని ధృతరాష్ట్రుడనగా నమస్కారాదులు చేసి ధౌమ్యాదులతోడను,కృష్ణునితోడను పోయిరి.ప్రస్థము అనగా తూము. పాండవులు దుర్యోధనాదులకును తమకును ఉండు స్నేహమును కొలచుటకో యనినటుల ఇంద్రప్రస్థ పట్టణమునకు పోయిరి.

---

## (21) అర్జున తీర్థయాత్ర.

---

పాండవులు ధృతరాష్ట్రుని మాట విని నమస్కరించి రథారూఢులై కృష్ణుని తోడ ఇంద్రప్రస్థపురమునకు పోయిరి. సాక్షాత్ భగవదాజ్ఞను శిరసావహించి విశ్వకర్మ నవరత్నఖచితమైన గృహములు గోపురములు సదులు మొదలగువానితోగూడిన పురము నిర్మించి యిచ్చెను. అట్టి ఇంద్రప్రస్థపురమునకు పోయి శుభముహూర్తమున ప్రవేశించిరి. వారిబాధలేక నిష్కంటకముగ ఊరు లభించెను. వాసుదేవుడు పోయెదననెను. వాసుదేవా మనుష్యులకు అడుగడుగునకు ఆపదలు వచ్చుచుండును. ఇపుడు మేలుకలిగియున్నది. ఆపదలు తరుచుగ వచ్చుచుండునుగాన మమ్ము మరువరాదు. వచ్చుచుండవలయును. నీవు ఆపద్బంధువుకదా. మాచేత నీవు సమయోచితముగ ఆయాకార్యములు చేయించవలయును అని ధర్మరాజు అనెను. బావా మేము స్మరించినపుడు రావలయునని నీవు చెప్పవలయునా నేను మరియు మరియు వచ్చుచుండనా. మీకు ఆపదవచ్చి స్మరించిననే రావలయునా. మీకు ఆపదరాదు రావలదు. మీరు తలపపనిలేదు. నేను వచ్చుచుండెదను. ద్రౌపది లభించినది రాజ్యము లభించుట మీకుగల బ్రాహ్మణభక్తి చేతనేకదా. మీరాజ్యములోనుండు బ్రాహ్మణుల విషయమున మీద్రవ్యము ఉపయోగపడనీయుడు. బ్రాహ్మణుల కిచ్చుట యొక కార్యమా అనుకొనకుడు. వీడు చెప్పినాడని దుఃఖించుచు యీయవలదు. సంతోషపూర్వకముగ నీయుడు. ఇచ్చువారు యెటులైనను యిత్తురు. నేడు సుదినము నేడు కించిత్ సమర్పించవలసియుండును.భగవం

కుడు కుటుంబ భరణమునకు మాత్రము యీయలేదు. లేనివారికి యీయవలయునని యిచ్చెను అనితలపవలయును. ప్రతిదినమును మనకు పనిచేయువారని తలచి యీయరాదు. ప్రతిప్రయోజనము కోరక వేదాధ్యయనముచేసిన శ్రోత్రియబ్రాహ్మణునకు పుణ్యదేశమున పుణ్యకాలమున నీయవలయును. ఇటు లనుటచేత సద్బ్రాహ్మణుడు లభించినపుడు మకరసంక్రమణమునకు సేతువుకు రండియని చెప్పవలయుననికాదు. సత్పాత్రములభించినయెడ ఆ దినమున యేయూరిలో నెపుడు కోరునో ఆయూరిలో అపుడు యీయవలయును. అతడు బ్రతికియుండి కైకొనుటయు వీడు బ్రతికియుండి యిచ్చుటయు నిశ్చయముకాదు కావున అడిగినపుడు యీయవలయును. అది సాత్త్వికదానమగును. మరి యొకసంగతి. బ్రాహ్మణుడు మంచివాడైనను మంచికాలమైనను మంచియూరైనను యిచ్చునప్పుడు కొంచెము సంకటపడినను, యిచ్చినపిమ్మట లెక్క జూచి అధికముగ నిచ్చితి మనుకొనినను రాజసదానమగును అనుకూల కాలము దేశము కాక మంచియోగ్యబ్రాహ్మణుడు కాక మంచిమాటలేక సత్కారములేక యిచ్చినయెడల అదానము తామసదానమగును. భక్తిశ్రద్ధలతో మిగుల స్వల్పము నిచ్చినను, యీయకున్నను, సంసారి ఉండినయెడల నిచ్చును అనుకొనుచు సంతోషముతో పోవుదురు. హెచ్చుగ నిచ్చినను సత్కారము లేకపోయిన యెడల తిట్టుకొనుచు పోదురు. కావున ధర్మపుత్రా ముందువెనుక నొచ్చుకొనుచు యితడు చెప్పెనేయని చేయకుము. పూరువంశములో పుట్టినవాడవుకదా యని వారికి హితమును చెప్పి ముఖ్యధర్మములు చెప్పి అత్తకు నమస్కరించి స్వామి ద్వారకకు బయలుదేరెను. ఇంద్రప్రస్థపురము పూర్వము వీరి రాజులదిగనే యుండెను. కాలక్రమమున అడవిమాయెను. స్మరణమాత్రమున విశ్వకర్మవచ్చి గొప్పపట్టణము నిర్మించెను. దేవతలు విమానములలో పోవుచుండి క్రింద నవరత్నఖచిత స్వర్ణవిమానములవలెనుండిన గృహములు మొదలగువాని జూచి ఆశ్చర్యమొందిరి. ఆయాశ్చర్యముచేత వారిదేహములు ఉబ్బెను. విమానములు అబరువుగ క్రిందదిగెను. స్వామి సంగతి చెప్పగా ఇంద్రుడు దీనికి నాపేరుపెట్టుమనెను.

ఒక్కొకనికి ఒక్కొక భార్యయుండిన వారివారి భార్యను వారువారు చూచుచుందురు. ఒక్కదానిని అందరుచూడవలసినటుల ఒకేసమయమున అందరికి యిచ్ఛకలిగిన దీనికై విరోధము కలుగునని వారికి చింతకలిగెను. ఈసంగతి అంతరాత్మకు తెలిసెను. పెద్దలద్వారా చెప్పింపదలచి వాసుదేవుడు నారదుని స్మరించెను. పాండవుల చింతను బాపుటకై నారదుడు ఇంద్రప్రస్థమునకు వచ్చెను. సర్వయోగక్షేమనిర్వాహకుడై సర్వచింతా పరిహారకుడైయుండు స్వామిని దలపుడమచు అయనవచ్చెను. పాండవులు యెదురుగపోయి అర్ఘ్యపాద్యాదులిచ్చి స్తుతించిరి. నారదా నీవు మాచింతను పరిహరించు ప్రభువుకావా అని యిటుల మాటలాడుచుండునపుడు యొచ్చటికి వచ్చితిరి అనిరి. ఏయూరిలో విశేషముండిన

స్వాయమ్భూరికి భక్ష్యముందును. అందుకే వచ్చితినని నారదు డనెను. ఈయూరిలో నేమి వేడుకయని పాండవు లనిరి. ఈయింటిలోనే దంపతిశబ్దమును చెప్పుడు. దంపతిశబ్దమునకు ఏకవచనమును బహువచనమును లేదు. ద్వివచనమున్నది. జాయాశ్చ పతిశ్చ దంపతి. పతిశ్చ అనవలయునా పతయః అనవలయునా అని చింతగనున్నది. ఇటుల ఆసందర్భముగ పెండ్లాడినందున దంపతిశబ్దము సరిగా రాలేదుకదాయని తోచి వచ్చితిని. ఐదుమంది ఒకతెను పెండ్లాడితిరి. మీరేవురికిని దానియెడ ఏకకాలములో ఆశ కలిగిన నెటుల. ఈచింతదీర్చుటకై వచ్చితిని అని నారదుడు చెప్పెను. మూఢులు కలహింతురు మీయొద్ద మెలగిన మాకుకూడ అటులకలుగునా, యని ధర్మపుత్రు డనెను. అటులకాదు, ఎవరైననుసరే, ఏకకాలమున ఒకవస్తువుమీద యిరువురికి ఆశ కలిగనేని కలహము కలుగును. అనినారదుడు చెప్పెను. బుద్ధిమంతులకుకూడ కలుగునంటిరి, సరి, మిగుల స్నేహముగలవారికిని కలహము కలుగునా. యని ధర్మరాజనెను. సుందోపసుందులు అన్నదమ్ములు. ఒక అప్సరసయందైయేక కాలమున ఆశపడి కలహము కలిగి మృతినొందిరి. హిరణ్యకశిపు వంశములో నికుంభుడనువాడు ఉండెను. వానికొడుకులు సుందోపసుందులు. బ్రహ్మనుగూర్చి తపమాచరించిరి. బ్రహ్మప్రత్యక్షముకాగా జరామరణములు లేకుండ చేయుమనిరి. ఇటులడుగగా బ్రహ్మయోచించి నాకు శక్తియుండిన గదా యిట్టివరము యీయగలుగుదును. అది నావలనకాదనెను. ప్రపంచములో దేనిచేతను మరణము కూడదని యడిగెదము ఒప్పెదరా యనివారడుగగా ఆహా యని బ్రహ్మయనెను, అపుడు మరణము కలుగదా యని వారనగా, మీలోమీరు చంపుకొనుచోడల మరణమును సమ్మతింపుడని బ్రహ్మచెప్పెను. వారు తాము మిగుల స్నేహము గలవారమని తలచి అటులే కానిండని సమ్మతించిరి. బ్రహ్మపోయెను. వారు అష్టదిక్పాలకులను వారిపదవులనుండి తరిమివేసిరి. లోకములను బాధించిరి. దేవతలు బ్రహ్మతో మొరబెట్టిరి. బ్రహ్మలోకమున గొప్పసభ జరపిరి. బ్రహ్మమాటకు విరుద్ధముగ జరిగినటులైన అతనికి గౌరవము తగ్గును. గౌరవించినయెడల మనకు కష్టము అని యోచించి వారిలో వారు చంపుకొనునటుల చేయుడని యోచించిరి. వారు కలహించరే యనిన స్త్రీకొరకు కలహమేర్పడు ననిరి, తిలోత్తమను బంపిరి, సృష్టికిగల ఉత్తమవస్తువులను కొంచెము కొంచెము రొత్తి సృష్టింపబడ్డినది తిలోత్తమ. దానిబంపగా వారు దాని దూరమునచె చూచిరి. అన్న తమ్ముని జూచి ఓరీ వదినె వచ్చుచున్నది. వదినె తల్లిసమానురాలు. సేవింపు మనెను. అన్నా నాభార్య, నీబిడ్డతో సమానము ఆశీర్వదింపుమని తమ్ముడనెను. అది కొంతదూరమున నుండగనె యీకలహము ప్రారంభమాయెను. తిలోత్తమ వీరి యొద్దకు రాకయే అటులే పోయినది. వారు పరస్పరము గదలతో కొట్టుకొని చచ్చిరి. వారిస్నేహమునకంటెను మీస్నేహము హెచ్చా. ఇంద్రుడు, చంద్రుడు రావణుడు కీచకుడు రాముడు విశ్వామిత్రుడు పడ్డినదంతయు చెడ్డినదంతయు స్త్రీమూలకముగనే.

కలహములు తలలు పగులుటయును స్త్రీవలననే, యిటుల స్త్రీమూలకముగ అనర్థములు కలుగును. కావున మీరొక యేర్పాటు చేసికొనుడు అని నారదుడు చెప్పగా అటులా, యేదైన యేర్పాటుచేయుడని పాండవు లనిరి మీకు నేనుచెప్పు యేర్పాటు సమ్మతిపడవలయును, పట్టినసరే, లేకున్న నారదా నీకేమి వీధిలోనుండి తాంబూలము తీసికొని పోరాదా యందురు, కావున నాపాదమును స్పృశించి నేనుచెప్పు యోచనను అంగీకరింతుమని చెప్పుడు అని నారదు డనెను. అన్యోన్యము స్వాధీనులు గాన మీకు సమ్మతమా యని ధర్మరాజు తమ్ముల నడిగెను. వారు సమ్మతించిరి, మీరేవురికిని ఒకేకాలమున ఆసక్తి కలిగినకదా కలహమేర్పడును, ఆమె ఒకసంవత్సర మొకరికి భార్య యని వ్యవస్థచేసికొనుడు, అపుడు మరియొకడు చూడరాదు, చూచినయెడల ఒకసంవత్సరము తీర్థయాత్రకు పోవలయును, ఒకడు అనుభవించుచుండునపుడు మరినలుగురు ఆమెను పరస్త్రీ తల్లి యని భావించవలయును అని నారదుడు చెప్పగా అటులేయని వారి పాదముతాకి ప్రతిజ్ఞచేసిరి. నారదుడు వచ్చుటకు ముందు అర్జునుడు లక్ష్యమును భేదించినాడనియు, భీముడు యెల్లవారిని కొట్టితరిమినాడనియు యిటుల ద్రౌపదికి పాండవులమీద గౌరవము హెచ్చుతక్కువలుగ నుండెను. పిమ్మట మన్మథునియొక్క పంచబాణములకు యెటుల సమానశక్తి కలదో, ఐదు కల్పవృక్షములకు యిచ్చుశక్తి యెటుల ఒకటగునో అటుల పాండవులను గూర్చి ఆమె తలచెను. నారదుడు పోయె ద్రౌపది మొదటిసంవత్సరము జ్యేష్ఠుడగు ధర్మపుత్రుని వంతుకు వచ్చెను. అర్జునుడు బాణము కావలియుండెను. ఒక బ్రాహ్మణునియింట దొంగలుపడి వారి సొత్తులను గోవులను దొంగలించుకొనిపోయిరి. సొత్తులు పోగొట్టుకొనినవారు పోలీసుకుపోయి చెప్పవలెనుగల బ్రాహ్మణుడు తన సొత్తులు పోగనే రాజునగరుకు వచ్చి చెప్పెను స్వామీ కోపించకుడు. ఆచోరులు యెచటికి పోయినను పట్టి రేపు ఉదయము మీసొత్తులు తెచ్చియిచ్చెదను అని అర్జునుడు చెప్పెను. ఇపుడే నాలుగుమైళ్ళుపారిపోయి యుందురు. తెల్లవారిన సొత్తు పోనేపోవును. ధర్మపుత్రుడట. రాజట. ఎవరురా ఆపేరుపెట్టిరి అని బ్రాహ్మణు డనెను. అర్జునుడు నవ్వెను. ఇతడు బ్రాహ్మణుడు. సొత్తులను పోగొట్టుకొని యున్నాడు. పెద్దలు తిట్టినను ఆశీర్వాదమేను. అని తలచి అర్జునుడు నమస్కరించి దూరవలదు. శపించకుడు. వాసుడను. ఇదిగో సొత్తులు వచ్చును అని చోరులను స్మరించెను. బాణములు కావలసియుండెను.అవి అన్న భార్యతోడ పరుండియున్న యింటిలో నున్నవి. ఎటుల అనియోచించి ఆయింటిలోనికి పోయి బాణములు తీసికొని దొంగలను పట్టి కొట్టి వారు అపహరించిన సొత్తులను తెచ్చియిచ్చి బ్రాహ్మణుని ఆశీర్వాదములు పొంది వచ్చి చేరెను.

మరునాడు ధర్మరాజు సింహాసనములో నుండగా అన్నా ర్యాత్రి మిమ్ము చూడ గూడని సందర్భములో చూచితినిగాన తీర్థయాత్రకు పోవుటకు అనుజ్ఞ నియ్యవలయును అని అర్జును డనెను. వైరివాడా తనభార్యయని చూడరాదని ప్రతిజ్ఞగాని కార్యార్థముగ వచ్చితివి పోవలదు అని ధర్మరాజు చెప్పెను. అన్నా అనుష్ఠించుటకు యిష్టము లేకుండిన కదా యీసమాధానములు అని అర్జును డనెను. ఈయనకు సకలతీర్థములకు పోవలయునని కోరికయుండెను. ఇది తత్వము. మత్స్యయంత్రమును కొట్టినది నేను. అటు లుండగా నాకు రెండుసంవత్సరములు వంతు అని యుండరాదా. ఇద్దరు అన్నలు కాగా నాకు మూడవసంవత్సరమున వంతు వచ్చును. ఈదుఃఖమును కన్నులార చూడనని అర్జునుడు తీర్థయాత్రకు పో దలచెనని కవి యభిప్రాయము. అర్జునా! యేడాది యెటుల నిన్ను విడిచియుందునురా యని ధర్మరాజు అతని ఆలింగనము చేసికొని కన్నీరు విడచెను. అది అర్జునుని శిరమున పడెను. అన్నా మహాస్నానమాయెను. గంగామలకం టెను హెచ్చైనదని అర్జును డనెను. అర్జునుడు ధర్మరాజుయొక్క ఉత్తరువుపొంది ఉత్తరదిక్కునకుపోయి అనేకతీర్థములలో స్నానము చేసి గంగానదికి పోయెను. అచ్చట గంగలోదిగి ధనుర్బాణములను గట్టున పెట్టి సంకల్పముచెప్పి అఘమర్షణసూక్త మంత్రమును జపించెను. అదృష్టశాలురకు యెచటికిపోయినను సుఖము కలుగును. అచ్చట నొకభార్య దొరకెను. ఐరావతకుల సంభవుడయిన కౌరవ్యుని కూతురు ఉలూపియను నాగకన్య అనీటిలో క్రీడసల్పుచుండి అర్జునుని చూచి అనదిలోపలికి అతని తీసికొని పోయెను. అమానుషభోగము. తోడనే గర్భముదాల్చి ఇరావంతుడను పుత్రుని గనెను. భారతయుద్ధమున తొమ్మిదవనాడు వాడు వచ్చి అర్జునునకి మించి యుద్ధము చేసెను. అర్జునుడు వానికంటెను తక్కువ అనితోచెను. అట్టివాడు పుట్టెను. పోయిన స్థలములలో స్నానము తర్పణము చేయవలసి యుండును. ఎంతో నియమముగ పోవలసియుండును అని తలచి అర్జునుడు భార్యను పిలిచి నీవు యిచటనే ఉండుము. నేను పిలిచినపుడు రమ్ము అనిచెప్పి పోయెను. అర్జునుడు నీట మునుగగనే అయోధ్యా రాజపుత్రుని మొసలి మ్రింగెనని ఋషులు దుఃఖించిరి. అర్జునుడు వెలుపల రాగనే నాయనా నిన్నటిదినము నీటబడి లేచితివా యనిరి. ఈసంగతి అర్జునునితో చెప్పుకొనెనని కొందరి యభిప్రాయము. పిమ్మట తూర్పుదిక్కునకు తిరిగి సముద్రములనుపోయి చోళదేశమునకు పోయెను. కావేరిని చూచెను. కావేరీసముద్రసంగమమున స్నానము చేసెను. కావేరిగట్టున టెంకాయ చెట్లు ఉండెను. ఆచెట్లు ఆకాశమును తాకుచుండెను. ఆచెట్లలో టెంకాయ లుండెను. కావేరిజలము రుచియో ఆకాశగంగ జలము రుచియో యని పరీక్షింపవలయునని ఆచెట్లు టెంకాయలలో పరీక్షించుటకు నీటిని తీసికొని పోవుచుండునటు లుండెను. అర్జునుడు చూచి పరమానంద మొందెను. స్వర్గలోకమున అమృతము పాడాయెను. దేవతలు కావేరిజలమును కావడికట్టి తీసికొని పోదురట. సస్యములు నదులు జిలుజిలుమని

యుండు జలమును కిరీటి చూచి సంతోషించుచు మధురకు పోయి దక్షిణదిక్కునకు పోయెను. అది అగస్త్యునిదిక్కు. వింధ్యపర్వతము పొడగై యుండగా సూర్యచంద్రులు పోవలయునని చెప్పగా అగస్త్యుడు ఆపర్వతమును తగ్గియుండుమనెను. ఆపర్వతము యిప్పటికిని తగ్గియున్నది. వాతాపియనువాడు ఇల్వలుడనువాని ఋషులకు వండిపెట్టి భుజించి, వారు పోవునపుడు తమ్ముడా యనును, తోడనేవాడు పొట్టచించుకొని వచ్చును. అగస్త్యుడు రాగా అటులే వండిపెట్టి తమ్ముడా యనెను. ఉండ్రనకదా వచ్చును అని అగస్త్యుడనెను. వాడు రాలేదు. జీర్ణమగుటకై చెప్పియుండు వేదమంత్రమును చెప్పి 'వాతాపిజీర్ణ'మనగా వాడు చచ్చినందున రాలేదు. ఒకప్పుడు అగస్త్యునికి కోపము వచ్చి సముద్రమునుపానము చేసెను. భూమికి వస్త్రములేకుండ చేసెను. అగస్త్యులు అట్టివారు. వారిదిక్కునకు పోయి పాండ్యదేశమునకు పోయెను. అర్జునుడు సంచరించుచుండగా మణలూరిరాజగు చిత్రవాహనుడు చూచి అతని రప్పించి, నాపుత్రిని వివాహమాడెదవా యని యడిగెను. అర్జునుడు సమ్మతించెను. నాకు ఒక వాగ్దత్తము చేయవలయును అదేమన బిడ్డపుట్టిన నాకు యిచ్చిపోవలయు ననెను. నావాడుకయును అట్టిదే యని అర్జునుడనెను. చిత్రవాహనుడు తనకూతురిని అగ్నిసాక్షిగ పెండ్లిచేసెను. అర్జునుడు అచట మూడుసెలలు ఉండెను. సకలభోగము లనుభవించెను. దక్షిణతీర్థములలో స్నానము చేసెను. అచట ఐదుతీర్థములలో స్నానముచేయు వాడుక లేకుండెను. ఆతీర్థములలో దిగవలదని ఋషులనిరి. ఎందుచేతనని అర్జును డడుగగా సౌభద్ర పౌలోమ కారండవ ప్రసన్న భారద్వాజములను నీయైదు తీర్థములలో మొసళ్లు లున్నవని వారు చెప్పిరి. అర్జును డాతీర్థమున దిగగా ఒక మొసలి కాలుపట్టుకొనెను. ఆమొసలితోడనే కాలిని బయటికెత్తి విదిలించెను. ప్రకాశము కలిగి ఆమొసలి ఒక అప్సరసయై నిలిచి నేను అప్సరసను. కుబేరునికి మిగుల ప్రీతిపాత్రురాలను. నేనును నాసఖులును తపము గావించుచుండిన యొక బ్రాహ్మణుని చెరుప యత్నించితిమి. ఇటుల మొండిపట్టు పట్టునట్టి మొసలిజన్మము నెత్తుడని ఆయన శపించెను. మార్గమున నారదుని చూచి నమస్కరించి యేడ్చితిమి. అర్జునుడు వచ్చును శాపమోచనమగు ననెను. ఇంకను నాయటుల నలుగురు ఉన్నారు. ఆతీర్థములలో స్నానము చేయుము. వారికి శాపము పోనిమ్ము అనెను. అర్జునుడు ఆతీర్థములలో స్నానముచేసి వారి శాపమోచనముచేసి పంపెను. చిత్రాంగదతోడనుండి ఒకపుత్రుని గనెను. వానిపేరు బభ్రువాహనుడు. అర్జునునికి మించినవాడు. అర్జునుడు ఆబిడ్డతోడ నుండుమని చిత్రాంగదకు చెప్పి రామేశ్వరమునకు పోయెను. శ్రీరామనాథస్వామిని దర్శించి సేతువు చూచి నమస్కరించి శ్రీరామచంద్రునికితప్ప యింకొకని కీకార్యము సాధ్యపడునా యని స్తుతించి గోకర్ణక్షేత్రమునకు పోయెను. గోకర్ణేశ్వరుని శిరమున పుష్పము ఉంచెను. జ్ఞాపకముండనిమ్ము ఒకసమయమున తలపండు పగులగొట్టబోవుచున్నానని ఉంచెను. పిదప పశ్చిమదిక్కున పోయెను

ఆసముద్రములలో స్నానము చేసెను. ప్రభాసతీర్థములో స్నానమాచరించెను. చంద్రునికి క్షయము కాగా దానిలో స్నానము చేసెను. ఒకపక్షములో క్షయము ఒకపక్షములో వృద్ధియని యేర్పడెను. అర్జునునికి సేతుస్నానమువలన పాపక్షయము కూడాయెను. ప్రభాసతీర్థము వలన ప్రయోజనము లేకుండెను. అటుల ప్రయోజనము లేకపోలేదని ఆతీర్థమునకు తోచెను. సుభద్రాకల్యాణమునకు హేతువు కలిగించెను. పశ్చిమసముద్రములోనే కదా ద్వారక. వాసుదేవుడు బాగుగ నున్నాడా విశేషమేమి యని అర్జునుడు ఋషుల నడిగెను. వాసుదేవుని చెలియలు సుభద్ర ఉన్నదట. ధృతరాష్ట్రుని కొడుకగు దుర్యోధనుని కీయవలయునని బలభద్రుని యిష్టమట. అర్జునుడటనే వానికీయవలయునని వాసుదేవుని యిష్టము. దుర్యోధనుని కీయ వలదనుటకు లేక కానిమ్ము కానిమ్ము అనుచున్నాడు అని ఋషు లనిరి. అర్జునుడు ఆసంగతి విని వాసుదేవునియొక్క ఆనుకూల్య మున్నది. బయలుదేరినది పడుమలు దొరకు ముహూర్తముగ నున్నది. ద్వారకకు పోవలయును అని తలచెను. ఇటుల ఆశపుట్టించినది ప్రభాసతీర్థమేను. తీర్థయాత్రాప్రకారమైన వాసుదేవుని యింటికే పోవచ్చును. సంగతి వేరైయుండుటచేత అర్జునుడు ద్వారకకు పోక అచ్చటనే యుండెను. ఒకటి రెండు మూడు దినము లాయెను. స్వామి రాలేదు. శ్లో. నివాసవృక్షస్సాధూనాం అపన్నానాం పరాయణం। భక్తార్తిభంజన శ్రీమాన్ కృష్ణయేవ గతిర్మమ. అని జపించుచుండెను.

---

## (22) సుభద్రాకల్యాణము.

---

అర్జునుడు సుభద్రను పెండ్లాడగోరి ఆమెయొక్క వివాహవిషయమున కృష్ణబలరాముల అభిప్రాయము వేరుగ నుండుటచేత ద్వారకకుపోక రైవతక పర్వతముచేరి అచట రెండుమూడు దినములుండి యెవరును రాకుండగా కృష్ణుడే గతి యని నిశ్చయించి సాక్షాత్ ద్వారకానాథుని మనసా స్మరించెను.జగదీశా రెండు మూడు దినములుగ వచ్చియున్నాను. నీవు వచ్చి నాకార్యము నెరవేర్చవలయునని ప్రార్థించెను. కృష్ణా తీర్థయాత్రకై వచ్చితిని. ఎంతకాల మీగుహాలో నుందును. రా రా దేవాధిదేవా ఏలనీకు దయరాదురా. ఇంకను శ్రమపడనిమ్ము. అంతయవసరమేల యని తలచెదవా. మన్మథబాధచేత తపించుచున్నాను. మన అర్జునుడేకదా అల్లాడనిమ్మని తలచెదవా. ఇది వేడుకచేయు సమయము కాదు. నాతో పోటీయా, ఎవరెవరో పిలచిన పోయి రక్షింతువు. నేను భక్తుడను. స్నేహితుడను. శ్రమపడుచున్నాను. ఇంకను నెంత వేడుకొనవలయును పంతమేలరా, నేను మనఃపూర్వకమైన భక్తితో స్తుతించుచున్నానో లేదో అంతర్యామివై నీకు తెలియదా యని స్తుతించెను. పరమభక్తుడైన అర్జునుడుండు రైవతక పర్వతమునకు గరుడారూఢుడై స్వామి వచ్చి చేరెను. అర్జునుడు అచ్చటచట తీర్థములలో

స్నానముచేసి భగవంతుని భాగవతులను దర్శించుచు భగవద్ధ్యానముతో పరిశుద్ధుడై వర్తించుచుండెను. ఇపుడు భగవద్ధ్యానమును వదలి భగవంతుని చెలియలిని స్మరించెను. కృష్ణమూర్తి అర్జునా యనగా అర్జునుడు నవ్వెను. కృ- ఏల అర్జునా నవ్వెదవు. అ.- నాకొక ఆశకలిగెను. అది సరియైనదో కాదో. కాపాడవలయును శరణాగత వత్సలుడవుకదా. కృ- అర్జునా నవ్వుచు కాపాడవలయుననిన నెటుల తెలియును. బాగుగ చెప్పుము. అ- ద్రౌపదివిషయమై మేము చింతించగా నారదుడు వచ్చెను. ఒకకట్టుబాటు చేసెను. ఆకట్టుబాటు ననుసరించి అన్న ద్రౌపదితోడ నుండగా నేను బ్రాహ్మణునికై లోపలపోయి వారిని చూచితిని. ఆపాపపరిహారమునకు తీర్థయాత్రకు బయలువెడలి నిన్ను చూడవచ్చితిని. నీచెలియలిసంగతి విని ఆశజెందితిని. మన్మథుడు మిగుల బాధించుచున్నాడు. మీఅన్న ఆమెను దుర్యోధనునికి యిచ్చెదనని యున్నాడట. నీవు నీచెలియలిని నాకు పెండ్లిచేయుము. కృ- నేను చెప్పినటుల చేసెదవా. అ- ఏమిచేయుమనిన ను చేసెదను. కృ- సన్యాసమును స్వీకరింపుము. అ- సరి. ద్రౌపదినిసహా విడువమనె దవా. కృ- (నవ్వి) పిచ్చివాడా. వేషము వేయుమంటిని. కార్యము కాగనే తీసివేయుము. అ- ద్వారకకు పోయిన భిక్షదొరకును. కన్య దొరకునా కృ- చాతుర్మాస్యము సలుపుము. అ- ఎన్నిదినము లుండినను కన్యనడుగుటకు లేదుకద. కృ- నేనెందుకున్నాను. నీవు సన్యాసము పుచ్చుకొనుము. నేనున్నాను. అ- దండము కాషాయవస్త్రములు కావలయునే. కృ. నే నిచ్చెదను. (అనియిచ్చెను.) అ- సన్యాసి యేమి సేయవలయును. కృ- మిథ్యాసన్యాస మగుటచేత క్రియలు చేయపనిలేదు. ఎవరైనను మాటలాడిరేని నారాయణా యనుచు ఉండుము. నేను నమస్కరించెదను. నారాయణ యనుము అటుపై చూతము. (అర్జునుడు నాలుగుపర్యాయములు నారాయణా యనును. ఐదవసారి సుభద్రా యనును. స్వామి వాడుక చేయించెను.) అర్జునా అన్నకు కోపము వచ్చును. నేను ఉండరాదు. సుభద్రమాట యెత్తకుము. అర్ధకంటిని మూసికొని అర్ధకంటిని తెరచుకొనుము.జాగ్రతగా నుండుము.అన్న పిలుచునటుల చేసెదనుఅని కృష్ణుడనెను. అర్జునుడు భగవంతుడిచ్చిన కాషాయమును ధరించి పరమ యోగ్యునివలె కూర్చుండియుండెను. ఒకనాడు వాసుదేవుడు బలరాముని జూచి అన్నా రేపు వ్రతదినము స్నానఘట్టమునకుపోయి స్నానమాచరించి వత్తమా యని అతని మనసును త్రిప్పెను. బలరాముడు అహా యని సకలబంధులతోడ బయలుదేరెను, అచ్చటికిపోయి స్నానముచేసి దానము లొసర్చిరి. నమస్కారములు చేయవలసిన స్థలములు చూచి అర్జునుడుండు గుహాద్వారముగుండా వచ్చిరి. బలరాముడు అర్జునుని జూచి యతీశ్వరుడుగ నున్నాడే యనెను. మహాయోగీశ్వరునివలె నుండుమని కృష్ణుడు చెప్పియుండెనుగాన కొంచెము కన్ను మూసియుండెను. బలరామాదులు నమస్కరించిరి. అర్జునుడు మాటలాడలేదు. కృష్ణమూర్తి కొలుపైలం దూరములో నుండెను.బలరాముడు స్వామిని పిలుచుకొని రమ్ము

నెను. కృష్ణా యిట్టి విరక్త శిఖామణిని సేవించవలయును. మిగుల, పెద్దలు. నమస్కరిం చుటకు రా,రా అని పిలువుమనెను. అన్న కేమిపని ఇదిరొుకపిచ్చి. ఎప్పుడును యోగీశ్వ రులే. ఇది క్షేత్రము. ఎందరో వచ్చుచుందురు. రెండు మూడు దినములుండి పోదురు. పనిలేదు. అన్న, సేవించిన చాలును అని కృష్ణుడనెను. కృష్ణా యతినింద సేయరాదు. మూఢపిల్లకాయవు. సేవింపరమ్మ అని బలరాముడు చెప్పగా మీరు తిట్టినను రానని స్వామి యనెను. వీనికి భగవద్భక్తి భాగవతభక్తి లేదని బలరాముడు తిట్టెను. బలరా ముడు మరలపోయి నమస్కరించి చాతుర్మాస్యముగాన రావలయునని పిలిచెను. బల రాముడును యుద్ధవుడును చేరి వింజామరలు వేసిరి. నవరత్నఖచిత స్వర్ణపల్లకిలో అతని గూర్చుండబెట్టి పిలుచుకొని పోయిరి. సాంగోపాంగముగ వేదమును అధ్యయనముచేయు బ్రాహ్మణులు వేదాధ్యయనము చేయుచు వెంటపోయిరి. సాత్యకి యుద్ధవుడు ముందు ముందు రాళ్ళుతీసివేయుచు పోయిరి. ఒక మఠములో అతని నుంచిరి. చాతుర్మాస్య వ్రతము అయెను. అచ్చటచట భిక్షలు లాడు పేణీలు కలకండపాయసములతో జరుగు చుండెను. బుద్ధిమంతుడగు కిరీటి బలరాముడు మొదలగువారితో తత్వవిచారము సేయు చుండెను. ఏకాంతమునకై అతడు ఒక తెరవేసికొనియుండెను దానిలోపల సుభద్రాజప ము చేయుచుండెను. బలరాముడు వేచియుండి లోపలవచ్చి సేవించి మాటలాడగా నారాయణ యనును. ఇటుల వేషమువేసి చాతుర్మాస్యవ్రతము జరుపుచుండెను. స్వామి చూచెను. అర్జునుడు గృహస్థాశ్రమియై యుండినయెడల సుభద్రనుగూర్చి యెవరినైన అడుగును. సన్యాసిగ నుండుటచేత అడుగుటకు లేదు. మూడుపక్షము లాయెను. భగవ త్సంకల్పముచేత పెద్దవాన వచ్చెను. ఈయన భిక్షకు పోవుటకును అందరు దర్శనార్థ ము వచ్చుటకును లేకపోయెను. యతీశ్వరుని సుభద్ర బంగాళాలో నుంచుదమనుకొనిరి. అందరుచేరి రేపటికని నిర్ధారణచేసిరి. అన్నా అదేమియని స్వామియడుగగా నీకేమిరా నీవు వచ్చుటలేదే అని బలరాముడనెను. అన్నా యీసన్యాసిని నమ్మకుము. రాజగృహ ము. పట్టరాణు లుందురు. ఇంకను సుభద్ర మొదలగువారు ఉందురు.ఎచ్చటనో ఉండి నవాని ఊరికి పిలుచుకొని వచ్చితిరి. ఇపుడు నగరుకు అనుచున్నారు ఇదివరలో చెడ్డవా రులేను. మీయిష్టము. అతని పిలుచుకొని రారాదు. చిన్నవాడు. ముసలివాడుగనుండవల యును. మన్మథునివలె నున్నాడు. వచ్చినవారితో నంతయు మాట్లాడుచున్నాడు. అం తయుక్తముగ లేదు. అని కృష్ణుడనెను. కృష్ణా అటుల చెప్పవలయునని తోచుచున్న దాయని బలరాము డనగా,అన్నా సౌభరియను యోగీశ్వరుడు మత్స్యములదంపతులను చూచి తాను పటులే యొకభార్యతోడ సుఖము లనుభవింపగోరి మాంధాతయొక్క పుత్రి కలలో నొకతె నిమ్మని యడిగెను. ఈదరిద్రబ్రాహ్మణుని తనపుత్రికలలో నొకతె యెటుల పెండ్లాడదని రాజనగా సౌభరి యేబదిరూపములెత్తి యోగశక్తిచేత ఆకాశమార్గమున వచ్చి వారిని అనుభవించెను. ఆరాజపుత్రికలు గర్భము దాల్చిరి.ఏమనగా సంగతి చెప్పెద

రూపాన భోగియైనాడే. వీడు అంతకంటెను హెచ్చా అని వాసుదేవుడనెను. ఏమిరా ఒకడు చెడిపోయిన అందరును అటులేనా యనిబలరాముడనగా, అన్నా వ్యాసునితండ్రి యగుపరాశరుడు చేపలు పట్టువారి కూతురిని ఓడలో కలిసెనే. ఇంతకంటెను హెచ్చా. బ్రహ్మ తిలోత్తమను సృష్టించి యింత అందముగ నున్నదని తానే కోరెను. ఈసంగతి యెవ్వరికిని తెలియలేదు. మనసున నున్న మన్మథుడు నవ్వెను. ఇతడు అంతకంటెను హెచ్చైన వాడా యని వాసుదేవుడనెను. నీమాటల కేమి పోరా యని వినక యోగీశ్వరుని బలరాము నింటికి పిలుచుకొని వచ్చిరి. ఆయతీశ్వరు డొకనాడు భుజించునపుడు చేర్చగూడని పదార్థములను నొకటితో నొకటి కలిపెను. సుభద్రధ్యానముచేత నటులచేసెను. అయ్యో అన్నియు బ్రహ్మస్వరూపము అనుకొనిరి. స్వామి మనసున నవ్వుకొనెను. యతీశ్వరుడు తపముగావించునపుడు ప్రక్కన విసరుచుండవలయును. నన్ను పిలుచుకొని రావలయుననిన ఒకరుండవలయును. మనబిడ్డ యున్నదే సుభద్ర దానికి అంతకంటెను పనియేమి అని తలచి బలభద్రుడు సుభద్రను పిలిచి అమ్మా నీకు మంచిభర్త లభించును. శుశ్రూషచేయుచుండుము అనెను. ఆమె యతి యని శుశ్రూష చేయుచుండెను. అహా అర్జునుడు ఊరికి వచ్చినాడు. నగరులోనున్నాడు. సుభద్రయు వచ్చెను. ఇక వివాహము కావలయును అని స్వామి తలచెను. సుభద్రకు కొంచెముకొంచెము వాడుకపడి పాదసేవ చేయుచుండెను. అర్జునునికి రోమాంచము కలిగెను. అపుడు బలరాముడు రాగా హా రేహా రే మాధవ మాధవ యనుచుండెను యతీశ్వరునికి సుభద్రకును యీసంభాషణ జరిగెను. సు.—స్వామీ ఒకసంగతి. తమరు యోగీశ్వరులు. అచ్చటచ్చట సంచరించుచుందురు. పాండుపుత్రుల నెరుగుదురా. అ.—ఔను. సు.—అర్జునుడట నే. తీర్థయాత్రకు బయలుదేరె నట నే. అ.—ఔను. నీవు భగవంతుని చెలియలివి. రాజపుత్రివి కదా. సు.—అర్జునుడు మిగుల సుందరుడట నే. అ.—ఏమిచెప్పుదును మన్మథుడేను. సు.—నిజముగనా. ఎన్నడైనను చూచితిరా. తీర్థయాత్రకు పోయెనని తెలిసెను. అ.—నేను చూచితిని. సు.—ఎచ్చట నున్నాడో. అ.—ఇచ్చటనే యుండునటుల తోచుచున్నది. సు.—ఇచ్చటనగా నెచ్చట. అ.—వాసుదేవునికిని వానికిని స్నేహమట. అందువలన నిచ్చటనే ఉన్నాడట. సు.—(సరియనుకొని) నాకు మంచిభర్త దొరకునా. ఫల్గున నరుడు దొరకునా. (అనగా యేమనుజుడు అల్పుడుకాడో వాడు నాకుభర్తయగునా యని పైకి తెలియుచుండు అర్థము. అర్జునుడు దొరకునాయని ఆమె మనసులోని యర్థము.) అ.—ఆహా దొరకును. సు.—నాకు విజయము దొరకునా. (అనగా నాకు జయము కలుగునాయని పైకి కనుబడు అర్థము. అర్జునుడు దొరకునా యని ఆమె మనసులోనియర్థము. అర్జునునికి ఫల్గునుడనియు విజయుడనియు పేరులు.) అ.—విజయమేకద నీచేతనున్నది. అని అర్జునుడు సుభద్రతో చెప్పి భగవంతుడు బాగుగ పరీక్షించెనని తలచెను. రైవతక పర్వతమున నుండునపుడే అర్జునుడు అల్లాడెను.

ఇంతజరిగి ఆమె సమీపమున పాదసేవచేయుచు యుక్తిగ అడుగగా అర్జునుడు సహించలేదు. ఏ యర్జునునిగూర్చి నీవింత అడుగుచున్నావో ఆయర్జునుడు దాసుడేను అని చెప్పెను. సైచక ఒకనిమిషము సన్యాసివేషమును మాని ఆమెను ఆలింగనము చేసికొని ముద్దుపెట్టుకొనెను. పెండ్లికాకముందు యిటుల చేసితిమని యిద్దరును భయపడిరి. మనకు యిద్దరికిని పరమయిష్టముండినను దేశకాల అవస్థలను చూడక యిటుల అవసరపడితినేయని అర్జునుడనగా, అవసరపడితిరే యని సుభద్రయు భయపడెను. సుభద్రాకృష్ణుని అనుమతిలేక యిటుల చేసితిని. నీవు చిన్నదానవు రేమి చేయుదువు. వాసుదేవుని పిలుచుకొని రమ్మా ఇటులాయెనని ఆయన పాదములుపట్టుకొని చెప్పెదను. మంచియో చెడ్డయో కృష్ణార్పణము చేయవలయును అని అర్జునుడనగా, వాసుదేవుడు అన్న. మగవాడు. ఎటుల చెప్పుదునని సుభద్ర తల్లియొద్దకువచ్చి యేడ్చుచుండెను. అమ్మా యేమే యతీశ్వరుడు తాకెనా యని దేవకి యనగా కాదని సుభద్ర చెప్పెను. ఏమిచేయుటకును లేక దేవకి సుభద్రను పిలుచుకొని పోయి కృష్ణా యతీశ్వరుడు ఆలింగనము చేసెనానెను. యతీశ్వరుడా? నేను చెప్పియుండలేదా. పోనిమ్మా మరియెవ్వరినిగాక కన్యపనామనే కద తాకెను. ఈవేషధారుల టక్కులు యెరుగవా. ముందొకసారి పాంచాలదేశమున బ్రాహ్మణవేషముతో ద్రౌపదిని, సన్యాసివేషముతో యీచిన్నదానిని యిటుల చేసెను అని వాసుదేవుడనగా, కృష్ణా మంచిది. బలరాముడు దీని సుయోధనునికి యిచ్చుటకు ఉండెనే. అర్జునుడాయెను. మేలు సంబంధము సరిగ్గాయెనది. నీవెట్లైనను పెండ్లిచేయుము అని దేవకి యనెను. అన్న మిగుల కోపానికతో నున్నాడు. నావలన కానేరదని స్వామి చెప్పగా ఈసంగతి తెలిసిన పంపుదని దేవకి యనెను. పంపిన పంపనిమ్మా. కన్యనిచ్చిన యీయనిమ్మా. నావలన కాదు అని స్వామి చెప్పగా, వారు యిద్దరును యేడ్చిరి. కృష్ణా బలరామునికి తెలిసిన పంపును. స్త్రీహత్యయు యతిహత్యయు సంభవించును. పదునాలుగు లోకముల కాధారభూతుడగు నిను వినా వేరెవ్వరితో నీ యాభాసమును చెప్పికొందును అని దేవకి యనగా ఈసంగతిని రహస్యముగ నుండనిమ్మా. సుభద్రా మరియు పోయి జాగ్రత్తగనుండుము. నేను పెండ్లిచేయనా అని స్వామి చెప్పెను. పది దినములు కాగా మరల పుణ్యకాలము ప్రాప్తించెను. నదికి పోదమని అందరు పోయిరి. దేవకీవసుదేవులు యింటనుండిరి. భగవత్సంకల్పముచేత అందరు పోయిరి. నదికి పోయినవారు సంకల్పములు దానములు అన్నియును చేసిరి. సాయంకాలమాయెను. రాత్రిలో నిందరిని పిలుచుకొని పోనేల. ఉదయమున పోవుదమని స్వామిచెప్పగా అందరును సమ్మతించి అచటనే యుండిరి.

భగవద్గీత 7 అధ్యా 14 శ్లో వలె భగవన్మాయచేత అందరు నిద్రించిరి. స్వామిమాత్రము వచ్చి తలుపు తెరువుమనెను. సుభద్ర తలుపు తెరచి అన్నా యనెను. అరవకుమని స్వామిచెప్పగా యెచ్చటికి వచ్చితివని సుభద్ర అడిగెను. నీకు పెండ్లి

యని స్వామిచెప్పగా యీచీకటిలోనా యని సుభద్ర యడిగెను. స్వామిసంకల్పము చేత ఆస్థలము వైకుంఠమాయెను. సుభద్రా మంటపమును చూడు మని స్వామి చెప్పెను. వేడుక లేదని సుభద్ర అనగా చూడుమనిచెప్పి స్వామి స్మరించగనే ఇంద్రాదిదేవతలును పరమశివుడును బ్రహ్మయు స్వామియు వారివారి స్త్రీలతోడ నుండిరి. అమ్మాయేమని స్వామి యనగా దానము చేయువా రెవరని సుభద్ర యడిగెను. నేనున్నానని స్వామిచెప్పెను. తలిదండ్రులు లేకుండినగదా నీవు సేయవలయునని సుభద్రయనగా స్వామి దేవకీవసుదేవులను పిలిచి యిరువురిని కూర్చుండబెట్టెను. పురోహితు డెవరని సుభద్రయనగా స్వామి సప్తర్షులను స్మరించెను. వారు వచ్చిరి. స్వామి ఋషులను చూచి లగ్నము బాగుగ నున్నదా చూడుడని చెప్పగా, వాసుదేవా మామనోభావమును పరీక్షించెదవా. జ్యోతిష్కులు చెప్పునట్టి దోషపరిహారముగ నీచరణారవిందమును స్మరింతురే ఏనీచరణారవిందమును దలచి శుభకార్యములు చేయుదురో అట్టినీవు ముహూర్తము పెట్టియుండగా దోషముండునా యని వసిష్ఠ వామదేవాదులు మంత్రలోప తంత్రలోపములు లేక వివాహము చేసిరి. దేవాదులు వారివారి శక్తికిని భక్తికిని తగినటుల కానుకలిచ్చిరి పిదప ఇంద్రాదులు మహర్షులు స్వస్వస్థానములు చేరిరి. స్వామి తలిదండ్రులను యింటిలో విడిచిపెట్టి అర్జునా రథమున్నది. తెల్లవారబోవుచున్నది. రథములోపోయి ఊరు చేరు మనెను. స్వామి తానును పోయి వారితోడ పరుండెను. కృష్ణా బాగుగ నిద్రపట్టలేదని వారనగా నేను నిదురించనేలేదని స్వామి యనెను. స్వామి పోయిన పిమ్మట సుభద్రా రథము నడుపవలయునె యెవరున్నారని అర్జును డనగా నేనున్నానని సుభద్రచెప్పెను. నీచేత నగునాయని అర్జును డడుగగా యిటు లగునని అన్న చిన్నతనమున నేర్పినాడని సుభద్రచెప్పెను. ఐన నడుపుమని అర్జును డనగా సుభద్ర తోలెను. రథమును కోటవాకిటివారు పట్టుకొనిరి. జాగ్రతగ నుండుడని బలరాముడు చెప్పియుండెను. కావలివారు జాగ్రతతో చూచుచుండి యతీశ్వరుడు చిన్నమ్మను పిలుచుకొని పోవుచున్నాడని బాణములు వేసిరి. అర్జునుడు స్వామి చెప్పినటుల జాగ్రతతో బాణములును వేయగా వారికి దెబ్బతగులకయే వారిని త్రోసివేసెను. అర్జునుడు పోయి ఇంద్రప్రస్థము చేరెను. కావలివారు బాణములను చూడగా అర్జునుడని యుండెను. వారు వానినెత్తికొని పరుగులిడుచుపోయి బలరామునికి చూపిరి. బలరాముడు చూచి వాసుదేవా ఆసన్యాసి అర్జునుడటరా యనెను. నేనేమి చెప్పితినని స్వామి అనగా బలరామునకి కోపము వచ్చెను. చూడు మిపుడు నాహలాయుధముతోడ పోయి పాండవులను సంహరించి వారిపేరులేక చేసి వచ్చెదను అని బలరాముడు తన ఆయుధముతోడ బయలుదేరెను. అన్నా మీరు అన్నియును చేయుదురు. పిమ్మట మన సుభద్ర గతి యేమి. నామాటలేమో వినరు. పొండి అని వాసుదేవు డనెను. వాసుదేవా నీవు వలదు వలదంటివిరా యని బలరాము డనగా అనుభవింపుమని స్వామి యనెను. ఏమి

చేతునురా యని బలరాము డనగా అన్నా దుర్యోధనుడైననేమి అర్జును డైననేమి. మంచి స్థలముననే చేరనీ యని వాసుదేవు డనెను. అందరును ఊరుచేరిరి. అన్నా మనమందర మును ఉండియుండిన యెంత యిచ్చియుందుము. బిడ్డ దిక్కులేనిదానివలె అయెనే యని స్వామి అందరిని ఇంద్రప్రస్థమునకు పిలుచుకొనిపోయి అచట రహస్యముగ వివాహమై యుండినను ఇచట బహిరంగముగ లౌకిక పెండ్లి చేసెను. స్వామి పాండవబంధువు యి టులచేసెను. పాండవులవలె సాక్షాత్ జగదీశ్వరుని మరువకుండినయెడల కాపాడును.

---

## (23) ఖాండవవన దహనము.

---

అర్జునుడు స్వామికి అత్తకుమారుడు.మరియూ సోదరిని యిచ్చెను.కాబట్టి మిగుల ప్రీతి. అందుచేత ఇంద్రప్రస్థమున సదా అర్జునునితోడ నుండెను. వీరిద్దరు యమునా నదీతీరమున వేటాడ బోవుచుందురు. స్వామి యిటుల కొంతకాల ముండెను. సుభద్ర గర్భిణి యాయెను. సాధారణ సమయముననే ఉండినవాడు యిపుడు పోవునా. కనుక స్వామి అచ్చటనే ఉండెను. ఒక సుదినమున సుభద్ర అభిమన్యుని కనెను. ఆదినము సకలజనులు శ్లాఘించునట్టిది. ఎన్నిగుణము లుండవలయునో అన్నిగుణములు ఉండినవి. ఇంద్రాణి జయంతుని, దేవకి వాసుదేవుని కౌసల్య రాముని, కనినటుల సుభద్ర అభిమ న్యుని కనెనని చెప్పలేదు. కుంతి అర్జునుని కనినటుల కనె ననిరి. పరమ వీర ధీర శూరు డగు అర్జునుని వానితల్లి కనినటుల అర్జునునివంటివాని సుభద్ర కనెను. అభిమన్యు అని పేరు పెట్టిరి. అభి-భీ-భయము. అ=లేదు. అర్జునుడు మొదలైన శూరులు యుద్ధమున ప్రవేశించుటకు భయపడుదురు. ఇతడు భయపడడు. మన్యు=కోపము. శత్రులు ఒకమా ట చెప్పిన ఇతనికి సరిపడదు. మిగుల ఆగ్రహము. ధర్మపుత్రాదులు నిదానింతురు. స్వామి అచ్చట నుండెను. కొంతకాలముకాగా ద్రౌపదికి ఒక బిడ్డపుట్టెను. పాండ వేవురికిని ద్రౌపతియందు ఏవురు పుత్రులు కలిగిరి. ప్రతివింద్యుడు, శ్రుతసోముడు, శ్రుతకర్మ, శతానీకుడు, శ్రుతసేనుడు అనెడు నేవురిని, అదితి ఇంద్రుడు మొద లగువారిని కనినటుల ద్రౌపది కనెను. ఒకనాడు స్వామి కిరీటి యమునానదికి పోయి రథముడిగి పాదచారులై గాలికొరకు ఆనదీతీరమున తిరుగుచుండిరి. అలరాగా వెనుకకు పోవుచు అలపోగా ముందుకుపోవుచు వేడుకగా విహరించుచుండిరి. అల ఒకసారి కాలిమీదికి వచ్చును. ఒకసారి వస్త్రముతాకును. ఇటుల వేడుకగా నుండిరి. ఓరగ నిలిచిరి. యమునానది అడుగడుగుకును స్వామిపాదమును తాకుచుండెను.ఎందు చేత ననగా స్వామిపాదము ఒకస్నేహితురాలినిఇచ్చెనే యింకను స్నేహితురాం డ్రెవ రైన నున్నారా యని వెదకుచుండెనని కవికి తోచెను. అటుల గంగాజనకుడైన స్వా

మిపాదమును తాకెను. అలయును వ్యాజముతో యమున భగవత్పాదమును తాకె గంగ కలె. యింకను సేవకైన నున్నారాయని చూచెనే అట్టినదులకు వెయుకొనేల యనిన ఆగంగ బ్రహ్మహత్యాది పాతకములను పోగొట్టునది. త్రైలోక్యపావని. భగవంతుని చరణసంబంధముచేత అటుల కళంకము లేనిదాయెను. అశ్వమేధములు, వాజపేయములు పదివేలు చేసినవానికంటెను ఒకసారి గంగాస్నానము చేసినవాడు అధికుడగును. అశక్తులు పోవుటకు లేకున్నయెడల శతయోజనములలోనుండి భక్తిశ్రద్ధాపురస్సరముగ గంగ గంగ యనిన ముక్తినొందుదురు. సకల పాపములను పోగొట్టుకొని పరిశుద్ధులగుదురు. భగవత్పాదోదకమున కంతటి మహిమ యుండగా ఆస్వామి యెట్టివాడుగ నుండును. వాని స్తుతింప మనతరముగాదు. బ్రహ్మాదులకు వేదములకు అందనివాడు. అట్టి చరణారవిందమున యమునానది వెదకెను. అటుల వేడుకగ వారు నిలిచియుండగా ఆసమయమున ఒక వృద్ధ బ్రాహ్మణుడు వచ్చిచేరెను. ఆయన యెవరనగా అగ్నిభగవానుడు. వాసుదేవ కిరీటులకును అగ్నిభగవానునికిని యీక్రింది సంభాషణ జరిగెను. కృ—తామెవరు. అ— బ్రాహ్మణాఃభోజనప్రియాఃఅని యున్నదికదా. ఎచ్చటికి పోయినను తృప్తికలుగుట లేదు. మీరు ఘనులు యాచించవచ్చితిని. కృ— అంత ఆకలియా. అ— ఔను. కృ— ఆకలి యెచ్చట నున్నది. అ— కడుపులో నున్నది. కృ— వెలుపలికి రాకున్నదేమి. అ— మీయొద్దకు వచ్చుటకు భయము. కృ— ఎందుచేత. అ— మీరు దానిని నేటితో హతము గావింతురు. అందుచేత భయపడి లోపల కూర్చున్నది. నన్ను బాధించుచున్నది. అని అగ్నిభగవానుడు చెప్పగనే ఆయనకు కావలసినది యిచ్చుటకు వారికేమి ధనములేకపోయెనా అటులే యిచ్చెదమనరాదా. అధికముగ కావలయు ననుచున్నాడని అర్జునుడు స్వామిని మాచెను. అర్జునా సద్బ్రాహ్మణుడు. ఎవరును ఆయనకు కావలసినంత యీయనటులున్నది. మంచిది అనుము. అని స్వామి యనెను. మీకేయాహారము కావలయునో అడుగుడు యిచ్చుటకు సిద్ధముగ నున్నానని అర్జునుడు చెప్పగనే బ్రాహ్మణుడు అపుడే ఆరూపమునుమార్చి అగ్నిభగవానుడుగ కనుబడి పులిహోర దధ్యోదనముల భుజించు బ్రాహ్మణుడను గా ననెను. అయ్యో బ్రాహ్మణుడని తలచి యిచ్చెద నంటినే యని అర్జునుడు కనుసైగచేయగా కానిమ్ము. చరాచర ప్రపంచము మనచేత నున్నదని స్వామి యనెను.

ఖాండవవనము పండ్రెండుయోజనముల విస్తారము గలది. దానిలో అనేక వృక్షములు జంతువులు అసురులు ఉండిరి. అగ్నిదేవుడు వారితోడ వనమును దహింప గోరగా కిరీటి యోచించెను. ఏల యోచించెదవని స్వామి యడుగగా యీఖాండవవనమును ఇంద్రుడు కాపాడుచున్నాడు. ఏలన ఇంద్రునికి పరమస్నేహితుడైన తక్షకుడు యిచ్చట నున్నాడు. దీనికి కష్టము వచ్చిన ఇంద్రుడు వచ్చును. దేవరా జతెను. అందునను తంత్రమని యోచింపక వాగ్దత్తము చేసితినని కిరీటి చింతించెను.

భగవద్గీత ౩. అధ్యా ౩౧ శ్లో క్షత్రియజాతిలో పుట్టితివి. తండ్రియైనను గురువైనను శత్రుభావముతో వచ్చినయెడల యుద్ధము చేయవలసినదేను. అర్జునుడు శత్రుడు. కృష్ణుడును ఉన్నాడు అని తలచి విడ్డిచిన విడువనిమ్ము. యుద్ధమునకు వచ్చిన కానిమ్ము అని వాసుదేవుడు అనెను. అగ్నిదేవుడు ఖాండవవనమును దహించుటకు కృష్ణార్జునులు అనుమతి నిచ్చిరి. ఈ అగ్నికి ఖాండవవనమును దహింపవలయునని యేలయుండుటకు కారణమేమనగా, శ్వేతకి యనురాజు పండ్రెండేడులు అహోరాత్రములు ఒకయాగము చేసెను. ఋత్విక్కులు పొగచేత కన్నులు తెరువలేక పోయిరి. ఇటు లుండగా ఆరాజర్షి మరియొక యాగము చేయవలయుననెను. వారు కొంత నిదానింపుడనిరి. శరీరము అనిత్యమైనది. నాకు యాగము చేయవలయునని తోచెను. మీకు దక్షిణ లీయనా బరువుడని శ్వేతకి యనగా మాకన్నులు సరిపడుటకు కొంతకాలము పట్టును. వేరెవరైనను చూచుకొనుడని వారనిరి. వేరెవరున్నారని శ్వేతకి యనగా ఫాలనేత్రుడగు పరమశివుని నడుగుమని వారనిరి. శ్వేతకి పరమశివునితో సంగతి చెప్పి అడుగగా కానిమ్ము యోచించెద ననెను. మీరు బయలువెడలగనే పోయెదనని జితేంద్రియుడై జితక్రోధుడై శ్వేతకి పరమశివునిగూర్చి పండ్రెండేడులు తపము గావించెను. పరమశివుడు యోచించెను. వారు క్రాంతులై చెప్పిరి. ఈయన నమ్మి వచ్చెను. యోచించెద ననగా పండ్రెండేడులు తపముగావించెను అని, తలచి రాజా నేను యాగము చేయించువాడనుగాను. బ్రాహ్మణులు ఆకార్యము చేయుదురు. నేను నాభాగమును గైకొనువాడనే. నా అంశయైన దూర్వాసుడు యాగము చేయించును అని దూర్వాసునికి ఆజ్ఞయీయగా రాజు పండ్రెండేడులు యాగము చేసెను. అగ్నికిపైనకట్టియుంచి అహోరాత్రములు నేతిధార పడుచుండెను. ఒకస్థలమున యాగము జరుగగా నేతిపాత్రము అరుంధతినక్షత్రమువలె నుండెను. అనగా కనుబడలేదు. అంతసూక్ష్మమైన పాత్రములో యింకను చిన్నదైన గరిట యుండెను. పడునట్టిధారను మనము చూచుటకు కాదు. వసిష్ఠ వామదేవాదులు చూడవలయును. యోగసిద్ధులైన బ్రహ్మాదులు చూడవలసియుండెను. శ్వేతకి యటుల గాక పండ్రెండేండ్లు అహోరాత్రములు అవిచ్ఛిన్నధారగ నేయిపోయుగా అగ్నికి జీర్ణశక్తి తగ్గిపోయెను అగ్నిదేవుడు బ్రహ్మదేవుని యొద్దకేగి నాకు ఆకలి యడగెను. అందరును భోజనమునకు యేడ్చుచుందురు. పదిసంవత్సరములు భోజనము లేకుండిన బాగుగ నుండు ననెను. నీకు మందులేదు. ఖాండవవనములో అనేక మూలికలు జంతువులు ఉన్నవి. దాని దహించిన మాంద్యము పోవునని బ్రహ్మచెప్పెను. అగ్నిదేవుడు మహాప్రయత్నముతో ఖాండవవనములోపలికి పోయి దహించగా అచటిప్రాణులు జలముపోయుచుండిరి. బ్రహ్మతో చెప్పగా జలముపోయకుండురా పొమ్ము అనెను. అగ్ని పోగ అచటిప్రాణులు ఆర్పిరి. అగ్నిదేవుడు యేడుపర్యాయములు తిరిగి బ్రహ్మదేవునియొద్దకేగి ఆయుర్వేద వైద్యుడు సామాన్యమూలికను చెప్పుమనయానా మహామేరుపర్వతములో

ధు భూలికను తెలుపవలయునా. ఈకార్యము నావలనకాదు. ఇటులచెప్పుచున్నావే మేరేదిదైన చెప్పుము. అనగా యీసారి మాత్రము పొమ్మని బ్రహ్మచెప్పెను. మరల కేయివ అర్భుదురని అగ్నియనగా నరనారాయణులు కృష్ణార్జునులుగ అవతరించియున్నారు ఎనిమిదవసారి కార్యమగును వేచియుండుమని బ్రహ్మచెప్పిపంపెను. అగ్ని వనములోపల ప్రవేశింపగా కిరీటి ఒకవిధముగ నుండెను. ఏలయని అగ్నిదేవుడడుగగా నమ్ముపు అంబులపొదయు లేదని కిరీటి అనెను. నేనిచ్చెదనని అగ్ని యిచ్చెను. స్మరింపగా కపివచ్చెను. కిరీటి కపిధ్వజుడుకదా. కపి యొకసారి ఝుంకారము చేసిన ముప్పాతికజనులు చచ్చెదరు. కిరీటి స్వయముగనే సమర్థుడు. వానితోడ అగ్నిదేవుడిచ్చిన రథము బాణము చేరగా విశేషమాయెను. కిరీటి పరమానందభరితుడై వాని గైకొనెను. ఆరథమునకు నాలుగు పొట్టిగుఱ్ఱము లుండెను.ఇవేమి పోవునని యెంచగా వాయువేగమును మనోవేగమును అవి జయించెను. రామబాణవేగమునకు మీద పోయెను. వైనతేయుని జయించెను. వాయువేగ, మనోవేగ, రామబాణవేగ వైనతేయవేగములను జయించెను. నాల్గుకీర్తులే ఆనాలుగు తెల్లగుఱ్ఱములు. గరుడధ్వజ హనుమధ్వజులగు కృష్ణార్జునులు అగ్నిభగవాను డిచ్చిన రథమున గూర్చుండిరి. సముద్రములో బడబాగ్ని జలమును త్రాగునటుల అగ్ని నిర్భయుడై దహింపనారంభించెను. లోపలిప్రాణులు వెలుపలికి వచ్చుటకులేక అల్లాడిరి. వెలుపలికి రాగా బాణములు లోపలికి త్రోయుచుండెను. ఈప్రక్క ఆప్రక్క ఒక్కొకరు నిలిచియుండిరి, ఇటుల త్రోయుచుండగా మనస్నేహితుడు తక్షకుడున్నాడు అగ్నినార్పి వాని కాపాడవలయును అని తలచి ఇంద్రుడు ఐరావతముపై నెక్కి సకల పరివారములతో వజ్రాయుధమును రోను గుతలపైనుంచుకొని వచ్చెను. నముచియను అసురుని సంహరించినవాడు వచ్చి మేఘములను పిలిచి వానకురిపించు డనెను. కృష్ణా యుద్ధమునకు వచ్చిన పోరనగును వర్షము కురిపించుచున్నాడే యని కిరీటి అనగా బాణములతో పందిరివేయుమని స్వామి చెప్పెను. కిరీటి గాండీవముతో పంద్రెండుయోజనములవరకు బాణపందిరి వేసెను. ఇంద్రుడు రమేతక్షకునికై వచ్చెనో ఆతక్షకుడు అచటలేడు కురుక్షేత్రమునకు పోయియుండెను. ఆతక్షకుని భార్యయు అశ్వసేనుడను కుమారుడును ఉండిరి. ఇంద్రుడు వారిని కాపాడ తలచెను. అశ్వసేనుడు వెలుపలికి రావలయునని చూడగా వీరు విడువలేదు. ఏమిరా రాకున్నావని ఇంద్రుడనగా వానకురిసినకదా అగ్ని ఆరునని. మేఘములకు వృథగా శ్రమ యిచ్చితినని ఇంద్రుడనుకొనెను. తక్షకునిభార్య పుత్రుని మ్రింగి దాటవలయునని తలచెను దాటు[illegible]యుమున కిరీటి దానియొక్క కంఠము త్రెగవేసెను. అకంఠముతోడ వాని తోకయును పోయెను. వాడు దాని కడుపులో నుండెనుగాన బ్రతికెను. అది ఆప్రక్కపడగా ఇంద్రుడు చూచెను. ఇక ప్రయోజనములేదు. అగ్నిమ్రింగును వారిని కాపాడవలయునని యుండగా యెచ్చటనో చూచి చంపెను అని ఇంద్రునికి కోపము

వచ్చి, ఓరీ యిటులచేసితివా యుద్ధమునకు రారాయని పిలచెను. ఇరువురికిని యుద్ధము జరిగెను. కిరీటి ఒక్కొకసమయమునను స్వామిని చూచి అనుమతి పొంది బాణములు వేసెను. దేవసైన్యములమీఁద బాణములు వేయుగా వారు సహింపలేక ప్రాణములుంటే చాలునని పోయిరి. ఇంద్రా నిన్ను సృష్టించిన భగవంతుడు నిలుచుచున్నాడే వరుసగాత్తి పోరాదా. భూభారహరణార్థము నరనారాయణులు అవతరించిరి. వీరిని జయింపనగునా. విశ్వామిత్రుడు అనేకపర్యాయములు చూచి రామలక్ష్మణులను పిలుచుకొనివచ్చి యాగము చేసినటుల యీఅగ్ని యేడుపర్యాయములు చూచి స్వామిని కిరీటిని అడిగి యీకార్యము చేయగా మూఢా నివలన అగునా, అని అశరీరవాణి పలుకగా, దేవరాజు పరుగెత్తిపోయెను. పెండ్లికాగనే పందిరి విప్పునటుల కిరీటి భగవదాజ్ఞచేత బాణములువేయుట నిలిపెను. పండ్రెండుయోజనముల వరకు పొగలేచెను. వనలక్ష్మి ఆకాశమునకు యెగిరిపోగా ఆమెతలవెంట్రుకలు వ్రేలాడుచుండెనో అని పొగనుగూర్చి కవియనెను. నముచితమ్ముడు మయుడు వసుదేవుడుండు చోటికిపోగా స్వామి వాని కొట్టెను. అర్జునా కాపాడుమని వాడనగా తన్ను దలచుచున్నాడని కృష్ణా శరణాగతుడు కాపాడుము. నాతో చేరినవాడని కిరీటి అనెను. కిరీటి చెప్పెనని స్వామి వాని విడిచెను. మయుడు కిరీటిచేత కాపాడబడెను. ఇరువురు తప్పిరి. నన్నెటులో అటుల నాభక్తుని శరణుపొందిన కాపాడుదునని స్వామి తెలిపిరి. అగ్నిహోత్రుడు మరియును, నలుగురిని కాల్చలేదు. మందపాలుడు తపముగాపించి యేయేలోకములకు పోవగునో అచ్చటికంతయును పోయెను. ఒకలోకమునకుమాత్రము అతిని రానీయకుండిరి. ఎందుకనగా అతనికి సంతతిలేదు. భూలోకమునకు పోయి పెండ్లాడి సంతతిబడసి రమ్మనిరి. మనుష్యుడైన చాలకాలము పట్టునని ఆయన పక్షియాయెను, అతనికి జరిత లపిత యను యిరువురు భార్యలు, జరితయెడ జితారి, మిత్ర స్తంభ ద్రోణులను నలుగురు పుట్టిరి. పెద్దదానిని విడిచి చిన్నదగు లపితతోడ విహరించుచుండెను. ఖాండవవన దహనసమయమున జరిత బిడ్డలతోడనుండి అల్లాడుచుండెను. అపుడు ఋషికి సంగతి తెలిసి అగ్నిని స్తుతించి అగ్నీ వనమును దహింపుదమని తలచితివి వలదనరాదు నాకొరకై నాపుత్రులను విడువవలయునని ప్రార్థించెను. అగ్ని వారిని విడిచిపెట్టెను, తోడనే ఇంద్రుడువచ్చి యేమికావలయునని అడుగగా నీయొద్దనుండు అస్త్రముల నన్నిటిని యిమ్మని కిరీటి అడిగెను. నేను అవసరపడి యీయరాదు, పరమశివునిగూర్చి తపమాచరింపుము, శివుడు పాశుపతాస్త్రమును యిచ్చిన నేనును అపుడు యిచ్చెదను అని ఇంద్రుడు కృష్ణార్జునులను స్తుతించి వారిచేత నుపచరించబడి పోయెను. అగ్నిదేవుడు యిరు[illegible]యొక దినములు వనమును దహించి సంతోషముతో నవ్వుచు పొట్టను చరుచుకొనుచు వీరితో చెప్పివరము తృప్తితో పోయెను. నలుగురు పక్షులు అశ్వసేనుడు తప్పి పోయిరి. మయుడు [illegible]ను. కృష్ణార్జునమయులు యమునానది గట్టున ఆనందభరితులై కూర్చుండి యుండిరి.

పోయినప్పుడది బూడిదయైపోయెను, తప్పించుకొనుటకు శక్యము కాలేదు అగ్నియొక్క తాపముచేత వర్షము కురిసినను గాని శమింపజేయలేదు, కిరీటి వాసుదేవునితోడ జలమును త్రావి వచ్చి ధర్మపుత్రునికి నమస్కరించి జరిగినసంగతి చెప్పెను. నాకు సహాయము చేసితిరి, మీకేమి కావలయునని మయుడు అడుగగా, నేను అవాప్తసమస్తకాముడను వైకుంఠాధిపతిని లక్ష్మీపతిని నేను చంపుటకు యత్నించితిని. వాడు నిన్ను కాపాడె ను. పాండవులకు ఇంద్రప్రస్థమను ఊరు ఉన్నది, దివ్యభవనము కావలయును అని వాసుదేవుడు చెప్పెను, మయుడు అందుకు సమ్మతించి పోయెను,

ఆదిపర్వము ముగిసినది.

---

## (24) సభాపర్వము ప్రారంభము—మయసభ.

---

ఒకరు చేసిన ఉపకారమును మరువరాదు. చేసిన ఉపకారమును మరచినవాడు కృతఘ్నుడు. పంచమహాపాతకులకు ప్రాయశ్చిత్తము ఉన్నది. కృతఘ్నునికి ప్రాయశ్చిత్తము లేదు. అట్లు లగుటచేత మీకు ప్రత్యుపకారమును చేసి పోయెదనని మయుడు డనెను. నేను అవాప్తసమస్తకాముడను. వైకుంఠాధిపతిని. అటులయుండగాక నేను నిన్ను చంపుటకు యత్నించితిని. అర్జునుడు కాపాడెను. దేవశిల్పియగు విశ్వకర్మచేత ఇంద్రప్రస్థమును యేర్పరచితిని. నీవు ఒక సభను యేర్పరుపుము. వారికి చేసిన నాకు చేసినటులె యగును అని కృష్ణుడనెను. భగవద్గీత 4 అధ్యా 8 శ్లోకమటుల అవతరించినవాడు కృష్ణమూర్తి. ఆయన పాండవుల వంటి సత్పురుషులకు గతిగ నున్నాడు. అసత్తులకు నాశకుడు. అసురశిల్పి మిగుల సాధువు. స్వామి చెప్పగనే చేసెదననెను. కొంచెము నీకౌశలమును చూపవలయును. లోకవిలక్షణములు అచట నుండవలయును. మనుష్యలోకమునందు చమత్కారములును మహాయసురుల యిండ్లలోనుండునట్టి వాసములును దేవలోక విశేషములును ఉండవలయును అని కృష్ణుడనగా అటులే భాగ్యము అని మయుడు ఆపట్టణమునకు తగు గృహములను పరమాద్భుతముగ యేర్పరచి యిచ్చెను. భగవానుడు పరివారముతోడ ప్రయాణముకాగా పాండవులు భక్తులగుటచేత స్వామితోడ బయలుదేరిరి. ఊరిలో నుండకపోవనియు జనులను కాపాడుటలేదని నామీద అపవాదము వచ్చియున్నది. అన్న ట్లును. పోవలయునని కృష్ణుడనెను. వారు పరస్పరము రెండుబాహువులచే దుఃఖించిరి. స్వామి వారికి మిగుల సమాధానము చెప్పి పాండవగా కృష్ణా రెండుమూడు పోవుదుమని చెప్పుచుండెను. మరల మాటలాడుచుందురు. స్వామి మిగుల శ్రమపడి అతన్ని అనుసరించి తప్పు పాండవులను కుంతి రథములో కూర్చుండి ద్వారకకు పోయెను. దేవేంద్రుడు జాగ్రత్తమైతోయి సురల పరివారములోడ అమరావతికి వచ్చిన పెంతయుండగా అంత

అంతఃపురమున నుండెను. అరెయ్యా కృష్ణుడు పోయెనె సెలవులు యిచట నుండగలము అని ధర్మపుత్రుడు మిగుల చింతించి తమ్ములతోడ పరివారమును పిలుచుకొని ఇంద్రప్రస్థమునకు వచ్చెను. మయుడు ఇంద్రప్రస్థముననే ఉండెను. సాధారణముగ యిల్లు కట్టించిన కొనినవారు కట్టియు కాకమునుపే గృహప్రవేశము చేయుదురు. పిమ్మట శేషించియుండు కార్యములు చేయింతురు. అటుల మయుడు ఒకవిధముగ సభను నిర్మించియుండెను ఇంకను విచిత్రపుపనులు చేయవలసి యుండుటచేత అతడు పోక ఉండెను. ఒక పని చేయవలసియున్నదని మయుడనగా చేయుమని పాండవు లనిరి. అందుకు కావలసిన వస్తువులు యిచట లేవు. వృషపర్వరాజుయొక్క సభ నిర్మాణమునకై తెచ్చిన వస్తువులలో కొన్ని మిగిలి యున్నవి. తెచ్చెదను. కైలాసమునకు ఉత్తరముగను మైనాకమునకు సమీపమునను నుండు హిరణ్యశృంగమున బిందుసరస్సు ఉన్నది. అచట గంగను తెచ్చుటకై భగీరథుడు తపమాచరించెను. అచట నేనావస్తువులను పాతిపెట్టి వచ్చితినని మయుడనగా ఇంకను ఉండునాయని పాండవు లనిరి. భద్రముచేసి వచ్చితిని. ఉండిన తెచ్చెదను అని మయుడనెను. ప్రీతియుండినయెడల అడుగనిదే సహాయమొనర్తురు. అర్జునుడు ప్రాణదానము చేసెననియు భగవదాజ్ఞయనియు మయుడు మరియొక సంగతి చెప్పెద ననెను.

యౌవనాశ్వమహారాజు మహాపరాక్రమశాలి. గదచేత అనేక శత్రులను చంపి లోకోద్ధారణము చేసెను. పోవునపుడు దీని ధరించువాడు లేడు. దీనికి తగు ఘనుడు యేర్పడనిమ్మని భూమిలో దాని పాతపెట్టి పోయెను. ఆగదను తెచ్చెదను. భీమునికి ఉపయోగముగ ఉండును అని మయుడనెను. అన్నకు గద లభించును. నీనియొద్ద విశేషము లున్నవి యని తలచి నాకేమియు లేదా యని అర్జును డనెను. నీవు సుకుమారముగ నుండువాడవు. నీకొక శంఖమును తెచ్చెదనని మయుడు పోయెను. లోకోత్తరమైన గదను భీమసేనునికి తెచ్చియిచ్చెను. దేవతలందరును చేరి యేర్పరచిన శంఖమును అర్జునుని కిచ్చెను. అర్జునునికి దేవతలచేత నీయబడినదికదా దేవదత్తము. ఈశంఖమేమి అనగా దేవతలు దీనిని తీసికొని తేజస్సును యెక్కించి యిచ్చిరి. ఆకథ ముందు వచ్చును. సభ నిర్మించి యాయెను. ఇంకను పనిచేసెదనని మయుడు ఆమహాసభలో నొక సరస్సు నేర్పరచెను. వైడూర్యముతో తామరపుష్పము, రత్నములతో తామరతూడును, పచ్చలతో తామర ఆకును చేసెను. దానియొక్క ప్రకాశము జలమువలె నుండెను. పాండవు లీవిచిత్రమును చూచుటకు రాజులకు జాబులు పంపిరి. రాజులు చూడవచ్చెదరు. పడపోదురు. జలము ఉండుచోట లేనటులను లేనిచోట ఉండునటులను, ద్వారములు ఉండుచోట లేనటులను లేనిచోట ఉండునటులను యెంత గమనించినను నిజము తెలియకుండునటుల మయుడు చేసెను. ధర్మరాజు ఒక శుభముహూర్తమున గృహప్రవేశము చేసెను. ఒకగృహములో ప్రవేశింపవలయునని ఆగృహమునకు అచ్చటచట దేవత

తుండురుగాన అన్న శాంతి బాగుగ చేయవలయును. ధర్మరాజు పదివేల బ్రాహ్మణులకు దక్షిణలతోడ మృష్టాన్నము పెట్టెను. గృహప్రవేశమహోత్సవమునకు రాజులు బ్రాహ్మణులు ఋషులు వచ్చియుండిరి. భీమార్జున నకుల సహదేవులు చేతులుకట్టుకొని నోరుమూసికొని నిలుచుచుండగా ధర్మరాజు సింహాసన మారోహించియుండగా మహర్షులు వేదపారాయణము చేయుచు ఆశీర్వదించిరి. మహారాజులు వస్త్రాభరణములు దెచ్చిరి. గంధర్వస్త్రీలును అప్సరసలును పాడిరి. ఇదియేమి. గంధర్వస్త్రీలు పాటలు. ఇంతవిభవము జరుగగా జనులు మనలను మరతురు అని దుర్యోధనుడు తలచెను. భగవంతుడు ప్రేరేపించగా నారదుడు వీణనెత్తుకొని వచ్చెను. ఒక్కొక్క విషయమును చూచునపుడు కృష్ణుని అనుగ్రహమని తలపవలదా, ఒకరినొకరు చూచుకొనుచున్నారే. మీరు పుట్టినదేమి ఏకచక్రనగరమున భిక్షమెత్తినదేమి ఈసంపద ఇంద్రాదులకు లేదే అని తలపరాదా అనుచు వచ్చెను. భగవద్గీత 5 అధ్యా 8, 9, శ్లోకములవలె బుద్ధిమంతుడు నేను నాది యని తలపరాదు. తన సామర్థ్యముచేత లభించెనని తలపరాదు. నిదుర లేచినదిమొదలు నిద్రించువరకు జరుగుచుండు పదుమూడు కార్యములకు భగవంతుని దలపవలయును. అన్నియును స్వామివలన నని తలపవలయును. ఈసంగతిని చెప్పిన బాగుగ నుండదని నారదుడు యీయర్థమును తెలుపు నటుల పాడుచు వచ్చెను. నారదునికి తగు ఆసనము నిచ్చిరి. నారదునికి తగు ఆసనమేది రత్నములదా. కాదు. కృష్ణాజినము పరచినది. ఆసభలో శాస్త్రజ్ఞులు పౌరాణికులు ఉండిరి. నారదుడు రాగా మీరు వచ్చితిరే యిపుడే సభనిండెను అని పాండవు లనిరి. నారదమునికి ఆసభను చూచి బాగుగ నున్నదని చెప్పి కూర్చుండెను. తాము బ్రహ్మలోకము మొదలు పాతాళలోకమువరకు తిరుగుచుందురుకదా ఎందైన నిట్టిసభ యున్నదా యని పాండవు లనగా మనుష్యలోకములో నిట్టిసభను చూడలేదు. ఉన్నదనియు వినలేదు. ఇట్టి నవరత్నఖచిత సభను చూడలేదు అని నారదుడు చెప్పెను. మనుష్యలోక సభ యంటిరే అన్ని సభలను చూచితిరా యనిపాండవులనగా దేవలోకమునకు తగునటుల అచ్చట నుండును. ఇది మనుష్యలోకమునకు హెచ్చు అని నారదుడు చెప్పెను. ఆసభ లెటులున్నవని పాండవు లడుగగా, నారదుడు ఇంద్ర వరుణ కుబేర యమ బ్రహ్మ సభల చూచితిని. చెప్పెదనని బ్రహ్మసభను చెప్పుచు ఆబ్రహ్మసభ యిట్టిదని వర్ణించుటకు కాదు. సాధ్యమైనంతవరకు చెప్పితిని. దేవలోకములో యిట్టి సభలు చూచితిని. మనుష్యలోకమున నిట్టిసభ యుండదు. ధర్మపుత్రా అంతయు భగవంతుని అనుగ్రహమురా అనెను. ధర్మరాజు ఔ నౌ ననుచుండెను. నారదా ఇంద్ర యమ వరుణ కుబేరసభలను వర్ణించి దేవేంద్రసభలో హరిశ్చంద్రుడు ఉన్నాడంటిరి. యమసభను చెప్పునపుడు మాతండ్రి అచటనున్నాడంటిరి. మాతండ్రిని చూచితిరా. మాటలాడితిరా యేమిచెప్పెను ఏల యమసభలో నున్నాడు చెప్పుడు అని నిండినసభలో ధర్మరాజు

అడిగెను. యమలోకమునకు పోయి నీతండ్రిని చూచి ఏల యిచ్చట నున్నా రనగా మిగుల దుఃఖించి నారదా భూలోకమునకు పోయెదరా, పోయినయెడల పాండవులను చూతురా యని పాండురా జనెను. భూలోకమునకు పోయిన పాండవులను చూడక పోను అనిచెప్పితిని. రాజసూయయాగము నేను చేయలేదుగాన నావంటిరాజువలె నేను ఇంద్రలోకమునకు పోలేదు. ఆత్మావై పుత్రనామాసి యనియున్నదిగాన నాపుత్రులను చేయుమనుము. నాకు ఇంద్రలోకము లభించును అని చెప్పెను. అటులే చెప్పెద నంటిని. మీతండ్రి అచటనున్నాడు. రాజసూయయాగము చేసిన ఇంద్రలోకమునకు పోవును. మీయిష్టము అని నారదు డనెను. అటులే చేసెదమని పాండవులు నొక్కి చెప్పగా, మీవలన నగునాయని నారదుడనెను. వాసుదేవుని రప్పింతుమని పాండవు లనిరి. రాజసూయయాగము చేసెదనంటిరే వాసువేవుని రప్పించి చేయుడనిచెప్పి నారదుడు తనతోవచ్చిన ఋషులను పిలుచుకొని పోయెను. కృష్ణు డుండగా భయమేమి భగవచ్చరణారవింద ధ్యానము చేసిన చింతయేమి. భూమిలోనుండు సకలరాజులతో యుద్ధముచేసి జయించి యాగము చేయవలసియుండెను. కావున పాండవులు యోచించిరి. ఇది గొప్పకార్యముగ నున్నది కృష్ణు డున్నాడని నారదుడు చెప్పిపోయెను. అని వారు కృష్ణుని మనసా స్మరించిరి. కృష్ణా పనియున్నదని చెప్పరాదు. రావలయును ఇట్టికార్యమా అనరాదు, యోచించి కార్యము చేయవలయును. మమ్ముబ్రోచుట కెవరున్నారు. మేనత్త మేనమామబిడ్డలమని తలచి జాబువ్రాయుదుము. నిన్ను వేదములు ఉపనిషత్తులు స్తుతించుచున్నవి. మేముస్తుతించుట బాగుగ నుండదు. అటుల స్తుతింపనారంభించినను మావలన నగునా. జననమరణములు లేనివాడవుభగవద్గీత 4 అధ్యా 6 శ్లోవలె లీలార్థము తోచి అవతరించినాడవు లీలామానుష విగ్రహుడవు అని స్తుతించి ఇంద్రసేనుడను దూతను బంపిరి. కృష్ణా రాజసూయయాగము చేయవలయును. నీవు ముందుగ రావలయును అని వ్రాసిరి. గురువునుకదా ముందుగ పిలుతురు. వారువారు యిండ్లకు గురువులుగ నుందురు. ఈయన పదునాలుగు లోకములకును గురువుగ నున్నాడు. కావున స్వామిని పిలుచుటకు దూతను బంపగా కృష్ణమూర్తి వానితోడనే బయలు దేరెను. ఆసమయ మెటు లుండెననగా, జరాసంధుడు నూర్గురు రాజులను బట్టి పరమశివునిగూర్చి యజ్ఞముచేయ దలచి యెనుబదియార్గురు రాజులను పట్టుకొనెను. ఆరాజులు వాసుదేవుని యొద్దకు ఒక దూతను బంపిరి. స్వామి ఆదూతను యేకాంతముగ బిలిచి సంగతి నడిగెను. ఆదూత యేడ్చి ఇదివరలో యెనుబదియారు రాజులను పట్టినాడు. ఇక పదునాలుగు రాజులు దొరకిన చంపును. వారు చెప్పిపంపిరనెను. ఏమిచెప్పిరని వాసుదేవుడు యడిగెను. లోకములో పుణ్యాము కాపాడునని కదా యందురు. పుణ్యాము సాక్షాత్తుగవచ్చి కాపాడునా. కాపాడదు. పాపము ఒక మనుష్యరూపముగ వచ్చి బాధించును, నీచరణారవిందమును స్మరించువారికి ఒక దుఃఖము ఉండదు నిన్ను అనన్యభావముతో

నమ్మియున్నాము. జరాసంధుడు పదివేల యేనుగుల బలము గలిగియున్నాడు. సింహము తాను దలచినపుడు తినుటకై అనేక మృగములను తెచ్చి గుహలో చేర్చునట్లుల మమ్ము పట్టి చెరసేంచియున్నాడు. దుష్టనిగ్రహము శిష్టపరిపాలనము చేయుటకు అవతరించియున్నావు కాపాడుమని నాద్వారా శరణుపొందిరి. కాపాడవలయును నని దూత అనెను. శిశుపాలుని సంహరింపవలయునని నారదుడు త్వరపరచెను. యాగమునకు పోవలయునా శిశుపాల జరాసంధులను చంపవలయునా అని కృష్ణుడు బలరామునితోను యుద్ధవునితోను యోచించెను. యాగము కుండనిమ్ము. సంహారము కావలయునని బలరాముడనెను. యాగమునకు పోయిన శిశుపాలుడును వచ్చును. శిష్టపరిపాలనకు పోయినయెడల యాగమును అగును. భోజనమును లభించును. శిశుపాలుడు ఓర్వక దూషించును. సంహారమగును. రాజసూయమునకై జరాసంధుని జయింతురు. అని కృష్ణమూర్తి యనగా సరియని పోయిరి ధర్మరాజు కృష్ణుని చూచి సంగతి చెప్పెను. స్వామి సరియని ఒక జరాసంధుని సంహరించిన తక్కినవారందరును చంపబడినటులే యనెను. జరాసంధుడు సకలరాజులను తన స్వాధీనమున నుంచుకొని వారి శిరములందు కాలునుంచెను. సకలరాజులను జయించి బంధించి చెరలో నుంచెను. యెనుబదియెన్గురు రాజులను పట్టెను. వాడు తమ్ము సహా పట్టుకొనునని ధర్మరాజుకు భయము. అందుచేత కృష్ణమూర్తిని జూచి కృష్ణా ఇక పదునల్గురు తక్కువగ నున్నారు. రాజసూయయాగము జరుగవలయును. వాడు పదివేలయేనుగుల బలము గలిగియున్నాడు. మేము పోయిన మారేపురిని పట్టుకొనును. ఎటుల ఏమిచేయవలయును అనెను. బావా దానికి తగు యత్నము చేయుము. వాని ముందుగ జయింపవలయును రాజులను విడిపించవలయును. లేకున్న నోరుమూసికొని యుండుము. బావా భయము లేదు. భీమార్జుననకులసహదేవులను నలుగురిని నాలుగుదిక్కులకు బంపుము. దిగ్విజయముతో వత్తురు అని కృష్ణుడనెను. బావా నన్ను బెదరించుటకై అటు లనుచున్నావు. మార్గము లేకున్న నీవు వత్తువా. రాజసూయయాగము చేయుమందువా. అది యేమి. వాడు పదునేడుసారులు వచ్చినను విడిచిపెట్టితివి. నిప్పులోపడ్డ బూచి పోవునా. దుష్టులనువారికి అగ్నివలెనుండు నీవు వాని నేల విడచితివి అని ధర్మపుత్రు డడిగెను.

## (25) జరాసంధవధము—పాండవుల దిగ్విజయము.

జరాసంధు డెవడు. నీవును వానిగూర్చి యోచించుచున్నావు. సంగతి చెప్పుమని ధర్మపుత్రు డడుగగా, జరాసంధుడు మగధ దేశాధిపతి. వా డుండునది గిరివ్రజ మను పట్టణము. బృహద్రథుని కొడుకు వాని జయించుటకు వలను కాదు అని వాసుదేవుడు చెప్పెను. అంతమాత్రము చెప్పగా ధర్మరాజుకు తృప్తికలుగలేదు. రాజసూయయాగము

చేసినయెడల పాండురాజు ఇంద్రలోకమునకు పోవునని నారదుడు చెప్పెను. జరాసంధ వధ మెంతయు మంచిదని చెప్పి పిమ్మట కొంచెము యోచనగా చెప్పుచున్నాడు. అట్టి జరాసంధు డెవడు అని తలచి ధర్మరాజు స్వామిని జూచి కృష్ణా యిటుల సంగ్రహముగ చెప్పిన చాలదు. విశదముగ చెప్పుమనెను. బృహద్రథుడు మహాపరాక్రమశాలి. వానికి సంతతి లేకపోయెను. ఏమిచేయుదునని యోచించి యెవరైనను పెద్దల నాశ్రయించి సంతతి పొందుదమని తోచగా యెవరి నాశ్రయింపవలెనోయని, చండకౌశికుడు మహానుభావుడు వారి నాశ్రయించిన కలుగునని విని భవ్యమైన తపము గావించుచుండగా పోయి నమస్కరించెను. మహారాజా యేమి కావలెనని చండకౌశికు డడుగగా తమయొక్క అనుగ్రహము. ఒక్కటియును తక్కువ లేదు. సంతతి కావలయు ననెను. నిగ్రహానుగ్రహ శక్తిగల ఆయన బృహద్రథుని దగ్గరకు పిలిచి, మామిడిపండు పడియుండుటను జూచి యెత్తి మహారాజుకు సంతతి కలుగవల యునని మనసా తలచి అభిమంత్రించి యిచ్చెను. బృహద్రథునికి యిద్దరు భార్యలుండిరి. ఆఫలము అద్భుతమైనది. ఒక ఫలము లభించినదే హెచ్చు. రాజుకు యిద్దరు భార్యలుం డినను ముని ఒక ఫలమునే యిచ్చెను. ఇద్దరు భార్యలలో నొకతెకు ఆఫలము నిచ్చి యుండరాదా. ఒకతె కిచ్చిన మరియొకతెకు కోపము వచ్చునని రాజు యిద్దరికిని దాని చెరిసగముగ యిచ్చెను. చండకౌశికుడిచ్చిన అమోఘ ఫలమైనందున యిరువురును గర్భము దాల్చిరి. వారిరువురును ప్రసవించిరి. దీనికి అర్ధభాగము దానికి అర్ధభాగముగ శిశువు పుట్టెను. రెండుభాగములలోను ప్రాణముండెను. రెండును ఆడుచుండెను. ఇదేమి ఇటుల పుట్టెను. చండకౌశికుడు యిట్టిఫలము నిచ్చెను. అని ఆయనను దూషించిరి. తా మటుల తినియుండరాదని అనుకొనలేదు. ఆభాగములను కుప్పతొట్టిలో వేయుడనిరి. ఇరువురు రాణులును యిచ్చిరి. పరిచారికలు పారవేసిరి జరయను రాక్షసి రక్తమాం సములను భుజించునది. అది యెవరికిని కనుపడక వీధులలో సంచారము చేయుచుం డెను. ఆ రెండు ఖండములను జూచి చేర్పగా ఒకశరీరమాయెను. ఫలము ఒకటి. అను గ్రహము చేసినవారొకరు కావున ఒకశరీరముగ నుండెను. ఖండములకంటెను దీనికి మిగుల బలము కలిగెను. జరయను రాక్షసి చేర్చి తోచగా కుమారుడాయెను. జర యెత్తజాలక క్రిందవేసెను. దానికి ఆశ్చర్యము కలిగెను. ఇదేమి యిటులాయెను. వజ్రాయుధమువలె గట్టిదై యున్నది. ఎత్తుటకు కాలేదు అని ఆశ్చర్యపడి అటులే యెత్తుకొని రాజుయొద్దకు తెచ్చి రాజా కొంచెమైనను బుద్ధిలేదా. చండకౌశికుని యను గ్రహము వ్యర్థమగునా. ఇంతమాత్రము యోచించరాదా. చేర్చిచూడరాజా. నీకు తోచలేదు. పెద్దల అనుగ్రహము వ్యర్థమాయెనని చేర్చితిని మహాబలిష్ఠుడాయెను. చండ కౌశికు డిచ్చినది అటులెటనిమ్ము దేహము యిచ్చితిని అనెను. రాజు చూచి మిగుల ఆనంద మొందినీవే కరమెను. ఆదయాళులోనుండు యిరువురను ప్రజలను కాపాడుచుండెను

గ్రామదేవతను నా పేరు జర. నేను చేర్చితిని. మహాబల పరాక్రమశాలియై యుండు ను. అమ్మా నిజము నీవిచ్చిన పుత్రభిక్షము. నీకేమి కావలయునని రాజనగా నేను చేయవలసిన విధియగుటచేత చేసితిని. నాకేమి కావలదు అని జరయనెను. అటుల కాదు అడుగుమని రాజనగా వీడు మిగుల గొప్పవాడు కాబోవుచున్నాడు. వానికి నా పేరుండనిమ్మా అని జర చెప్పెను. జరయను రాక్షసిచేత సంధింపబడినవాడగుటచేత జరాసంధుడని వానికి పేరుపెట్టెను. జరాసంధుడు పెరిగి మహాబలపరాక్రమశాలియై విద్యాభ్యాసము చేసి సకలవిద్యలు నేర్చి పరమశాంభవుడై పరమశివుని నారాధించుచుం డెను. అటులుండ శౌర్య ధైర్యాదులను చూచి తండ్రి కొడుకుకు పట్టాభిషేకము చేసెను. వయోవృద్ధుడు బ్రహ్మజ్ఞానములో నుండెను. బావా జరాసంధుని సంగతి నడిగితివే యింతేను. పదివేల యేనుగుల బలముగలవాడు ఎనుబదియారు రాజులను పట్టితెచ్చెను. వాని నెటుల జయింపనగును అని కృష్ణుడనెను. కృష్ణా యీకథచెప్పుటకు వచ్చితివా. రాజసూయయాగమును చేయించుటకు వచ్చితివా అని ధర్మరా జనగా కృష్ణుడు నవ్వి, యిదిగో చేయుదమనరాగు. ఉండుసంగతి చెప్పవలదా. వచ్చినది కథచెప్పుటకా అనెను. అటులైన రాజసూయయాగము చేయించెదవా యని ధర్మరా జనగా మరెందుకు వచ్చితని. వాడు గొప్పవాడైనను వానికి ఒకకాలము వచ్చెను. అని కృష్ణుడనెను. కృష్ణా వానికొక కాలము వచ్చెనంటివి సంతోషమని ధర్మరాజనెను. బావా నీకెందుకు చింతయని కృష్ణమూర్తి భీమార్జునులను బయలుదేరుడని వారితోడ తానును బయలుదేరెను. భీమా అర్జునా నేనేమిచేయుదునో అటులేచేయుడు. అసమ యములో నవ్వకుడు. నేను చేయునది కొంచెము గౌరవమునకు తక్కువగా తోచును. నన్ననుసరింపుచు రండు అనిచెప్పి మగధదేశమునకు పోయి గిరివ్రజమను పట్టణములో ప్రవేశించిరి. ఆపట్టణమునకు ముందు మూడు భేరులుండెను. ఒకవృషభము అనేకులను చంపుచుండగా జరాసంధుడు దానిబట్టి చంపి దానిచర్మముతో మూడు భేరీలను చేసెను. అవి శత్రులు వచ్చిన శబ్దించును. వీరు ఆమూటిని చింపిరి. ప్రాకారములు దాటిరి భీమార్జునులారా నావలెనే కండని స్వామి బ్రాహ్మణుడు కాగా వారును అటులె బ్రహ్మచర్యవ్రతములోనుండు బ్రాహ్మణులైరి. కృష్ణా బ్రాహ్మణులనుగ చేసితివే ధనుసా బాణమా యని వారనగా ధను సందుకు బాహుబల ముండిన చాలదా యని కృష్ణమూర్తి యనెను. యుద్ధభిక్షమునకు పోయిరి. న్యాయముగ మంచి తలంపుతో పోవువారు ముందటి మార్గములో పోదురు. చెడుతలపుతో పోవువారు వేరుమార్గములో పోదురు. వీరు జరాసంధుని సంహరింప వచ్చిరిగాన శాస్త్రప్రకారము వేరు మార్గముగ లోపల పోయి చేరిరి. అచటి వస్తువులను భిన్నముచేసి వచ్చిరి. కృష్ణార్జునులు భీముడని యొవరికిని తెలియలేదు. భగవద్గీత 7 అధ్యా 14 శ్లోకమటుల భగవన్మాయచేత తెలియలేదు. మర్యాదచేసి అర్ఘ్యపాద్యాదులచేత సత్కరించిరి. భోజనము కావలయు

నిరి. కూర్చుండ పెట్టిరి. అర్ధరాత్రికాగా జరాసంధుడు విచారించుటకు వచ్చెను; జరాసంధునికిని కృష్ణునికిని యీసంభాషణ జరిగెను. జరాసంధుడు— మీ రెవరు. కృష్ణుడు— మేము సంచారము చేయుచుండువారము. జ— మీకేమి కావలయును. కృ— ఏమియు వలదు. జ— మాస్థలమునకువచ్చి యేమియు వలదనరాదు. ఏమైనను అడుగుడు. ఇచ్చెదను. కృ— దేనినడిగినను యిచ్చెదవా. యుద్ధభిక్షము కావలయును. ఏకవాక్యవ్రతము జ— మీ రెవరో నిజముగ చెప్పుడు. కృ— మేము మారురూపములతో వచ్చిన నీవిడు కాదనియో మంచిమాటలు చెప్పియో పరుగెత్తిపోదువని యిటుల వచ్చితిమి. భిక్షమిచ్చెదనంటివి. యుద్ధభిక్ష మీయుము. జ— ఎవరితో. కృ— నీతో. జ— మీ రెవరు. నిన్ను పదునేడుపర్యాయములు కట్టికొట్టిన కృష్ణుడను నేను. (జరాసంధుడు మృత్యువు ప్రవేశించెననుకొనెను.) వీరు పాండవులు. మేనత్త మేనమామ బిడ్డలము. కంససంహారము చేసితినని వచ్చిన నిన్ను కొట్టితినే అపూర్వశత్రువును నేను. మాటచెప్పితివి. యుద్ధము చేయవలయును. (జరాసంధుడు వెనుదీయువాడా మహాశూరుడు. అహాచేయుదము ఎపుడనెను.) కృ— ఇపుడు ప్రారంభించవలయును. జ— సరి. కృ— ముగ్గురితో చేసెదవా యిద్దరితోనా ఒక్కరితోనా. జ— కృష్ణా నేను నీతో యుద్ధము చేయను. నీవు గొల్లవాడవు. నేను క్షత్రియ వీరుడను. నీతో వలదు. కృ— (పీడవిడచెను.) అర్జునునితో చేసెదవా. జ— వాడు చిన్నవాడు. జరాసంధుడు యిటులని భీమునిచూచి భీమా వాడు గొల్లపిల్లవాడు. వీడు చిన్నబిడ్డ. నీవు నాకు జోడు రమ్మనెను. భీమా వాడు చంపిన నెటులని కృష్ణుడడుగగా కృష్ణా భీమసేనుడు జయించినాడనిన మిగుల సంతోషము. పెద్దకూరునితో పోరి మృతినొందినను మేలు. (గొప్పవిద్వాంసునితో వాదించి ఓడినను మేలు. వానికి ప్రతియని యెన్నబడునుకదా.) కృష్ణా వాడు జయించినను తక్కువకేదు. నేను జయించినను గొప్పకలుగుదు. అని భీముడనెను. ఏకార్యమునకైనను ఉత్సాహశక్తి మంత్రశక్తి ప్రభుశక్తి ఉండవలయును. భీమార్జునులు ఉత్సాహప్రభుశక్తులుగా నుండిరి. కృష్ణు డుండుట ఉత్సాహ ప్రభుశక్తులతోడ మంత్రము చేరినటు లాయెను. ఉత్సాహశక్తి భీముడుగను. ప్రభుశక్తి అర్జునుడుగను ఉండిరి. ఏలయనిన అర్జునునికి మంత్ర బాణములు అధికము. అర్జునుడు ఇంద్రునికొడుకు. భీముడు క్రిందివాని కొడుకు కదా. ఉత్సాహ మంత్రశక్తులుండినను యోచనకు ఉండవలదా. మంత్రమువలె స్వామి బయలుదేరెను. మగధదేశము నంతయును దాటి గిరివ్రజమునకు పోవలసియుండెను. వీరు అస్థలములను చూచుచు మాటలాడుచు పోయిరి. అచేతనములు రాజును అనుసరింపవు. ఇచట అటులగాక అనుసరించుచున్నవి. నదులవలన పైరుమొలచును మనుష్యులంత్రవ్వి పైర్లు మొలచును ఈరెండుపైర్లను రాజునకు తల్లులు ఎచ్చట చూచినను జలసమృద్ధియు సస్యసమృద్ధియు ఉండవలయును. దేశముల కీరెండును తల్లులు. జరాసంధునికి అన్నియును సరిగానుండెను. జరాసంధుడు జర (ముసలితనము) లేనివాడుగ నున్నాడు.

ప్రారంభమయ్యను చున్నాడు. కృష్ణార్జునులు చూచుచుండగా భీముడు జరాసంధునితో యుద్ధము చేసెను. బాహుయుద్ధము, ముష్టియుద్ధము మొదలగు అనేక యుద్ధములు చేసిరి. పదునైదు దినములాయెను. అహోరాత్రములు యుద్ధము చేసిరి. భీముడు గదాధర కృష్ణా యని ప్రార్థించెను. నన్ను చిన్నబోయెను. నిలువలేకున్నాను. భగవంతుడా సర్వలోక శరణ్యుడవు అతని తెగనివాడవెను. హిడింబుని, త్రైలోక్య కంటకుడగు బకుని చంపినట్టి భీముడు పదునైదు దినములుగ యుద్ధము చేయుచున్నాడు. ఏమియును తేలలేదు. రాజసూయయాగము వలదు. తండ్రి యమునభలో నుండుగాక. ఇప్పుడు తప్పించుకొని పోయిన బాగుగనుండును అని అర్జునుడు తలచెను. అధైర్యము చూపరాదని ఉత్సాహశక్తిని ప్రభుశక్తిని వదలరాదని మనమున స్వామిని తలచెను. కృష్ణా సర్వలోకశరణ్యుడవు నిలుచుచున్నావు. లోకవీరుడను నిలుచుచున్నాను మహాపరాక్రమశాలి భీముడు నిలుచుచున్నాడు. నీవు తోడనుండియు యిట్టుల జరుగవచ్చునా. వానికి చంద్రజాడను చూపుము. ప్రోత్సహముయ మిదేను కాంచను నీదానిరచిరివేని అన్న చేయి క్రిందిదగును. చేసైనను అన్న పెద్దన్నతైనను జరాసంధునిమాట రాజత్రుమా. నీవుచెప్పినందున నీవు కాపాడుదునవనికదా వచ్చితిమి. జర రాక్షసిచేత క్రింద వేసిన బిడ్డ పెద్దమనిషియాయెను. వానిజయింప నెటులగును. కృష్ణా నీవు ప్రోత్సహీయుడవు అడుగడుగునకును చెప్పవలయునా. నీవే తల్లి తండ్రి గురువు దైవము. అని యిటుల ప్రార్థించుచుండగా స్వామి ఏమియు మాటలాడనటుల ఒక కసవుపోచ చేత్తుకొని భీముని చూచెను. ఏమో స్వామిచూచుచున్నాడని భీముడు చూడగా కృష్ణమూర్తిదానిని రెండుగ చీల్చెను. ఓహో అర్జునుడు జాడచూపుమని ప్రార్థించెను. దానిని చూపుచున్నాడు. నీని నిటులచేయరాదు. చీల్చవలయును అని తలచి భీముడు జరాసంధునిదొద్దకు పోయెను. భీమునికి శక్తిలేదా. విధము తెలియకుండెను. స్వామి చూపగనే పోయి ఒకకాలును అదిమిపట్టుకొని మరియొకకాలిని పట్టి చీల్చెను. వానిదేహము రెండాయెను. భీముడు వానిదేహమును అన్నిచోటులలోను కొట్టినను వానికి నొప్పితగులలేదు. చండకౌశికుని తపోబలముచేత అటులుండెను. చేర్చబడినస్థలము జరది యగుటచేత బలములేదు. రెండాయెను. జరాసంధుని శరీరము రెండాయెనని సర్వలోకము వరకు వార్త పోయెను. దానితోడ భీముని సింహగర్జనము చేసెను. తోడనే పుష్పవృష్టి కురిపించిరి. భీమా సంహారమాయెనా అర్జునా భయపడితివా యనిస్వామి అడుగగా యింకసవును పొందనివాడే చీల్చియుండరాదా యని అర్జునుడనెను. అపుడు చీల్చిన శృతించియుందువాయని స్వామి అనెను. వారి అభిప్రాయము జరాసంధుని చంపవలయుననియేగాని అయ్యూరిని స్వాధీన పరచుకొనవలయునని కాదు. జరాసంధునికొడుకు సహదేవుడు. వాడును తండ్రివలె నిర్బ్రయుండిన సంహరింపదలంచును. అటులగాక వాడు శరణుపొందెను. భీమా వాడు శత్రువు పిరికి కృష్ణ

పోయి వారు స్వామి వారి సింహాసనమున కూర్చుండబెట్టి, భీమార్జునులతో కూడ స్వామికి నమస్కారము చేసెను.

సహదేవుడు భయపడగా అభయమును ఇచ్చిరి. శ్రీకృష్ణ మగధపురమునకు రాజుగా పట్టాభిషేకము చేసెను. కృష్ణమూర్తి భీమార్జునులను పిల్చుకొని ఇంద్రప్రస్థమునకు చేరి జరాసంధుని సంహరించి వానికొడుకును పట్టమునకు కట్టించితిమి అని రాజసూయయాగము చేయవచ్చును. నేనుండ పనిలేదు నలుగురిని నాలుగు దిక్కులకు పంపుము. కార్యము పెద్దదగుటచేత నేనును పోతిని అని కృష్ణుడు చెప్పగా ధర్మరాజు మిగుల సంతోషించెను. తండ్రీ నా సర్వస్వము నీవే అని ఆనందబాష్పములతో శ్రీరాముడు హనుమంతుని ఆలింగనము చేసికొనినటుల ధర్మరాజు స్వామిని ఆలింగనము చేసికొనెను. బావా నలుగురిని నాలుగుదిక్కులకు బంపుము. అంతవరకు ద్వారక యందు నేను అనేక కార్యములు ఉండును పోయివచ్చెదను. పిలిచినప్పుడు తోడనే వచ్చెదను, అని చెప్పి స్వామి మనోవేగతుల్యమైన రథములో పోయెను. భీమార్జున నకుల సహదేవులారా మీరు నాలుగు దిక్కులకు పోయి దిగ్విజయముచేసి రండి, స్వామి అటుల చెప్పిపోయెను. పొండని ధర్మరాజు చెప్పగా అర్జునుడు ఉత్తరమునకు పోయి జయించెను. భీముడు తూర్పుదిక్కునకు, సహదేవుడు దక్షిణమునకు. నకులుడు పడమటి దిక్కునకు పోయి జయించిరి. ధర్మరాజు ఇంద్రప్రస్థమున బంధువులతోను పరివారముతోను ఉండెను. నలుగురును నాలుగుదిక్కులకు పోయి జయించిరని వైశంపాయనుడు చెప్పగా ఆసంగతిని విస్తారముగ జెప్పుడని జనమేజయుడడిగెను. వైశంపాయను డిటుల నెను. అర్జునుడు ఉత్తరదిక్కునకుపోయి దిగ్విజయముచేసి వారివారిచే కప్పములు కట్టించుటకు పోయెను. అచ్చట చిన్న చిన్న ఊరులు ఎన్నోయుండెను. అచ్చట యెట్లునడచెనో అటుల భారతమున వ్రాసిరి. ఇచట అటుల చెప్పుట కగునా. గొప్ప సంగతులు చెప్పబడును. అర్జునుడు ప్రాగ్జ్యోతిషమను పట్టణము చేరెను. అచ్చట నరకాసురుని కొడుకగు భగదత్తుడను రాజు ఉండెను. వాడు మహాబలిష్ఠుడు. మీగ దిగ్విజయమునకై పోయిరే వాని చంపుటకు పోలేను. కావున పోయి భగదత్తునితో యుద్ధముచేసి ఓడించెను. అర్జునుడు వాడిచ్చిన ధనమును గైకొనెను. మరల బయలుదేరి యెల్లవారని జయించి వారిచ్చిన సొత్తునంతయు గైకొని ఇంద్రప్రస్థము చేరెను. ఇంతశ్రమపడి ధనము తెచ్చినే నాకు అనెనా. ధర్మపుత్రుని పాదములకు నమస్కరించి సమర్పించెను. ఆచరించి చూపెను. నరకాసురుని చంపుటకు స్వామిని సాక్షాత్తుగ పోయెను. వాని పుత్రుని జోలింప అర్జునుడు పోయెను. భీముడు ధర్మరాజుయొక్క ఉత్తరువును పొంది తూర్పు దిక్కునకు పోయి అనేకులను జయించి శిశుపాలుని ఊరికి పోయెను. శిశుపాలుడు సమీప బంధువు. వాడు కృష్ణమూర్తికి పాండవుల వలెనే అత్తకుమారుడు. కావున భీమునికి తమ్ముడగుచున్నాడు. శిశుపాలా కప్పము కట్టెదవా యుద్ధమునకు వచ్చెదవా

యని భీము డడిగెను. అప్పుడు వారికి విరోధము లేదు. సరి న్యాయము ననుసరించి అడుగుచున్నాడని నేనుండిరేకదా రాజసూయయాగము జరుగవలయునని శిశుపాలుడు వారిని పిలిచి అన్నతమ్ములని మర్యాదచేసి విశేష ధనము నిచ్చెను. మరల జరాసంధుని కొడుకగు సహదేవుని యొద్దకు పోగా వాడు మరియు అనేకముగ నిచ్చెను. కర్ణుని యూరికి పోయెను. రాజసూయయాగమునకు సహాయమొనర్చెదవా యని జాబుపంపగా అతడిచ్చెను. భీము డాధనమునంతయు నటులే ధర్మపుత్రుని పాదములలో సమర్పించెను. సహదేవుడు రథ గజ తురగ పదాతులతోడ దక్షిణదిక్కునకు పోయెను. అచట అనేక కార్యములు చేసెను. కిష్కింధకు పోయెను. అచట సుగ్రీవుడుండెను. జాబుబంపిరి. రత్నాభరణాదుల విశేషముగనిచ్చెను. మాహిష్మతికి పోయెను. ఆయూరికి నీలుడు అధిపతిగ నుండెను. సహదేవునికి అచ్చట కష్టముగ నుండగా అగ్నిభగవానుడు సహాయము చేసెను. అదిరేమి అగ్నిభగవానుడు సహాయముచేయుటేమని జనమేజయుడడుగగా వైశంపాయను డిటులనెను. నీలునికొక కూతురు. అది మిగులఅందకత్తె. నీలుడు అగ్ని చల్లారకుండుటకై ఔపాసన గృహమున తనకూతురిని ఉంచియుండెను. అగ్ని తన నిజరూపములో వచ్చి ఉపచరించుచుండు దాని చేయిపట్టి యీడ్చెను. అగ్ని దేవతయని ఉపచరించగా నిటుల చేయనగునా. మీరు పెద్దలని స్థలముసేయ నిటుల చేయనగునా అని నీలుని కూతు రనెను. లేదే వేడుకకు అటుల చేసితినని అగ్ని అనగా వేడుకచేయుటకు నేనేమి అత్తకూతురినా మామకూతురినా. నావంటి స్త్రీలు నన్ను వదింతురా. ఉపచరించగా మిగుల బాగాయెను అనెను. ఇది సమ్మతించనందున అగ్ని పోయెను. ఆమె అగ్నిగృహమునకు పోవనగా తండ్రి కారణము నడిగెను. అగ్ని వ్యభిచారియని కూతురనెను. నీలుడపుడు యిటులచేసితివా సంహరించెదననగా అగ్ని వాని పాదములు పట్టుకొనెను. ఈసంగతిని వెలిబుచ్చవలదని చెప్పి అనుగ్రహించెను ఆయూరికి శత్రువు రాడు. వచ్చినయెడల నీలుడు యుద్ధము చేయడు. అతనికి బదులుగ అగ్ని బయలుదేరును. ఈరహస్యము తెలిసినవారు యుద్ధమునకు రారు. తెలియనివారు వచ్చినయెడల అగ్ని బయలుదేరును. ఇటులుండుటచేత సహదేవుడు నీలునితో యుద్ధమారంభింపగనే అగ్నివచ్చెను. ఇతడు యెవరు. సేనాధిపతియా బంధువా పనివాడా అని సహదేవుడు విచారించి అగ్నిదేవుడు నీలుని పుత్రిని కోరి భయపడి పనిచేయుచున్నాడని తెలిసికొని అగ్నిదేవా యీధనమంతయు నిన్ను తృప్తిపరచుటకేకద. ఇంత జయమును యిందుకేకద. ఈదిక్కున జయములేకున్న నీకు భోజనములేదు. అని ప్రార్థించి దర్భలువేసికొని పరుండెను. అగ్ని కృతజ్ఞుడుగాని కృతఘ్నుడు కాడు. కావున అగ్ని మాంద్యమును పోగొట్టిన అర్జునుని సోదరుడుకదా వీడని నిజరూపములో వచ్చి సహదేవా ఒక కారణముచేత వచ్చినవారినెల్ల చంపుచున్నాను. నీవు శరణాగతుడవు చంపను అనెను. అదిరేమి వీనితో స్నేహమని 'నీలుడడుగగా వీరు పరతాప

కారము చేసినవారు. వీరివిషయమున పనిచేయను. నీవు చేసిన చేయుమని అగ్ని చెప్పెను. నీకు శక్తియుండిన చేయుమని అగ్ని చెప్పగా వాడు యుద్ధము చేయుటకు చేయలేదు. మిక్కిలి ధనముల నిచ్చెను. సహదేవుడు అటుల పోవుచుండ పాండ్యదేశమునకు పోయెను. కావేరిని చూచెను. అహా యేమి కావేరి. ఉత్తరమునకు గంగ ఎటులో దక్షిణమునకు కావేరి అటులని వర్ణించి పరమానందమొంది పాండ్యదేశమునకు పోయెను. అచ్చట అర్జునునికి చిత్రాంగదకు పుత్రుడైన బభ్రువాహనుడు ధనము నిచ్చెను. పిమ్మట లంకకుపోయి విభీషణుని చూడదలచి సహదేవుడు ఘటోత్కచుని బిలిచి నీవు లంకకు పొమ్ము. విభీషణునిచూచి ధర్మరాజు రాజసూయయాగము చేయబోవుచున్నాడని చెప్పుము. ధర్మాత్ముడు యిచ్చును. యుద్ధమునకు రాడని పంపెను. వాడు పోయి సముద్రమును దానిలో సేతువును చూచి అహా శ్రీరాముడెటుల సేతువును కట్టెనని నమస్కరించెను. అచట కొండలు వృక్షములు ఉన్నవని విశేషమూ కాదు. శ్రీరాముని పదధూళి పడిన స్థలమని విశేషము. బ్రహ్మాదులు ఆరాధించునట్టి చరణారవిందములు పెట్టబడిన చోటు. సేతువును కట్టి యేమి చేసెననగా రావణుని సంహరించెను. అని యిటుల తలచి ఘటోత్కచుడు లంకకు పోయెను. పోయి దారిలోనుండు ఒక ద్వారపాలకునిచేత ఉత్తరము నిచ్చెను. నేను ధర్మపుత్రుని తమ్ముని కుమారుడను. దిగ్విజయమునకై వచ్చితిని. యాగార్థమై మహాభాగవతోత్తములగు తాము సహాయము చేయుడు చిత్తము తెలిపితిని అని వ్రాసిపంపగా విభీషణుడు చూచి మహాభాగవతోత్తముడు రమ్మనెను. భృత్యులు పిలుచుకొని పోయిరి. పళపళమని ప్రకాశించు సింహాసనమున విభీషణుడు కూర్చుండి యుండగా భగవదనుగ్రహమనిన యిది యేయని ఘటోత్కచుడు తలచెను. విభీషణుడు ఘటోత్కచుని స్తోత్రము చేసెను. అహా మా యూరికి వచ్చి అడుగువారున్నారా యనెను. అహా మా పెద్దలకు కృష్ణుని యనుగ్రహమని ఘటోత్కచుడు తలచెను. విభీషణుడు విశేషముగ ధనములనీయగా ఘటోత్కచుడు తెచ్చి సహదేవునికి సమర్పించెను. సహదేవుడు ఇంద్రప్రస్థముచేరెను. నకులుడు పడమటిదిక్కునకు పోయెను. అచట విశేష కార్యములేదు. కృష్ణుడుండుచోటది. అచటివారు కృష్ణునికి క్రిందివారు. కృష్ణునితో చేరిన వాడనగా ధనరాసుల నిచ్చిరి. నకులుడు అంతటితో పోక స్వామికి జాబు పంపెను. అన్న రాజసూయయాగము చేయ బోవుచున్నాడు. ఇచ్చెదరా యుద్ధమునకువచ్చెదరా అనగా స్వామి కోపించలేదు. న్యాయమేకద. భయపడి పోక చెప్పిపంపెనే మనవాడు అని యథేచ్ఛముగ ధనాదుల నిచ్చి ఊరికి పిలిచి యేమిరా యిటుల చేసితివనెను. "దిగ్విజయమనిన" అని తిన్నగ అనెను. భయపడకుమని స్వామి చెప్పెను. నకులుడు ఊరుచేరెను. కృష్ణుడు వచ్చి బహుదినములాయెనని పాండవులు యోచించుచుండగా యిదిగో వచ్చితినని సకల పరివారములతోడ సకల యోగ క్షేమ నిర్వాహకుడై వచ్చిచేరెను.

---

## (26) రాజసూయ యాగము.

పరమభాగవతాగ్రేసరుడైన యుధిష్ఠిరుని యొద్దకు కృష్ణమూర్తి వచ్చి జరాసంధ వధ మాయెను కదా. విశేషముగ ధనము వచ్చి చేరెను కదా. ఇక యాగము నారంభించరాదా అనెను. కృష్ణా జరాసంధుని సంహరించుట దిగ్విజయము చేయుట అంతయును నీయనుగ్రహము కదా. ఇపుడు యీభూమండలమంతయును నాచేత నున్నది. ఇపుడు ఒకడును నాకెదురులేడు. జరాసంధుని సంహరించియాయెను. వానికొడుకు మనతో చేరెను. నీయనుగ్రహ ముండగా మాకు తక్కువేమి యని ధర్మరాజనెను. నేను వచ్చి చేరితినికదా యాగము నారంభించవలయును. యోచన యేమని స్వామి అనెను. స్వామి ఊరక రాలేదు. న్యాయప్రకారము విశేషముగ ధనము తెచ్చెను. భగవంతుడు స్వాధీనము కాలేదు ద్రవ్యము నీయలేదు అనిన రాజసూయయాగము కానేరదు. కాబట్టియే నకులుడు స్వామికి చీటి పంపెను. అనకదుందుభి (వసుదేవుని) కొడుకు అనకదుందుభులతోడ వచ్చెను. నకులునికి ధనమునిచ్చి వాని పిలుచుకొని వచ్చెను. భగవదాజ్ఞచేత ధర్మరాజు యాగముచేయు నారంభించెను. యాగము అరంభము కావలయును. వేదవేద్యుడు పరమపురుషుడు యెదురుగ నుండగా నెవరు మంత్రము చెప్పుదురు. కావున వేదవ్యాసునితో చెప్పిరి. తాతా మంత్రము తంత్రము తప్పరాదని పాండవు లనిరి. పదునాలుగురు ఋత్విక్కులుగ నుండుటకై ఋషులకు చెప్పిపంపిరి. ఒకడు యజమాని ప్రక్కలో నుండవలయును. తక్కినవారు చుట్టునుండి మంత్రము చెప్పుచుండవలయును. పెద్దవారికి బ్రహ్మయనిపేరు. అతనికి మిగుల శ్రమయుండదు. అతడు సర్వజ్ఞుడుగ నుండవలయును. అతనిసన్నిధి అన్ని పనులు చేయవలసియుండును. తప్పినయెడల నిలుపుడు. ప్రాయశ్చిత్తము జరుగవలయును జరుపుడని ఆయన చెప్పును. వేదవ్యాసుడు అందుకేర్పడెను. అనగా బ్రహ్మగానుండెను. పైల ధౌమ్యులు హోతలుగ (హోమముచేయువారుగ) నుండిరి. యాజ్ఞవల్క్యుడు అధ్వర్యుడుగ (మంత్రమును నడుపువాడుగ) నుండెను. సర్వకార్యనిర్వాహకుడు కృష్ణుడు. అచటివారు సాధారణముగ వేదాధ్యయనము చేసినవారు మాత్రము కాదు. వేదస్వరూపులు. సాక్షాత్ వేదములే యని తోచును. ధర్మపుత్రుని యాగము జరుపుటకు వేదములే వచ్చెనని తోచును. ఋత్విక్కులు మరియు ననేక బ్రాహ్మణులును వచ్చిరి. ఆయాదేశములనుండి సర్వవిద్యాపారంగతులను వేదవేదాంగ పారంగతులను వేదవ్యాసుడు పిలుచుకొని వచ్చెను. అనేకులు రాజులు వచ్చిరి. దిగ్జయమునకు పోయినపుడు భయపడి యిచ్చిరి. ఇపుడు ధర్మపుత్రుని చూడవచ్చునపుడు ఊరక వత్తురా. విశేషముగ ధనములు తీసికొని ధర్మపుత్రుని దర్శనమునకు వచ్చిరి. ఇపుడిచ్చినది అపరిమితము. కృష్ణమూర్తి అన్నిటిని గమనించి బావా యేమి యిటుల చేసితివి. దుర్యోధనాదులకు వ్రాయలేదే. భీష్మద్రోణాదులు దుర్యోధనాదులు రాలేదు. వారు

కదా ముఖ్యబంధువులు అని స్వామి యనెను. దుర్యోధనాదులు పాండవులను చెరుపదలచిరి. తానొకటి తలప దైవమొకటి దలచెననినటు లాయెను. దేవర్షులు బ్రహ్మర్షులు రాజర్షులు సభలో ఉండిరి. ఈవైభవమును దుర్యోధనుడు చూచి సంకటపడవలయునని స్వామికి యోచన. వారురాలేదే యనగా ఔనౌను. వారికి ఉండు ప్రీతికి లేఖ వ్రాయవలయునా అని ధర్మపుత్రుడనెను. ఈశ్వరకృపచేత ఐశ్వర్యము అధిపత్యము కలిగినయెడల దానిని ముందుగ అసూయగల శత్రులు చూడవలయును. బావా భగవదనుగ్రహముచేత యింతవిభవము కలిగెనే. తమ్ములు స్వాధీనులు నేను పరిచారకుడను. దీనిని వారు చూడక మరెవరు చూడవలయును. పత్రికపంపినయెడల నచ్చెదమని రాకపోవుదురు. ఎవరినైనను పంపుము భీష్మద్రోణులను పిలుచుటకు మీయేపురిలో నొకడు పోవలయును. నీకు యాగదీక్ష. భీమార్జునులనివ వారికి సరిపడదు. నకులుడు ధైర్యముగ పిలుచును కావునవాని బంపుమని స్వామిచెప్పెను. నకులా నీవు పోయి యాగముచేయుదురు ఋషులును కృష్ణుడు ఋత్విక్కులు వచ్చియున్నారు. మీరు రాగనే యాగము ప్రారంభింపబడును రండియని భీష్మద్రోణ విదుర కృప అశ్వత్థామ దుర్యోధన దుశ్శాసనులతో చెప్పుమని ధర్మరాజు చెప్పిపంపగా, నకులుడు అటులేపోయి మర్యాదతో పిలిచెను. భీష్మ ద్రోణ కృప అశ్వత్థామలు అహా వీరు భగవదనుగ్రహముచేత యింత స్థితికి వచ్చిరే ఆబిడ్డలను చూతమని వచ్చిరి. రాజసూయమటనే మనము కొట్టి పంపితిమి. కృష్ణుడు చేయింపబోవుచున్నాడట. చూతము. ఏమి కర్ణా యనుచు దుర్యోధనాదులు వచ్చి చేరిరి. నకులునిచేత పిలువబడి వారు రాగనే అందరిని ఆసనములలో గూర్చుండబెట్టి మాభాగ్యము యాగము ఆరంభించ వలయును. కడవరకు ఉండి జరుపవలయునని ధర్మపుత్రుడు భీష్మద్రోణులకు నమస్కరించి ఆశీర్వదింపుడనెను. దైవము ఆచార్యుడుగను బంధుడుగను భృత్యుడుగను నున్నాడు తక్కువేమియుని వా రనిరి. అసూయగలవారు మిగుల ప్రియముతో నుందురు. దుర్యోధనుడు ధర్మరాజ భీమార్జున నకుల సహదేవులను జూచి అన్ని యేర్పాటు లాయెనా. ద్రవ్యము లంతయును వచ్చియుండును. ద్రవ్యమునకంటెను మనుష్యసహాయ ముండవలయును. అన్ని కార్యములును మనవారే చేయవలయును. ఇతరులు చేయరాదు అనెను. ధర్మపుత్రుడు కృష్ణుని జూచెను. వీడేమి ఆర్భాటము చేయుచున్నాడు. అసూయగలవాడు. మనవారు చేయవలయును నేను జగత్తుకు రాజైనను యింటికి పనివాడ నేకద యనుచున్నాడని కృష్ణుడు చూచెను. దుర్యోధనా నీవుచెప్పిన మాటచాలును. ఐనను చేయునట్టి అభిప్రాయ ముండుటచేత కృష్ణుడున్నాడు యోచించి చేయుమని ధర్మరా జనెను. కృష్ణా పనికల్పించుమని దుర్యోధను డడిగెను. ధృతరాష్ట్రుని కొడుకగు యుయుత్సు బ్రాహ్మణభోజనము సరిగా నడుచుచున్నదా యని చూచుటకు యేర్పడెను. దుశ్శాసనుడు ఫలహారములు చూచుటకు యేర్పడెను. ఎంత భక్ష్య భోజనములు కర్చు అగునో మరల అంత యుండవలయునని స్వామి చెప్పె

ను.అంతేయును వినియోగించి వీరిని సత్రమునకు బంపుదమని అసూయగల వీరికి ఉండును ప్రీతిగలవారిని యీకార్యములలో పెట్టినయెడల కొంచెము జాగ్రతగ కర్చుచేయుదురు. అందుచేత బావకు పేరు కలుగదు అని తలచి స్వామి వారిని ఆపనులలో నుంచెను. అశ్వత్థామయును ద్రోణాచార్యులును బ్రాహ్మణులను పిలుచుకొనివచ్చి కూర్చుండ బెట్టుటయందు నియోగింపబడ్డిరి. మహాజ్ఞాతియగు సంజయుడు రాజులను మర్యాదచేసి పిలుచుకొని వచ్చుట కేర్పడెను. హిరణ్య రజిత రత్న దాన దక్షిణావిషయమున కృపాచార్యులు యేర్పడ్డిరి. కృష్ణా నాకేమిపనియని దుర్యోధను డడిగెను. మీకు యిట్టిపని పెట్టినగునా.యాగముఖమున మెత్తపరచుకొని దిండు వేసికొని కూర్చుండవలయును. వచ్చిన రాజులు కానుకలు తెచ్చి తెచ్చి ధనాదులు తెత్తురు. నీవు వాని చేతితో స్పృశించవలయును. లోపల పెట్టివేయుదురు. నేనున్నాడనే పైకార్యములు మొదలు అధమకార్యముల వరకు చేయుదునని స్వామి చెప్పెను దుర్యోధనుని చేతిలో ధన రేఖ తరగియుండెను. ఆసంగతియెవరికిని తెలియదు.సర్వజ్ఞుడుగాన స్వామికి తెలియును.రావలయునని పిలిచి అతని చేయిపట్టుకొనుటలోనే ఆరేఖను స్వామి ప్రకాశింపచేసెను. ఎవరైనను ఒకటి తెచ్చిన పదిగను పది తెచ్చిన నూరుగను కావలయును. బావకు పేరు కలుగవలయునని అటుల రేఖను తెచ్చెను. అటుల వచ్చినవారు తెచ్చిన రత్నరాసులను దుర్యోధనుడు తాకుచుండెను. కృష్ణా నీకేమిపనియని దుర్యోధను డడుగగా అన్నియును చేయుదునని స్వామి చెప్పెను. అటులకాదు. చెప్పుమనగా జలము తెచ్చి సిద్ధముగనుంచుకొని వాకిట బ్రాహ్మణులు రాగనే వారి పాదప్రక్షాళనమొనర్చి ఆజలమును శిరసుమీద ప్రోక్షించుకొనెద నని స్వామి చెప్పెను. ఆహా వీరిని ముందుకు తెచ్చినవాడు. ఇటులచేయుచున్నాడు. వీరియదృష్టమేమి యని తలపక, మనకు తగినపని మనకును వీనికి తగినపని వీనికి అని దుర్యోధనాదులు తలచిరి. సమయము వచ్చిన వంటచేయుదును. ఎంగిలి యెత్తుదునని స్వామి చెప్పెను బావా అన్నియేర్పాటులాయెను. యాగము ఆరంభించవచ్చునని కృష్ణమూర్తి అనెను. యాగము ఆరంభమాయెను. ఆయాగ మెట్టు లుండును. చేయువాడు ధర్మరాజు. చేయించువాడు కృష్ణుడు. వేదవ్యాసుడు యాజ్ఞవల్క్యుడు పైలమహర్షి మొదలగువారు ఆయాకార్యములం దుండిరి. ఇట్టియాగ మిదివరలో జరిగి యుండలేదు. ఇకను జరుగబోదు. ఈయాగమును చూడవలయునని నారదాదులు మహర్షులు వచ్చిరి. కానుకలు తెచ్చినవారినిచూచి అదిగో అచ్చట చక్రవర్తి యున్నారని స్వామి అనును.అచ్చటచట జరుగవలసిన మంత్రములు తంత్రములు ప్రారంభమాయెను. బ్రహ్మక్షత్రియ వైశ్య శూద్రులు ఉచిత ఆసనములలో కూర్చుండిరి. ఉచితఆసనములలో బ్రహ్మర్షులు రాజర్షులు దేవర్షులు కూర్చుండిరి. నారదాదులు కూర్చుండిరి. దుర్యోధన దుశ్శాసనాదులును ఉండిరి. ప్రాతస్సవన మాయెను. మాధ్యాహ్నిక సవనమాయెను. భోజనము జరుగవలసియుండెను. ఆకులు యెవ్వరు వేయుదురో యనిన రాజులు వేసిరి.

వచ్చిన కొందరు రాజులు వడ్డించిరి. ఆహా రాజులే వడ్డించుచున్నారే యని దుర్యోధనుడు తలచెను. స్వామి పైవిచారణచేయుచు తిరిగెను. అచట సామాన్యమైన భృత్యులు ఉండలేదు. అంగ వంగ కళింగ దేశాధిపతులకు స్వామి ఆజ్ఞ చేయగా వారు యీలాగు ఆపనులు చేసిరి. భృత్యులకు భక్తిశ్రద్ధాదు లుండునా వీరు యేదిచెప్పినను చేయుదురు. దుర్యోధనాదులు దీనిని చూచి సంకటపడుదురు. సాధారణముగ గొప్పకార్యములలో సకలలోభమును అజ్యములో కనుబడును. యజమానుని కన్నులపార్వ 'ఉండినచోట నేయి ధారగపడును. మరికొన్నిచోటుల బిందువుగను, కొన్నిచోటులలో పాత్రదర్శనమును మరికొన్నిచోటుల పాత్రదర్శనముసహా లేదు.కొన్నిచోటులలో గరిటవేయుటచేత గణగణమను శబ్దముమాత్రము ఉండును. ఈయాగమున అటులకాదు. ఈయాగములో వలె యెచటను ఇంద్రాదులు తృప్తిపొందలేదు. దేవతలకు బ్రాహ్మణులకు రాజులకు వైశ్యులకు శూద్రులకు తృప్తిగ భోజనాదులు జరిపిరి. సకల వర్ణములకును తృప్తి ఆయెను. ఒకవర్ణమునకుమాత్రము మర్యాద జరుగ లేదు. బ్రహ్మక్షత్రియవైశ్యశూద్రులను నాల్గు వర్ణులకును తృప్తి ఆయెనని చెప్పబడెను. మరల ఒకవర్ణమునకు మాత్రము మర్యాద జరుగ లేదని చెప్పబడెను.ఇక మర్యాద జరుగని వర్ణము యేది యనగా,వర్ణమనుటకు జాతియని అర్థము కాదు.అక్షరమనియు యర్థము. క మొదలు క్ష వరకుగల అక్షరములను వర్ణములని చెప్పుదురుకదా. ఆవర్ణములలో నొకటియగు న అను వర్ణమునకు (అక్షరమునకు) మర్యాదజరుగలేదు. న అనగా లేదని యర్థము. న అనువర్ణమునకు యెల్లవారును మర్యాదచేయుటచేత వారు దానికి మర్యాదచేయలేదు. అందరు లేదు లేదని యందురు. లేదను అర్థమును తెలుపునట్టి న వర్ణమును వారు చేర్చలేదు. అనగా నాస్తి శబ్దము అచట లేకుండెను. అందరును తృప్తులైరి. దుర్యోధనాదులు పైకి సంతోషించిరి. భీష్మద్రోణులు ఋషులందరును నిజముగ సంతోషించిరి. ఇంద్రాయస్వాహా అనగా ఇంద్రుడు సాక్షాత్తుగ వచ్చి చేయిచాచి హవిర్భాగము తీసికొనెను. ప్రీతితోవచ్చినవారికి పరమసంతోషమాయెను. అసూయతో వచ్చినవారికి మిగుల దుఃఖము కలిగెను. ఇటుల అద్భుతముగ యాగము జరుగుచుండెను. దానిలో ప్రధాన వపాయాగము జరుగుదినము వచ్చెను.ఆయాగము కాగనే అంతర్వేది (రెండుఅగ్నులకు మధ్యనుండు ప్రదేశము)లో అందరు కూర్చుందురు. బ్రాహ్మణులకు తాంబూలము యిత్తురు. సభాతాంబూలము నీయవలయును. తాంబూలము గైకొనుటకు తగినవారు అచట నుందురు. అచట వేదవ్యాసులు భీష్మాచార్యులు రాజర్షులు బ్రహ్మర్షులు దేవర్షులు ఉండిరి. మొదట తెగించి తాంబూలము యిచ్చుటకు ధర్మరాజుకు తోచలేదు. ధర్మపుత్రా యీయుమని భీష్మాచార్యులనిరి. ఎవరికని ధర్మపుత్రుడడుగగా, వారివారి యోగ్యతకు తగినటుల యీయుమని భీష్ముడనెను. అందరును ప్రథమతాంబూలమునకు తగినవారని ధర్మపుత్రుడు యోచించెను. ధర్మపుత్రా యోచనయేమి అని భీష్ముడనగా నాకు అందరును పెద్దలుగ తోచు

చున్నారు. వీరికని గుర్తుచెప్పుడు శాస్త్రసమ్మతముగను అందరును ఒప్పునటులుగను ఉండవలయునని ధర్మపుత్రుడనెను. భీష్మాచార్యులు సభనుచూచెను. ప్రొద్దాయెను. ఒకరికి యీయవలయును. మీరు చెప్పుడనుచున్నాడు. నాకేమి భయము. హృషీకేశుడు ప్రేరేపించినటుల చెప్పెదనని యుధిష్ఠిరా! మిమ్ము బాల్యము మొదలు కాపాడిన ప్రభుడును, భగవద్గీత 4 అధ్యా 8 శ్లోకమువలె, దుష్టశిక్షణము శిష్టపరిపాలనముచేసి ధర్మమును సంస్థాపించుటకై అవతరించినవాడు మీయింటి భృత్యుడుగ నున్నాడు. నిప్పును బూడిద కప్పియుండిననేమి. భృత్యుడుగ నుండిన నేమి. కావున కృష్ణునకు ప్రథమతాంబూలము నిమ్ము. అని కృష్ణుడు ప్రథమపూజకు అర్హుడని తీర్మానించి చెప్పెను. భీష్మాచార్యులు చెప్పగనే యిక తామసించిన వీరు వారు అని అందరు అరంభింతురని ధర్మరాజు సహదేవుని జూచి సహదేవా వారివారి యోగ్యతకు తగినటులుగ తాంబూలము నీయవలయును. కృష్ణునకుముందుగ కానీయుమనెను. కృష్ణుడు సభలో నుండెనా. లోపల వంటశాలలో నుండెను. కృష్ణా ప్రథమతాంబూలమును గైకొనుము రమ్మని పిలువగనే స్వామి వలదనలేదు. తీసికొనవలయును. శిశుపాలవధము కావలయునని గైకొనెను. కలహమునకు కారణముగ నుండిన గైకొనడు. భీష్మాచార్యులు ప్రీతితో చెప్పియుండిన అంగీరింపడు. తాను ప్రథమతాంబూలమునకు అర్హుడని శాస్త్రమునకు అనుకూలముగ నుండినందున అంగీకరించెను. అచట పనివాడుగ నుండినను పరమపురుషుడు కదా. కృష్ణమూర్తికి ప్రథమతాంబూల మీయగనే, శిశుపాలుడు హే రాజులారా ఎవరును అతాంబూలమును తీసికొనరాదనెను. కోపముచేత వానిదేహము వడకుచుండెను పెదవిని కరచుచుండెను. అనర్థము వచ్చునని రాజులందరును భయపడిరి. భీష్ముడు వానికెటుల యీయమనెను. వీడెటుల యిచ్చెను. అందరును యెటుల ఊరకున్నారు. వాడెటుల తీసికొనెను. ఒకరును తీసికొనరాదనెను. అప్పుడు బుద్ధి బాగుగ నుండలేదు. వేరుకార్యములో నుండెను. శిశుపాలుని హృదయములో నుండెనని కాపి యనిరి. అందరికిని సమ్మతముగ నుండెను. వీనికిమాత్రము లేదు. ఏలయనిన అందరికిని కాలము రాలేదు. వీనికి వచ్చెను. వినాశకాలే విపరీతబుద్ధిః అనియుండలేదా. ఎవరును తాంబూలమును తాకరాదు. సహదేవా నిలుపుము ఒక వ్యవస్థ యేర్పడగనే తీసికొనవలయును. ధర్మపుత్రా వీనికి ప్రథమతాంబూలము నిచ్చితివే యేమి యోగ్యత యున్నది. ఇందరు పెద్దలున్నారుకదా. (తనకీయలేదని మనసున చింత.) రాజులకు లేక బ్రాహ్మణులకు చేయవలయును. వీడుదేనిలో చేరినవాడు. వయోవృద్ధుడనియా అటులైన వసుదేవు డుండలేదా. సంబంధియనిన ద్రుపదుడుండలేదా. గురుడనిన కర్ణుడుండలేదా. నాకని చెప్పలేదు. యాజ్ఞవల్క్యములున్నారు. ఋత్విక్కులు కులవృద్ధుడు భీష్ముడు ఉన్నారు. మహాబ్రాహ్మణుడు ద్రోణుడు ఉన్నాడు. సర్వకార్య నిర్వాహకుడు వ్యాసుడున్నాడు. వీడు తగనివాడు వీనికి యిచ్చి

తిరి. నేనిందు తాంబూలము పుచ్చుకొనను. మీరంగీకరించిన శిరశ్ఛేదమొనర్పింతు. మేమందరమును చేరియుండు సభలో వ్యత్యాసము జరుగరాదు. కొంచెము గమనింపుడు అని కృష్ణుని పిలువుమనెను. ఎందుకని స్వామి అనలేదు. కృష్ణా యెటుల పుచ్చుకొంటివిరా నీవలన సహాయము పొందిరని నీకిచ్చిరి. నీకు బుద్ధి యెచ్చటికేగెను. కడపటితాంబూలమునకు తగుదునే యనవలదా. ఏధైర్యముచేత చేయి చాచితివి. పాండవులు మిగుల దసస్థితిలో నుండిరి. ఇపుడు హెచ్చుగనున్నారు. మరల హీనస్థితికి వచ్చిన నెటులని యిచ్చిరి. యాదవా నీయోగ్యతకు తగుకార్యమును చేయవలయును అధిక ప్రసంగము చేయుచువే ఈసాధారణ విషయము తెలియదా. గొప్పవారింటి సారథి మర్యాదను పొందనగునా నీయోగ్యత యింతయని నీకు తెలియవలదా అని శిశుపాలుడడుగగా నేను అడుగలేదు. వారు యిచ్చిరని స్వామి చెప్పెను. ఉండనిమ్ము. పాండవులు మూఢులు. నీవెటుల సమ్మతించి పుచ్చుకొంటివి అని కృష్ణుని, వీరెటుల యిచ్చిరి అని పాండవులను, తిట్టి యీ అయోగ్యసభలో నుండనని లేచి ఒకపర్యాయము సభనుచూచి, ముసలివానికి ధర్మరాజుకు సహదేవునికి కృష్ణునికి బుద్ధిలేదు. నేను పోయెదను. ఈసభలో నొకరైన నుండరాదు. లేచి పొండు. అనెను. జరాసంధుని సంహరించి యింతచేయగా పావిత్ర్యపోగా భాగ్యము వెడలినటులాయెను అని తలచి భీష్మాచార్యులు శిశుపాలా కృష్ణుడెవడు. నీవెవరు. మనమందరము చేరినవారమేకద. అరువదిసంవత్సరములకు అధికమైనయెడల బుద్ధి పోవును. వారు చెప్పిరని చేసితిని. వారు యిచ్చెను. తీసికొమ్మనిరని కృష్ణుడు తీసికొనెను. క్షమ్మ. తెలియక నడచెను. ఇకయెవరికి చేయమనిన వారికి చేసెదము అని ప్రార్థించెను. శిశుపాలుడు తన్నుకొనుచుండెను. ధర్మపుత్రుడు ఉండిరేమి పోయిరేమి పోనిమ్మని భీష్మాచార్యులనగా, భీష్మ రాజులందరును పోదురేయని ధర్మనందనుడనెను. పోనిమ్మని భీష్మాచార్యులు సభను జూచి, శిశుపాలునితో చేరినవారందరును పోవచ్చును అనెను. నాకు మంచిమాట చెప్పరాదాయని శిశుపాలుడనగా చెప్పరాదని భీష్మాచార్యులనిరి. ఎందుచేత నాకు బుద్ధిలేదాయని శిశుపాలుడనగా, లేదు ఈకృష్ణుడు యీసభకేకాదు లోకపూజ్యుడు నీకిది తోచలేదే. కావున మూఢుడవు నీకు మంచిమాట చెప్పరాదు అని భీష్మాచార్యులు శిశుపాలునితో చెప్పి సభ్యులనుజూచి వీనియభిప్రాయమును ఒప్పువారున్నారా. ఉండిన చేతులనెత్తుడు. అనెను. ఒకడైనను యెత్తలేదు. ఒకరికైనను అటుల తోచనా లేదు. దుర్బుద్ధిపట్టిన నీకు అటులతోచెను. నీకు వినాశకాలము అని భీష్మాచార్యులు శిశుపాలునితో చెప్పి సభను జూచి మీరందరు కూర్చుండుడు. వానికి నాశకాలము వచ్చెను. యాగశాలను విడచి పోడు ఇంకే నశించును. నన్ను యాగమును కృష్ణుని అందరిని ధర్మపుత్రుని దూషించుచున్నాడు. వినాశకాలమునకే యిటులతోచును అని, ఓరీ సహదేవా నేను చేయుచుంటిని. ధర్మపుత్రుడును చేయుమనెను. నీవు చేసితివి. కృష్ణుడు తీసికొనెను. అనెను రాజు

లారా చేసితిమి. కృష్ణునకు యిచ్చినది అసమ్మతమైనయెడల లేచి యుద్ధమునకు రండి యని సహదేవు డనెను. శిశుపాలునిమాత్రము చెప్పవచ్చును రాజులనందరిని చేర్చిచెప్ప వచ్చునా అనగా, వీరు రాజులనందరిని జయించియుండిరా చూతమని సహదేవు డనెను. రాజులారా చిన్నవాడు అధికముగ మాటలాడినాడను కొనకుడు. నాకు సమ్మతమేను. లేకవచ్చును. తలలో కాలునుంచును. రాచివేయును అని భీష్మాచార్యు లనిరి. స్వామి యింతకు తగునాయని ధర్మపుత్రుడు యోచించెను. ధర్మపుత్రా ఏమనితలచితివి నిత్యవి భూతిలోనుండి లీలావిభూతికి వచ్చి మత్స్య కూర్మావతారముల నెత్తెను. భూమి నీట మునుగగా వరాహావతార మెత్తెను. హిరణ్యకశ్యపుడు ప్రహ్లాదుని హింసింపగా స్తంభ మున అవిర్భవించి ప్రహ్లాదుని కాపాడిన నారసింహుడు. ఇరువదియొక పర్యాయములు రాజులను సంహరించి రక్తము నైమమడుగులు చేసి తర్పణము చేసిన పరశురాము డితడు. దశరథునికి పుత్రుడై యవతరించిన రఘువీరుడు. రణధీరుడు. అట్టివాడు ప్రార్థింపబడి కృష్ణుడుగా అవతరించెను. అట్టి ప్రభు వితడు. బాలలీలలో వత్సాసుర బకాసుర వ్యోమాసురులను సంహరించిన ప్రభువు. వంటయింటనుండు పనివాడని తలచితివా. అట్టివాని కటాక్షమును పొందితిరి. ఆస్వామి అక్రూరునిచేత ప్రార్థింపబడి కంసునిసంహరించెను. జరాసంధుని పదునెనిమిదిపర్యాయములు తరిమినప్రభువు. వానినేల చంపలేదనగా, మిమ్ము దుర్యోధనాదులు పరదేశులను చేసిరి. స్వామి కాపాడెను. ఇంద్రప్రస్థము మయసభ నేర్పరచెను. పరమాత్మగాన రాజసూయయాగము జరుగునని తెలియును. స్వామియే వాని జంపియుండినయెడల జరాసంధుడుండినయెడల రాజసూయము జరు గునాయని జనులు అనుకొందురని వాని యింతవరకు పెట్టిపెట్టెను. తాను జంపినయెడ ల రాజసూయయాగఫలము వీరికి రాదని అటులచేసెను. ఒకకార్యముయొక్క అంగము లనంతయును కర్తయే చేయవలయును. రాజసూయయాగమునకు జరాసంధవధము ప్రధా నాంగము. కావున స్వామి వానిని అపుడు విడిచిపెట్టెను. యుద్ధమునకు పోయిన మొదటివాడే వానిజంపుమార్గమును చెప్పలేదు పదునేను దినములుండి బలిష్ఠుడని తెలిపి భీమునిచేత చంపించి, జరాసంధుని చంపినవాడని భీమునకు పేరు కలిగించెను. జరాసంధుని పదునెనిమిది పర్యాయములు తరిమినస్వామి అడుగడుగుకును వాడు తొందరపరచుచున్నాడని ద్వారకాపట్టణమును నేర్పరచెను. అట్టిస్వామి యగుటచేత నే ప్రథమతాంబూలము నీయమంటినని భీష్మాచార్యు లనిరి. కృష్ణమూర్తికి ఆనందము. దుర్యోధన దుశ్శాసనాదులకు లోపల దుఃఖము. పయికి ఔను తాతా యనిరి. రాజులకు సంతోషము. ఒక శిశుపాలునికి మాత్రము దుఃఖము. సహదేవుడు నిలిచియుండెను. తాంబూలము నీయవలయును. వీరికిముందు వారికిముందు అని యుండిన చెప్పుడు. కృష్ణుట కలహమునకు రాతలదు వాసుదేవుడు ప్రథమతాంబూలమునకు తగడని చెప్పు వారిబాలుకను కోసివేయుదును అని సహదేవు డనెను. సహదేవుడు నిలుచుచుండగా

రాజు లందరును గడగడవడకిరి. శిష్టపరిపాలనమాయెను. దుష్టశిక్షణము కావలసియుండెను. రాజులారా వీనికి మిగుల గర్వము యెక్కిపోయెను. వీడు హెచ్చుగ మాటలాడుచున్నాడు. పాండవుల నేవురిని చంపుదును. పిమ్మట మనసునందుంచి మిమ్ము చంపుదును. లెండని శిశుపాలుడనగా కొందరు లేచిరి. శిశుపాలుడు శూరుడు. దుర్యోధన దుశ్శాసనాదు లున్నారు. రణరంగమగునని ధర్మరాజు భయపడెను. యుధిష్ఠిరా వీరు వానికై భయపడి లేచిరి. వారు యుద్ధము చేసిన నెటులని భయపడుచున్నావు. సింహము పరుండి నిద్రించువరకు కుక్కలు మొరుగుచుండును. వాసుదేవుడు సింహము. లేచిన కుక్కలు పరుగెత్తును. మనలో నొక సింహమున్నది. సమయమువచ్చిన అది లేచును. వృష్ణిసింహము. యాదవసింహము. గర్జనము చేసిన యీకుక్కలు పరుగెత్తును అని భీష్ముడనెను. తాతా కృష్ణుడు బయలుదేరిన అంతగునాయని ధర్మరాజనెను. పదునాలుగు అండములకును త్రిలోకములకును కర్తయతడు. సృష్టి స్థితి లయకరుడు. భగవద్గీత 17 అధ్యా 7 శ్లో. వలె వానికంటెను హెచ్చైనదిలేదు. అట్టి ప్రభువుఅతడు అని భీష్మాచార్యులు అనిరి. శిశుపాలు డీమాట వినెను. ముసలివాడా వేమందరమును కుక్కలమా కృష్ణుడు సింహమా. ఆలోచించుచున్నదా. ఐదునిమిషములలో చూపెదను. ఇటుల కొంచెము భయము చూపిన భయపడుదుమా. ఈవంశమున (పేడ శూరులుండుచోట.) నీవెక్కడ పుట్టితివి. కుక్కను సింహమును గుర్తింపలేకున్నావే వయస్సాయనే బుద్ధిలేకున్నదే అని శిశుపాలు డనగా నేను వయసుచెల్లినవాడను కావున నాకు బుద్ధిలేదు. నీవు చిన్నవాడవు కావున నీకు బుద్ధిలేదని భీష్మాచార్యులు కృష్ణుని చూచెను. కొంచెము నిదానింపవలయునని స్వామి జాడచూపెను. చమత్కారుడా అనిపెట్టి శూరుడైన రమ్మనుము అని శిశుపాలుడు స్వామినుద్దేశించి ఓరీ యీసభలో నిన్ను సంహరింపబోవుచున్నాను. ధైర్యముండిన వచ్చినిలుము అనెను. స్వామి వచ్చెను. దుష్టులు సంతోషించిరి. సాధులు దుఃఖించిరి. వేదవ్యాసాదులు ఆశీర్వదించిరి. స్వామి కొంచెము తగ్గినటుల చూపించుచుండెను. ముసలివాడా నేనా కుక్క వాడా కుక్క అని శిశుపాలుడు తిట్టెను. స్వామిని మరియు దూషించుచుండెను. స్వామి తిట్లను లెక్కపెట్టుచుండెను. నూరాయెను.

దమఘోషమహారాజుయొక్క కుమారుడు శిశుపాలుడు. వాడు పుట్టినపుడు రెండుచేతులు ఒకకన్ను అధికముగ నుండెను. రాజు ఆబిడ్డను పారవేయవలయు ననుకొనెను. రాజా యెవరు నీబిడ్డను ఒడిలో పెట్టుకొనినపుడు యీయధికముగనుండు చేతులు కన్ను పోవునో వారు వీని చంపునని అశరీరవాణి పలికెను. తన అత్తకు బిడ్డ పుట్టెనని కృష్ణమూర్తి రాగా ఆమె బిడ్డను స్వామిచేత నిచ్చెను. రెండుచేతులును ఒక కన్నును మరిగిపోయెను. కృష్ణుడు యీబిడ్డకు శత్రుడని అర్థమాయెను. కృష్ణా ఆశరీరవాణి చెప్పెను. నీచేత యివిపోయెనుకదరా యని ఆమె యేడ్చెను. అత్తా యిది శౌరిఏ యుండిన నేను వచ్చిరయే యుండనే అని స్వామి అనెను. వీడు అనేక అపరాధములు

చేయుమ ఎన్ని చేసినను సహించెదనని చెప్పుమని ఆమె అనెను. నూరపరాధములను సహించెదను. అత్తా యథార్థుడు. అశరీరవాణి చెప్పెను. నీకొరకు సహించెదను. నూరపరాధములను ఏకకాలమున చేసిన సహింపను. ఒకడు ఏకకాలమున నూరపరాధములు చేయునా భయపడకుమని స్వామి చెప్పెను. ఆమాటనుబట్టి స్వామి వాడుతిట్టిన తిట్లను లెక్కపెట్టుచుండెను. జనులు చూచుచుండిరి. నూరుతిట్లులాయెను. స్వామి తిరిగి చక్రమును చూడగా చక్రము బయలుదేరెను. పళపళమని ప్రకాశించుచు ప్రళయకాలాగ్నివలె కోటిసూర్యోదయమైనటుల వచ్చి శిశుపాలుని కంఠము నరకెను. ఏరా యింకను తిట్టులున్నవా. వాడిని విష్ణువుని చక్రము గొంతుకోసెను. శిశుపాలుని శిరసును ఛేదింపగనే మొండెము పర్వతమువలె వజ్రాయుధముచేత నరకబడినటుల పడెను. భగవంతుని యొక్క ద్వారపాలకుల మూడుజన్మములు అసురజన్మము వచ్చునటుల శాపము వచ్చెను. మొదటిజన్మమున హిరణ్యాక్ష హిరణ్యకశ్యపులై. పుట్టిరి. రెండవజన్మమున రావణకుంభకర్ణులై పుట్టిరి. మూడవజన్మమున శిశుపాల దంతవక్త్రులై పుట్టిరి. అసురజన్మము మూడుజన్మములే యగుటచేత మూడును ఆయెను. ఇక వైకుంఠమునకు పోవలయునుగాన తేజస్సు బయలుదేరెను. పరమప్రసిద్ధపురుషుడైన ద్వారపాలకుని ఆత్మగాన భగవంతుని పాదములబడి బయలుదేరి భగవంతుని శరీరములో చేరెను. అందరును ఆశ్చర్యపడిరి. ఏమిభాగ్యమి అని అందరు ఆశ్చర్యమొందిరి. రుక్మిణీకల్యాణము విషయములో అపరాధమొనర్చిన యీదుష్టుడు సంహరింపబడెను. దుష్టనిగ్రహము శిష్టపరిపాలనము ధర్మసంస్థాపనము ఆయెను. ధర్మపుత్రా యిట్టిస్వామి నీకు పరిచారకుడేయని అందరు ప్రశంసించిరి. యాగముమధ్యలోవధ ప్రాయశ్చిత్తము జరుపబడెను. ఈరీతిగ యాగము ముగిసి అవభృథస్నాన మాయెను.

---

## (27) దుర్యోధనుని అసూయ—శకుని దురాలోచన.

---

రాజసూయయాగము కాగనే వారువారు తగుమర్యాదలుపొంది తమస్థలములకు పోయిరి. అది భగవంతునియొక్క కార్యము. స్వామి సకలకార్యములు చేయువాడు పాండవబంధువు. యాగము కాగనే ఊరకకూర్చుండిన నెటుల పోయివచ్చెద ననెను. కృష్ణా మిగుల శ్రమసాధ్యకార్యము. నీయొక్క అనుకూల్యము లేకుండిన జరుగునా. అని ధర్మరాజనెను. బావా నేనేమి నాకేమి యోగ్యతయున్నది. నాముఖముగ భగవంతుడు జరిపెను. అనిచెప్పి స్వామి లోకులకు మాదిరిమాపిరి. భగవంతుడు బయలుదేరి పోయెను. దుర్యోధనుడు పోలేదు. స్నేహతారతమ్యమునుబట్టి వారువారు మాటలాడి పోవుదురు. అబద్ధమునకు ఆడంబరము అధికమనినటుల దుర్యోధనుడు మాత్రము ప్రీతితో నుండునటుల అభినయించుచు పాండవులయొద్ద నుండెను. అన్నికార్యము లాయెను

పోయెదనని వేదవ్యాసుడు ఋషులతోడ ధర్మపుత్రుడు సింహాసనమున నుండగా పోయెను, యాత్రాక్రమమున కైలాసమునకు పోయిచేరిరి. అసూయతో వచ్చువారికి విపరీతముగ తోచునటుల ఆసభాభవనములో మయుడొక చమత్కారము చేసెను. స్ఫటికములతో తటాకమేర్పరచెను. అందు వైడూర్యములతోను, ఇంద్రనీలములతోను తామరపుష్పములుండెను. ఆసరస్సు భవనము మధ్యనుండెను. దుర్యోధనుడు దానిలోదిగి ధర్మరాజునొద్దకు పోవలయునని తలచెను. జలముండు సరస్సని మోకాలివరకు వస్త్రము నెత్తగా అందరు నవ్వుకొనిరి. ఆసరస్సుకు మెట్లు ఉన్నవని తలచి కాలుపెట్టపోయి పడెను. ఓహో సభను నిర్మాణము చేసినవాని చమత్కారమని తలవంచి పోయెను. అచట నిజముగ క్రీడావాపి యుండెను. అది చిన్నది. ముందటివలెనే యిదియు పనిచేసినవాని చమత్కారమని బాగుగ నడువగా దానిలో పడెను. ఇటు లాయెనని ధర్మపుత్రునితో చెప్పనేల ఉండనిమ్మని పోయెను. భీమార్జున నకులసహదేవులు పక్కన నవ్విరి. వీరికి లోపల ఆగ్రహము. ద్వారము లేనిచోట ఉండునటుల తోచును. దుర్యోధనుడు నిజముగ ద్వారముండుచోటును చూచి లేనిదే ఉండునటుల చూపిరని త్వరితముగపోయి కొట్టుకొనెను. ఇది యేమి. విపరీత జ్ఞానముగ నున్నది. నేను బయలుదేరిన వేళ బాగుగ లేదు. అని తలచెను. అసూయచేత అటుల తోచెనని తలపలేడు. ఓరీ వస్త్రములు తడిసెను వేరువస్త్రములు తెండని పాండవులు చెప్పగా భృత్యులు తెచ్చియీయగా దుర్యోధనుడు కట్టుకొనెను. మిగుల దుఃఖించెను. ఇది స్వప్నమా మాయయా పిచ్చియా కన్నులు పోయెనా. కృష్ణుడు వారిని మిగుల హెచ్చించి నన్నిటుల చేసెను. అని తలచి ధర్మపుత్రా పోయి వచ్చెద ననెను. భీమార్జున నకులసహదేవులు రాజుపోబోవుచున్నాడు వాద్యము వాద్యము అనిరి పాంచాలి నిఖిలాభరణభూషయై కూర్చుండియుండెను. దుర్యోధనుడు స్థలమని నీటమునుగగా ద్రౌపది సఖుల మధ్యలోనుండి నవ్వెను. వీడు తలయెత్తుటకును ఆమె నవ్వుటకును సూటిగనుండెను. దుర్యోధనుడు పాండవుల అఖండరాజ్యలక్ష్మిని తనగతిని దలచి మిగుల దుఃఖించి తలవంచి దుశ్శాసనాదులను పిలుచుకొని పోయి ఊరుచేరెను. ఆయద్భుత సంపత్తును దలచి తలచి మిగుల నొచ్చుకొనుచు పరివారముతో హస్తినాపురము చేరెను. పదిదినము లాయెను. ఆహారము లేదు పాండవులను వారిసంపదను దలచును. తనగతిని దలచును. ఒక గదిలో కూర్చుండి చింతపడుచుండెను. ఎవరు పోయినను మాటలాడకుండెను. తగువాడని శకునిని పంపిరి. వారికిటుల సంభాషణ జరిగెను. శకుని— ఏమిరా వచ్చినపిమ్మట నిన్ను జాడలేదు. శుష్కించి పిచ్చివానివలె నున్నావు. దుర్యోధనుడు— నిప్పులో పడెదను. శ— కాల్చును. దు— విషము త్రాగెదను. శ— లోపలపోయి మిగుల సంకటపరచును. దు— బావిలోపడెదను వెలుపల లోపలను చల్లగనుండును. శ— ఏల అటుల తలచెదవు. దు— నేను జీవించను. (అసత్తులకు సత్తుల వైభవము చూచినయెడల యింత

దుఃఖము కలుగును. వారు భగవంతునియెడ భక్తిచేసి అట్టిస్థితికి వచ్చిరి మనమును భక్తి సేయవలయునని తలపరు.) దు— మామా పాండవులను చూచినదిమొదలు నాకు మిగుల సంకటముగ నున్నది. ఇంతకును కృష్ణుడు కారణము. వాని ముందు చంపవలయును. పిమ్మట పాండవులనేవురిని చంపవలెను. అపుడు మూడుమ్మూర్కాలు గడియయైనను రాజ్యమేలి చచ్చెదను. లేకున్న యిపుడే చచ్చెదను. శ— నీకేమి రాజ్యములేదా. ఐశ్వర్యము లేదా. నగరులేదా. నిన్నుచూచువారు లేరా. నీకేమి పరమదరిద్రునివలె దుఃఖించుచున్నావే. దు— పాండవులయొక్క మితిమీరిన ఐశ్వర్యమును జూచి తాళజాలను. శ— అచ్చట యేమి హెచ్చుగ నుండెను. దు— దిగ్విజయముచేసి రాసులురాసులుగ తెచ్చిరే ఆద్రవ్యము ధనాగారములలో దాచుటకు చోటులేకుండెను. వీధులలో యిసుకవలెను పోసియుండిరి. ఎవరైనను తాకుదురా. భీముని తలచి తాకరు. మామా అదితలచి యెటుల సహింతును. శ— నీవు పోయిన జయింపవా. దు— మామా ఎంతకాలముగ రాజ్యమేలుచున్నాము. అట్టి వారి సభయున్నదా. సామాన్యమైనదా. దానిముందు ఇంద్రునిసభ ఎందుకు కొల్పనా. భృత్యులేమి. ఏనుగులు గుఱ్ఱములేమి. రాజులు పనిచేయుటేమి ఆవైభవము చెప్పుటకు ఆదిశేషునికిని వలనుకాదు. మామా రాజులకు జాబులు వ్రాసిరి. వారు వారు వచ్చిరి. ధనాదులు తెచ్చిరి. పోనిమ్ము అదియును అంతదుఃఖముగ లేదు. ద్రౌపది పతివ్రతయా! దానిస్థితిని దలచినటులైన ముఖము చూపకుండవలయును. అట్టిది పాదాది కేశపర్యంతము సర్వాభరణ భూషితయై దివ్యవస్త్రము ధరించి ఋషులముందరను రాజుల ముందరను నిండిన సభలో తిరిగెను. అదితలచిన నామనసు మండుచున్నా. అని దుర్యోధనుడు చెప్పెను. దుర్యోధనుడు ద్రౌపదిని చూచుచున్నాడు. దానిని చూచి వీడు దుఃఖపడవలెను. యాగశాలలోనుండిన చూచుటెటుల అని కృష్ణమూర్తి తలచి ద్రౌపదీ వేయిమంది ఉపచారములు చేసినను యింటివారు విచారించవలయును. అందరిని విచారించుచు ఒకచుట్టు చుట్టుమనెను. ద్రౌపది అటుల చేసెను. స్వామి దుర్యోధనాదులకు నూర్గురికిని నూర్గురు ద్రౌపదులుగను జగన్మోహినిగ కనుబడెను. నన్నే విచారించుచున్నది. నన్నే విచారించుచున్నదని ఒక్కొక్కడును తలచెను. పాండవులకు మంచికీర్తి రావలయునని స్వామి అన్నియాకులముందును ద్రౌపదిరూపముతో విచారించుచుండెను. ఆమెకు శ్రమపెట్టనేలయని స్వామి అన్నిరూపములతో నుండెను. దుర్యోధనులు సంకట పడనిండని అటుల రూపములెత్తిరి. ద్రౌపది వడ్డించుటకు వచ్చినపుడు దుర్యోధనుడు ద్రౌపదీ యనెను. ఆమె నిలిచెను. నీకేవురు భర్తలే. నేడెవరివంతు అనెను. ఆమె తల వంచుకొని పోయెను. పాండవులకును ద్రౌపదికిని కొదువరారాదని స్వామి యోచన. ద్రౌపది యేడ్చుచు పోగా స్వామి పిలిచి సంగతి ఆమెవలన తెలిసికొని యింతయేనా. మరియొకసారి పోయి వడ్డింపుము. అచట నిలుపుము. మరల వాడు అడుగును. అధికప్రసంగి. నీవు తలవంచి తత్కునికంటే అనుము అని, స్వామి నేర్పెను. అటులనే మరియు